

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 17-8-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 140 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: నవమి రా.7.25 తదుపరి దశమి; నక్షత్రం: రోహిణి తె.3.18 తదుపరి మృగశిర; వర్జ్యం: రా.7.45-9.15; దుర్ముహూర్తం: సా.4.55-5.45; అమృతఘడియలు: రా.12.16-1.47; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.36 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అమెరికాలోని అలస్కాలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు స్వాగతం పలుకుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

సుంకాల సంకెళ్లు

తప్పినట్టే!

ట్రంప్, పుతిన్ భేటీ నేపథ్యంలో భారత్‌కు ఉపశమనం

- రష్యా, ఉక్రెయిన్ యుద్ధం నిలిపివేత దిశగా పరిణామాలు
- 25% అదనపు సుంకాల అమలు నిలిచిపోయే అవకాశం!
- రెండో విడత సుంకాలు ప్రస్తుతానికి అవసరం లేదు
- పుతిన్‌తో భేటీ సానుకూలం.. భూభాగాల అప్పగింతపై చర్చ
- శాంతి ఒప్పందానికి జెలెన్‌స్కీ ముందుకు రావాలి: ట్రంప్
- మా భద్రతకు అమెరికా, యూరప్ హామీ ఇవ్వాలి: జెలెన్‌స్కీ
- రేపు వాషింగ్టన్‌లో ట్రంప్, జెలెన్‌స్కీ చర్చలు
- కొన్ని భూభాగాల్ని రష్యాకు అప్పగించడమే పరిష్కారం!
- తొలి నుంచి పుతిన్ డిమాండ్ ఇదే.. ఆ దిశగానే సంధి!

వాషింగ్టన్, న్యూఢిల్లీ, ఆగస్టు 16: ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు దిశగా అడుగులు పడుతున్నాయా? యుద్ధానికి మూల కారణాల్లో ఒకటైన భూభాగాల అప్పగింత ఓ కొలిక్కి వస్తుందా? అలాస్కాలో చర్చలు సఫలమయ్యాయని ట్రంప్, పుతిన్ ఇద్దరూ గట్టిగా చెప్పడం, ఇక అంతా ఉక్రెయిన్, యూరప్ దేశాల చేతిలోనే ఉందని ట్రంప్ ప్రకటించడం ఇందుకు సంకేతమేనా? యుద్ధం ముగింపునకు వస్తే రష్యాపై ఆంక్షలు తొలగుతాయా? ఆ ఆంక్షల వల్ల అమెరికా సుంకాల మోతబారినపడిన భారత్‌కు ఉపశమనం లభిస్తుందా?.. ఈ ప్రశ్నలన్నింటికీ. ట్రంప్, పుతిన్ భేటీ తర్వాతి

మిగతా 2వ పేజీలో...

పులివెందుల పులి..
పిల్లి శాపనార్థాలు!

ధర్మో రక్షతి రక్షితః ..ధర్మాన్ని నీవు రక్షిస్తే ధర్మం నిన్ను రక్షిస్తుంది. పులివెందుల-ఒంటిమిట్ట జడ్పీ స్థానాలకు జరిగిన ఎన్నికలపై ఏపీ మాజీ సీఎం జగన్ చేసిన విమర్శలు విన్న తర్వాత ఈ సూక్తి గుర్తుకురాకుండా ఉండదు. జగన్ ఇటీవల తరచుగా చెబుతున్నట్టుగానే అధికారంలో ఉన్నప్పుడు ఆయనగారు చేసిన అరాచకాలు ఇప్పుడు ఖర్మ రూపంలో ఎదురొస్తున్నాయి. ఖర్మ ఫలాన్ని అనుభవించాల్సిందే.



కొత్త పలుకు!

14 మాసాల క్రితం ఏపీలో నెలకొన్న పరిస్థితులను ప్రజలెవరూ మరచిపోలేక పోతున్నారు. అందుకే అన్యాయం జరిగిందని జగన్ అండ్ కో ఘోషిస్తున్నా మద్దతు లభించడం లేదు. కుప్పంలో చంద్రబాబును ఓడించడానికి చేయని ప్రయత్నం అంటూ లేదు కదా! 'వై నాట్ 175?' అన్నప్పుడు న్యాయం, ధర్మం గుర్తుకురాలేదా? అసెంబ్లీలో ప్రతిపక్షం ఉండకూడదనుకున్నారు కదా? అధికారంలో ఉన్నప్పుడు ధర్మాన్ని రక్షిస్తే అది ఇప్పుడు నిన్ను రక్షించి ఉండేది.

గడచిన 30 ఏళ్లలో టీడీపీ అనేక పర్యాయాలు అధికారంలో ఉంది. అయినా పులివెందుల జడ్పీటీసీని గెలిపించుకోలేకపోయింది. 3 దశాబ్దాల తర్వాత గెలుచుకోగలిగారు. అదీ జగన్ పార్టీకి డిపాజిట్ దక్కకుండా చేస్తూ! ఎంత దొంగ ఓట్లయితే మాత్రం ఫలితం ఇంత దారుణంగా ఉంటుందా?

ఇక, జాతీయ స్థాయిలో ఓట్ల తొలగింపు వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బిహార్ అసెంబ్లీకి త్వరలో జరగనున్న ఎన్నికలను పురస్కరించుకొని ఎన్నికల కమిషన్ అక్కడ 65 లక్షల ఓట్లను తొలగించిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ఆరోపించారు.

ఓట్ల తొలగింపును తీవ్ర అంశంగా పరిగణించిన సుప్రీం కోర్టు మొత్తం తొలగించిన 65 లక్షల ఓట్ల వివరాలను ఈనెల 19లోపు ఎన్నికల కమిషన్ ప్రకటించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈసీ తప్పు చేసినట్టు ఈనెల 19 తర్వాత రుజువైతే రాహుల్ ప్రతిష్ఠ అమాంతం పెరుగుతుంది.

ఏదైనా తిరకాసు జరిగి ఉంటే దాని ప్రభావం ఎన్డీయే ప్రభుత్వంపై కూడా పడుతుంది. మోదీ ప్రభుత్వానికి సంబంధం ఉన్నా లేకపోయినా తప్పు జరిగి ఉంటే ప్రభుత్వమే ఒత్తిడి తెచ్చి ఈసీతో తప్పు చేయించిందని ప్రజలు నిర్ధారణకు వస్తారు.

4



'హసిత బాష్పాలు' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ప్రముఖ కవి అందెశ్రీ తదితరులు

టీవీలు, పేపర్లు, వేల కోట్లు ఉన్నా..
ఉద్యమకారులేనట

- నిజమైన ఉద్యమకారులెవరూ చెప్పుకోరు
- నేను ఎవరినీ శత్రువుగా చూడటం లేదు
- నాకు శత్రువు కావాలన్నా ఓ స్థాయి ఉండాలి
- నా కోపాన్ని ప్రదర్శించుకోవడానికి సీఎంని కాలేదు
- అలా వినియోగిస్తే నాకంటే మూర్ఖుడు ఉండరు
- వారి దుఃఖానికి నా గెలుపు చాలు
- వాళ్లు చేసుకున్న పాపాలకు వాళ్లే పోతారు
- 109 దేశాల సుందరీమణులతో తెలంగాణ గేయం పాడించా.. సీఎంగా ఇది నేను సాధించిన విజయం
- ధర్మ గంట మాదిరిగా అందుబాటులో ఉంటున్నాం
- అందెశ్రీ 'హసిత బాష్పాలు' ఆవిష్కరణలో రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ద్వారా కొంతమందికి ఫామ్‌హౌస్‌లు, టీవీలు, పేపర్లు, వేల కోట్ల ఆస్తులు వచ్చాయని, అయినా ఇంకా తాము ఉద్యమకారులమేనని వాళ్లు చెప్పుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. చాలా మంది తాము ఉద్యమకారులమని చెప్పుకొంటున్నారని, కానీ, నిజమైన ఉద్యమకారులెవరూ అలా చెప్పుకోరని, అందుకు ఉదాహరణ అందెశ్రీ అని వ్యాఖ్యానించారు. ప్రముఖ కవి అందెశ్రీ ప్రచురించిన 'హసిత బాష్పాలు' పుస్తకావిష్కరణ సభ శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొని మాట్లాడారు. "గూడ అంజన్న, దాశరథి, కాళోజీ, గద్దరన్న, అందెశ్రీ, గోరటి వెంకన్న వంటివారు పోరాటానికి, తిరుగుబాటుకు, ధిక్కార స్వరానికి

మిగతా 13వ పేజీలో...

బీసీ రిజర్వేషన్లపై కార్యాచరణ

13

- 20 లేదా 21న.. పీఏసీ భేటీలో చర్చించాక తుది నిర్ణయం
- 22న ఢిల్లీకి రేవంత్.. 23 లేదా 24న క్యాబినెట్..తర్వాత అసెంబ్లీ!
- బిల్లుల్ని త్వరగా ఆమోదించాలని కోరుతూ తీర్మానం చేసే చాన్స్
- కాళేశ్వరంపైనా అసెంబ్లీలో చర్చ, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్



ఆ అధికారం కోర్టులకు లేదు

- బిల్లుల్ని ఆమోదించే విషయంలో రాష్ట్రపతికి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు పెట్టలేదు
- అలా చేస్తే రాజ్యాంగపరమైన గందరగోళం
- సుప్రీంకోర్టుకు తేల్చిచెప్పిన కేంద్ర సర్కారు

న్యూఢిల్లీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వాలు శాసనసభల్లో ఆమోదించి, పంపే బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి గవర్నర్లకు, రాష్ట్రపతికి గడువు విధించడం సరికాదని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీనివల్ల రాజ్యాంగపరమైన గందరగోళం ఏర్పడే ప్రమాదం ఉందని.. ఈ అంశంపై సర్వోన్నత న్యాయస్థానానికి సమర్పించిన లిఖితపూర్వక వాదనల్లో అభిప్రాయపడింది. రాష్ట్రాల

మిగతా 2వ పేజీలో...

విడవని వాన!

- ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు
- అతలాకుతలమైన ఆదిలాబాద్ జిల్లా
- ఇళ్లలోకి చేరిన నీరు.. తెగిన రోడ్లు
- మునిగిన పంటలు.. ఇద్దరి గల్లంతు
- నేడు రాష్ట్రంలో అత్యంత భారీ వర్షాలు!



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నీటమునిగిన సుభాష్‌నగర్ కాలనీ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురవగా.. కొన్ని జిల్లాల్లో మోస్తరు వానలు పడ్డాయి. చాలా చోట్ల చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రోడ్లు తెగిపోయాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. జనజీవనం స్తంభించింది. వేర్వేరు చోట్ల ప్రమాదవశాత్తు ఇద్దరు గల్లంతయ్యారు. పత్తి, సోయా, కంది.. ఇతర పంటలు నీట మునిగాయి. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఆదిలాబాద్ జిల్లాలో ఏకధాటిగా 3 గంటల పాటు అతి భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాలో సాయంత్రం వరకు 10.6 సెం.మీ. సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తాంసి మండలంలో 17.3 సెం.మీ. వర్షం కురిసింది. తలమడుగులో 17, మావలలో 16.6, సాత్నాలలో 15.5, ఆదిలాబాద్ అర్బన్‌లో 15 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్‌లో పలు కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. సుభాష్‌నగర్, రాంనగర్, భాగ్యనగర్, శాంతినగర్, ఓల్డ్ హౌసింగ్‌బోర్డు,

మిగతా 12వ పేజీలో...

అన్ని శాఖల అధికారులు, సిబ్బంది

అప్రమత్తంగా ఉండాలి

- లోతట్టు ప్రాంతాల ప్రజలను సహాయ శిబిరాలకు తరలించాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

12



సూర్యాపేట జిల్లా కేంద్రంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సీఎం సహాయ నిధిని.. దొంగ పేర్లతో దోచేశారు

14

- కోదాడ మాజీ ఎమ్మెల్యే సిబ్బంది చేతివాటం
- లబ్ధిదారులకు డబ్బు ఇవ్వకుండా అవే పేర్లున్న వ్యక్తుల ఖాతాల్లో జమయ్యేలా ఏర్పాట్లు
- ఆపై అంతా కలిసి పంచుకున్న ముఠా
- ఆరుగురి అరెస్ట్.. రూ.9.30 లక్షలు స్వాధీనం

ఓట్ చోరీపై తాడో పేడో!



- బిహార్‌లో నేటి నుంచి రాహుల్ 'ఓట్ అధికార్ యాత్ర'
- 20 జిల్లాల్లో 16 రోజులు
- పెద్ద ఎత్తున పాల్గొననున్న ఇండియా కూటమి పార్టీలు
- ఇది ఎస్ఐఆర్‌పై యుద్ధం
- భారత ప్రజాస్వామ్య చరిత్రలో మైలురాయి: కాంగ్రెస్

పట్నా, ఆగస్టు 16: 'ఓట్ చోరీ'పై తాడో పేడో తేల్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఉద్యమస్థాయిలో విజృంభించేందుకు సిద్ధమైంది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) పేరిట 65 లక్షల ఓట్లను తొలగించడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ.. దీనిని మరింత తీవ్రతరం

మిగతా 2వ పేజీలో...

ఢిల్లీలో నేడు ఈసీ విలేకరుల సమావేశం

ఎస్ఐఆర్, ఓట్ చోరీలపై వివరణ ఇచ్చే అవకాశం

2



మళ్లై జిన్.. మామిడి మద్యం!

- టమాటాతో వోడ్కా, బీట్‌రూట్, క్యారెట్‌తో లిక్కర్
- మందార పువ్వూ ఇకపై మత్తెక్కిస్తుంది
- మార్కెట్లోకి పువ్వులు, పండ్లు, కూరగాయల మద్యం
- ఇప్పటికే యూరప్‌లో ఆదరణ.. 30 వేల కోట్ల మార్కెట్
- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ముందుకు ప్రతిపాదనలు.. కసరత్తు

3

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉంటేనే విద్యుత్తు కనెక్షన్

విద్యుత్తు పంపిణీ సంస్థకు హైకోర్టు స్పష్టీకరణ

13

ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై కసరత్తు ముమ్మరం

2

- నేడు బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీ
- అభ్యర్థిని నిర్ణయించే అవకాశం!
- రేసులో ప్రధానంగా రాజ్‌నాథ్ సింగ్ పేరు
- సెప్టెంబరు 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక

రాష్ట్రంలో గంటకు 2 అబార్షన్లు

ఐదేళ్లలో 917.68 శాతం పెరుగుదల

- గర్భవిచ్ఛిత్తిలో దేశంలోనే అగ్రస్థానం.. దేశవ్యాప్తంగా ఐదేళ్లలో 67 శాతం వృద్ధి
- మందులతోపాటు ఇతర కారణాలతో అయ్యే అబార్షన్లూ వైద్య శాఖ లెక్కల్లోకి
- పెళ్లైన వెంటనే గర్భం వస్తే వద్దనుకుంటున్న పలువురు దంపతులు
- పిండంలో లోపాలు ఉంటే గర్భవిచ్ఛిత్తికే మొగ్గుచూపుతున్న వైనం




హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతీ గంటకు సగటున రెండు అబార్షన్లు జరుగుతున్నాయి. గత ఐదేళ్లలో తెలంగాణలో గర్భ విచ్ఛిత్తి రేటు ఏకంగా 917.68 శాతం పెరిగింది. 2020-21 నుంచి 2024-25 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో నమోదైన మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ(ఎంటీపీ) వివరాలను కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ పార్లమెంట్‌కు నివేదించింది. తెలంగాణలో 2020-21లో 1,578 ఎంటీపీలు జరగ్గా.. 2024-25 నాటికి ఆ సంఖ్య 16,059కు పెరిగింది. దేశవ్యాప్తంగా ఐదేళ్లలో ఎంటీపీల పెరుగుదలలో తెలంగాణ అగ్రభాగాన నిలిచింది. అలాగే 2020-21లో అన్ని రాష్ట్రాల్లో కలిపి 5,34,008 ఎంటీపీలు జరగ్గా.. 2024-25 నాటికి ఆ సంఖ్య 8,93,372కు చేరింది. అంటే దేశవ్యాప్తంగా గర్భస్రావాలు ఐదేళ్లలో 67 శాతం పెరిగాయి. ఎంటీపీల టాప్ జాబితాలో నాలుగు దక్షిణాది రాష్ట్రాలున్నాయి. 917.6 శాతం పెరుగుదలతో దేశంలోనే తొలి

మిగతా 14వ పేజీలో...

దేశ విభజన దోషులు వీళ్లే!

- జిన్నా డిమాండ్‌కు కాంగ్రెస్ ఓకే.. మౌంట్ బాటన్ అమలు
- విభజన వల్లే కశ్మీర్ సమస్య.. ప్రత్యేక మాడ్యూల్లో ఎన్సీఈఆర్టీ



ఎన్సీఈఆర్టీ సెకండరీ స్టేజ్ ప్రత్యేక మాడ్యూల్ కవర్ పేజీ


న్యూఢిల్లీ, ఆగస్టు 16: ఎన్సీఈఆర్టీ మరోసారి వార్తల్లో నిలిచింది. దేశ విభజనపై పలు కీలక అంశాలను ప్రస్తావిస్తూ విద్యార్థుల కోసం తాజాగా ఒక ప్రత్యేక మాడ్యూల్‌ను విడుదల చేసింది. 'విభజన భయానకాల స్మారక దినం'ను పురస్కరించుకొని విడుదల చేసిన దానిలో.. భారతదేశ విభజనకు మహ్మద్ అలీ జిన్నా ఒక్కరే కారణం కాదని, ఆయన డిమాండ్‌ను ఆమోదించిన కాంగ్రెస్, అమలు చేసిన అప్పటి వైస్రాయి లార్డ్ మౌంట్‌బాటన్‌లు కూడా అని పేర్కొంది. 'విభజన దోషులు' అనే సెక్షన్‌లో ఈ ప్రస్తావన చేసింది. విభజన తర్వాత భారత్‌కు కశ్మీర్ ఒక కొత్త సమస్యగా మారిందని, దేశ విదేశాంగ విధానానికి సవాల్ సృష్టించిందని పేర్కొంది. ఎన్సీఈఆర్టీ మాడ్యూల్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరును కూడా ప్రస్తావించింది. భారత్‌లో అంతర్యుద్ధం కంటే దేశాన్ని విభజించడం మంచిదని ఆయన అభిప్రాయపడినట్లు పేర్కొంది. మహాత్మా గాంధీ వైఖరి గురించి చెప్తూ.. విభజనను ఆయన వ్యతిరేకించారని, కానీ హింస ద్వారా కాంగ్రెస్ నిర్ణయాన్ని ఆపలేనని గాంధీ చెప్పినట్లు మాడ్యూల్‌లో పేర్కొన్నారు. దేశ విభజనపై 6-8 తరగతులు (మిడిల్ స్టేజ్), 9-12 తరగతుల (సెకండరీ స్టేజ్) విద్యార్థుల కోసం రెండు వేర్వేరు మాడ్యూల్స్‌ను ప్రచురించింది. ఈ మాడ్యూళ్లపై రాజకీయ దుమారం రేగింది. పుస్తకంలో పేర్కొన్న అంశాలను కాంగ్రెస్ నేత పవన్ ఖేరా తిప్పికొట్టారు. హిందూ మహాసభ, ముస్లిం లీగ్ మధ్య సహకారం వల్లే భారత్, పాక్ విభజన జరిగిందని, ఇదీ వాస్తవమని అన్నారు. 'చరిత్రలో అతిపెద్ద విలన్ అంటే అది ఆరెస్సెస్. ఆ సమయంలో 25 ఏళ్ల గూఢచర్యం పాత్ర పోషించిన ఆ సంస్థను భవిష్యత్తు తరాలు క్షమించవు. ఆ గూఢచర్యంలో ముస్లింలు, జిన్నాతో భాగస్వామ్యం ఉంది' అని ఆరోపించారు. 'ఈ అంశాలన్నింటినీ ప్రస్తావించకపోతే.. ఆ పుస్తకాన్ని తగలబెట్టండి' అని ఆయన అన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి షెహబాజ్ పూనావాలా మాట్లాడుతూ తనకు అనుకూలంగా లేనప్పుడు చరిత్ర నుంచి కాంగ్రెస్ పారిపోతుందన్నారు.

'సిందూర్'లో 13 మంది పాక్ సైనికులు హతం

న్యూఢిల్లీ, ఆగస్టు 16: ఆపరేషన్ సిందూర్ వల్ల 13 మంది సైనిక అధికారులు సహా మొత్తం 50కిపైగా ప్రాణాలను కోల్పోయినట్టు పాకిస్థాన్ ఎట్టకేలకు అంగీకరించింది. పాక్ అధికార వర్గాలు శనివారం ఒక ఆంగ్ల టీవీ చానల్‌కు ఈ విషయాన్ని నిర్ధారించాయి. ఆపరేషన్ సిందూర్ కారణంగా తమకు భారీగా ప్రాణ నష్టం జరిగినట్టు మూడు నెలల తర్వాత ఇప్పుడు పాకిస్థాన్ అంగీకరించింది. భోలారీ వైమానిక స్థావరంపై భారత దాడిలో స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసఫ్ మరణించిన విషయాన్ని అతనికి మరణానంతరం ప్రెసిడెన్సీ అవార్డును ప్రదానం చేయడం ద్వారా పాకిస్థాన్ తాజాగా నిర్ధారించింది. ఆపరేషన్ సిందూర్‌లో చనిపోయిన మిలిటరీ అధికారులకు పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవం(ఆగస్టు 14) సందర్భంగా గురువారం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్ష భవనంలో అవార్డులను ప్రదానం చేశారు. వీరిలో హవల్దార్ ముహమ్మద్ నవీద్, నాయక్ వకార్ ఖాలిద్, లాన్స్ నాయక్ దిలావర్ ఖాన్ తదితరులకు మరణానంతరం తంఘా-ఐ-బసలత్ అవార్డులు దక్కాయి. నాయక్ అబ్దుల్ రెహ్మాన్, లాన్స్ నాయక్ ఇక్రముల్లా, సిపాయి అదీల్ అక్బర్ తదితరులకు తంఘా-ఐ-జురత్ అవార్డులను అందజేశారు.

కంపెనీలో వాటాను 14వేల కోట్లకు అమ్మి రూ.13వేల కోట్లు దానమిచ్చేశాడు


- యాప్‌నెక్సస్ సంస్థ మాజీ సీఈవో బ్రియాన్ దాతృత్వం



నూఢిల్లీ, ఆగస్టు 16: ఎవరైనా తాము సంపాదించిన దాంట్లో పదో.. పరకో.. దానం చేస్తారు. కానీ, ఓ కంపెనీ మాజీ సీఈవో కంపెనీలో తనకున్న వాటాను రూ.14వేల కోట్లకు(1.6బిలియన్ డాలర్లు) అమ్మేసి అందులో రూ.13వేల కోట్లను దానం చేసేశారు. అడ్వర్టైజింగ్ టెక్నాలజీ కంపెనీ యాప్‌నెక్సస్ సహ వ్యవస్థాపకుడు, మాజీ సీఈవో బ్రియాన్ కెల్లీ ఈ ఘనత వహించారు. తాజాగా ఫార్చ్యూన్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. యాప్‌నెక్సస్ కంపెనీలో బ్రియాన్‌కు 10% వాటా ఉండేది. 2018లో ఆయన దాన్ని 'ఏటీ అండ్ టీ' సంస్థకు విక్రయించారు. దీంతో ఆయనకు రూ.14వేల కోట్లు(1.6బిలియన్ డాలర్లు) వచ్చాయి. ఇందులో దాదాపు 900కోట్లను(100మిలియన్ డాలర్లు) తమ కుటుంబం కోసం ఉంచుకొని మిగతా 13వేల కోట్లను విరాళంగా ఇచ్చేశారు. "బిలియనీర్‌గా ఉండటంపై, బిలియనీర్ లైఫ్‌స్టైల్ పైన నాకు ఆసక్తి లేదు. అందుకే నాకు, నా కుటుంబానికి ఎంత డబ్బు అవసరమో అంతే ఉంచుకోవాలని అనుకున్నా. ఈ విషయం నా భార్యతో చర్చించా. భవిష్యత్తు అవసరాల కోసం 100 మిలియన్ డాలర్లు చాలని మేమిద్దరం నిర్ణయించుకున్నాం" అని ఆయన తెలిపారు. యాప్‌నెక్సస్ కంపెనీలో తన వాటాను విక్రయించాక బ్రియాన్ స్కోప్3 స్టార్టప్‌ను ప్రారంభించారు.

రోబోకు అమ్మతనం!

- బిడ్డను గర్భంలో మోసి జన్మనిచ్చే హ్యూమనాయిడ్ రోబోలను అభివృద్ధి చేస్తున్న చైనా

ఏఐ చిత్రం


హైదరాబాద్, ఆగస్టు 16: రజనీకాంత్ నటించిన రోబో సినిమా గుర్తుందా ? సనా(ఐశ్వర్యరాయ్)ను పెళ్లిపీటల మీద నుంచి ఎత్తుకొచ్చిన చిట్టి(రోబో).. తాను అభివృద్ధి చేసిన కృత్రిమ జీవకణాన్ని సనా గర్భంలో ప్రవేశపెడతానంటాడు. మనిషికి, యంత్రానికి పుట్టిన తొలి బిడ్డకు జన్మనిద్దామని సనాకు చెబుతాడు. ఇన్నాళ్లూ సినిమాకే పరిమితమైన ఈ మాటలను కృత్రిమ మేధ(ఏఐ) నిజం చేయబోతుంది. అవును.. మనిషికి రోబోకు పుట్టిన సంతానాన్ని చూసే రోజులు రాబోతున్నాయి. చిట్టి చెప్పినట్టు కాదు కానీ.. గర్భం దాల్చి నవ మాసాలు బిడ్డను మోసి జన్మనిచ్చే హ్యూమనాయిడ్ రోబోలను చైనా శాస్త్రవేత్తలు తయారు చేస్తున్నారు. రోబోలకు అమ్మతనాన్ని ఇచ్చేలా సింగపూర్‌లోని నాన్‌యాంగ్ టెక్నాలజికల్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ జాంగ్ కీఫెంగ్ నేతృత్వంలోని బృందం ప్రపంచంలోనే తొలిసారిగా 'ప్రెగ్నెన్సీ రోబో'ను అభివృద్ధి చేస్తోంది. చైనా మీడియా కథనాల ప్రకారం.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇంక్యుబేటర్లకు ప్రెగ్నెన్సీ రోబోలకు ఏమాత్రం సంబంధం లేదు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కృత్రిమంగా అభివృద్ధి చేసిన గర్భసంచి ఈ ప్రెగ్నెన్సీ రోబోల్లో ఉంటుంది. ఆర్టిఫిషియల్ అమ్నియోటిక్ ద్రవాలతో నిండి ఉండే ఈ కృత్రిమ గర్భసంచి అచ్చం మానవ గర్భసంచిలానే పని చేస్తుంది. నిజజీవితంలో గర్భధారణ నుంచి ప్రసవం వరకు జరిగే ప్రక్రియ అంతా ప్రెగ్నెన్సీ రోబో గర్భంలో అలానే జరుగుతుంది. గర్భసంచిలోని శిశువు ఎదుగుదలకు కావాల్సిన పోషకాలను గొట్టాల ద్వారా అందిస్తారు. నిజానికి, ఈ కృత్రిమ గర్భం కొత్త విధానం కాదని డాక్టర్ జాంగ్ చెప్పారు. బయో బ్యాగ్ పేరిట అభివృద్ధి చేసిన కృత్రిమ గర్భసంచి సాయంతో గతంలో కొందరు శాస్త్రవేత్తలు ఓ గొర్రె పిల్ల పుట్టేలా చేశారని వివరించారు. ఆ గొర్రెల పిల్ల జీవించడమే కాక దానికి ఉన్ని కూడా పెరిగిందని చెప్పారు. ఈ బయో బ్యాగ్ సాంకేతికతను మరింత మెరుగుపరుస్తూ ప్రెగ్నెన్సీ రోబోలను అభివృద్ధి చేస్తున్నారు. ప్రెగ్నెన్సీ రోబోల ప్రోటోటైప్ వచ్చే ఏడాదికి సిద్ధమవుతుందని, ఇందుకు రూ.12.96 లక్షల వరకు వ్యయం అవుతుందని జాంగ్ పేర్కొన్నారు.

ఓట్ చోరీపై తాడో పేడో!

(మొదటి పేజీ తరువాయి)

చేయనుంది. ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని తెలియజేయడంతోపాటు, ఎస్ఐఆర్ ద్వారా ఓటు హక్కుపై జరుగుతున్న దాడిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం నుంచి 'ఓట్ అధికార్' పేరుతో యాత్ర చేపట్టనున్నారు. సెప్టెంబరు 1వ తేదీ వరకు నిర్వహించే ఈ యాత్ర మొత్తం 16 రోజులు పాటు 20 జిల్లాల్లో కొనసాగుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు అఖిలేశ్ ప్రసాద్ సింగ్ తెలిపారు. శనివారం ఆయన పట్నాలో మాట్లాడుతూ... యాత్ర జరిగే 16 రోజుల పాటు రాహుల్ గాంధీ బిహార్‌లోనే ఉంటారని, సెప్టెంబరు 1న రాష్ట్ర రాజధాని పట్నాలో యాత్ర ముగియనుందని వివరించారు. "ఓట్ అధికార్ యాత్రను ససారం నుంచి ఆదివారం రాహుల్ గాంధీ ప్రారంభిస్తారు. దీనికి సంబంధించిన అన్ని అనుమతులు ఇప్పటికే తీసుకున్నాం. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇండియా బ్లాక్ తరఫున నిర్వహించే ఈ యాత్రను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాం. సుమారు 15 రోజుల పాటు రాహుల్ రాష్ట్రంలోనే ఉండనున్నారు. యాత్రను ముందుండి నడిపించనున్నారు. ఈ నెల 20, 25, 31 తేదీల్లో మినహా.. మిగిలిన అన్ని రోజులు యాత్ర కొనసాగుతుంది. తొలి రోజు యాత్రలో రాహుల్‌తో కలిసి ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ సహా ఇండీ కూటమి నేతలు పాల్గొంటారు. మాతో కలిసివచ్చే ఇతర పార్టీల నాయకులను కూడా కలుపుకొని వెళ్తాం." అని అఖిలేశ్ ప్రసాద్ సింగ్ అన్నారు. ఈ యాత్రను ఎస్ఐఆర్‌పై యుద్ధంగా అభివర్ణించారు. మరో నేత పవన్ ఖెరా మాట్లాడుతూ.. ఈయాత్ర భారత ప్రజాస్వామ్య చరిత్రలో అతిపెద్ద మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. "ఓటు దొంగిలించడమేకాదు.. ప్రజల గుర్తింపును కూడా దొంగిలిస్తున్నారు." అని ఖెరా విమర్శించారు.

చంద్రబాబూ ఆందోళన వ్యక్తం చేశారు

ఓట్ల అక్రమాలపై వీధుల్లోకి రావడం తప్ప.. తమకు మరో మార్గం లేకుండా పోయిందని అఖిలేశ్ ప్రసాద్ సింగ్ అన్నారు. ఈ విషయంపై పార్లమెంటులో చర్చించాలని కోరినా తమ విజ్ఞప్తిని పెడచెవిన పెడుతున్నారని అన్నారు. అందుకే ప్రజల మధ్యకు రావాలని నిర్ణయించుకున్నామన్నారు. ఎన్నికల సంఘం వ్యవహారం... రాజ్యాంగం మూర్ఖులు, మోసగాళ్ల నుంచి అతిపెద్ద ముప్పును ఎదుర్కొంటుందని అంబేడ్కర్ చేసిన హెచ్చరికను గుర్తుకు తెచ్చేలా ఉందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్‌పై అన్ని పార్టీలూ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని అఖిలేశ్ ప్రసాద్ సింగ్ అన్నారు. వీటిలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు కూడా ఉన్నాయని, ఏపీ సీఎం చంద్రబాబు కూడా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. ఎస్ఐఆర్ పేరుతో లక్షల మంది ఓట్లను జాబితాల నుంచి తొలగిస్తుండడం పట్ల ప్రతి ఒక్కరిలోనూ ఆవేదన ఉందన్నారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ కూడా ఎస్ఐఆర్‌పై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, ఈ విషయాన్ని తనకు స్వయంగా ఆయన చెప్పారని అఖిలేశ్ ప్రసాద్ సింగ్ సంచలన వ్యాఖ్య చేశారు. అయితే.. బయట మాత్రం పార్టీలైన్‌కు అనుగుణంగా గిరిరాజ్ మాట్లాడుతున్నారని అన్నారు.



యాత్ర జరిగే రోజులు : 16
కొనసాగనున్న జిల్లాలు : 20
మొత్తం దూరం : 1300 కి.మీ.

ఇక, జరగనివ్వం: రాహుల్

ఓట్ల చోరీ ఇకపై జరగనివ్వబోమని, ప్రజలు మేల్కొన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఓటును తస్కరించడమంటే.. హక్కులను తస్కరించడమేనని చెప్పారు. "ఏమాత్రం అలికిడి లేకుండా ఓట్లు తస్కరించేస్తున్నారు. కానీ, ప్రజలు ఇప్పుడు మేల్కొన్నారు. ఇకపై చోరీ జరగదు. మన హక్కులు కాపాడుకునేందుకు, ఓట్ చోరీపై ఐక్యగళం వినిపిద్దాం." అని రాహుల్ వ్యాఖ్యానించారు. కాగా, 'ఓటు చోరీ ఆపండి' పేరుతో భారత యువజన కాంగ్రెస్(ఐవైసీ) శనివారం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఐవైసీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాల్లోని ఓటర్ల వివరాలను అధికారిక జాబితాతో పోల్చి సరిచూడనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఐవైసీ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్.. జమ్ము ఉత్తర నియోజకవర్గంలో లాంఛనంగా ప్రారంభించారు.

చోరీపై 'లాపతా ఓట్' వీడియో

ఓట్ చోరీపై శనివారం రాహుల్ 'లాపతా ఓట్'(ఓటు కోల్పోయిన) పేరుతో 'ఎక్స్'లో ఓ వీడియోను షేర్ చేశారు. దీనిలో ఓ వ్యక్తి పోలీసు స్టేషన్‌కు వచ్చి.. తన ఓటు చోరీ చేశారని, తనదే కాకుండా.. లక్షల మంది ఓట్లు కూడా చోరీ చేశారని ఫిర్యాదు చేస్తాడు. దీంతో పోలీసులు తమ సంగతేంటని వారి ఓట్లను పరిశీలించుకుంటారు. అయితే, జాబితాలో వారి ఓట్లు కూడా గల్లంతుకావడంతో నిర్ఘాంతపోవడంతో వీడియో ముగుస్తుంది. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ.. ఓట్ చోరీని 'డూ ఆర్ డై'(జీవించడమా-మరణించడమా)గా పేర్కొంది.

రాహుల్ ఆరోపణలపై నేడు ఈసీ స్పష్టత!

- ఢిల్లీలో విలేకర్ల సమావేశం నిర్వహించనున్న ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఓట్ చోరీ ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల సంఘం(ఈసీ) ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ మీడియా సమావేశం అజెండా ఏమిటనేది అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ.. ప్రతిపక్షాల నిరసన, ఆరోపణల మీద సమాధానం ఇవ్వటం కోసమే నిర్వహిస్తున్నట్లు ఈసీ వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించటానికి తప్ప ఇతర అంశాలపై ఈసీ విలేకరుల సమావేశం జరపటం చాలా అరుదు. బిహార్‌లో రాహుల్ చేపట్టనున్న 'ఓట్ అధికార్ యాత్ర' ఆదివారం నుంచే ప్రారంభం కానుండటం గమనార్హం. మరోవైపు, ఆరోపణలపై రుజువులు సమర్పించాలని రాహుల్ గాంధీకి నోటీసులిచ్చిన ఎన్నికల సంఘం అధికారులు బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ చేసిన ఆరోపణలపైన కూడా ఎందుకు నోటీసులివ్వలేదని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. దేశంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు గెల్చిన నియోజకవర్గాల్లో నకిలీ ముస్లిం ఓటర్లు ఉన్నారని, ఆ ఓట్లతోనే వారు గెలిచారని, వారి ఎన్నికను రద్దు చేయాలని అనురాగ్ ఈ నెల 14న ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ నేత పవన్‌ఖేరా స్పందిస్తూ.. ఈసీ ఎలక్ట్రానిక్ డేటా ఇవ్వకపోవటం వల్ల ఒక్క మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో డేటాను విశ్లేషించేందుకే తమకు 6 నెలల సమయం పట్టిందని, అనురాగ్ ఠాకూర్‌కు మాత్రం ఆరు లోక్‌సభ సీట్ల తాలూకు ఎలక్ట్రానిక్ డేటా ఎలా లభించిందని ప్రశ్నించారు. ఆయనకు ఈసీ నోటీసులు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఇదిలా ఉండగా, ఓట్లచోరీ అంశంపై ఆరోపణలకు సంబంధించి రాహుల్‌గాంధీ ఈసీకి అఫిడవిట్ సమర్పించాల్సిన అవసరం లేదని, ముసాయిదా ఓటర్ల జాబితా పేర్లపై అభ్యంతరాలు లేవనెత్తినప్పుడు మాత్రమే అఫిడవిట్ అవసరమని ఎన్నికల మాజీ సీఈసీ ఓపీ రావత్, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ ఆచారి స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై ఈసీ ఆదివారం సమావేశంలో వివరణ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

లోకం తీరు



అప్పుడే చెప్తే తప్పులు దిద్దేవాళ్లం!

కొన్ని పార్టీలు ఓటర్ జాబితాలను సరైన సమయంలో పరిశీలించనట్టుంది: ఈసీ

న్యూఢిల్లీ, ఆగస్టు 16: బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై విపక్షాలన్నీ నిప్పులు చెరుగుతూ, జాబితాలో ఉన్న తప్పులపై ప్రశ్నిస్తుండడంపై ఈసీ స్పందించింది. "ఇటీవలికాలంలో కొన్ని రాజకీయ పార్టీలు, కొంతమంది వ్యక్తులు ఓటర్ల జాబితాలో తప్పుల గురించి చెబుతున్నారు. గత జాబితాల్లో తప్పుల గురించి కూడా ఇప్పుడు ప్రస్తావిస్తున్నారు. వీటన్నింటినీ చూస్తుంటే.. ఆయా రాజకీయ పార్టీలు, ఆ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు.. ఓటర్ల జాబితాలను సరైన సమయంలో పరిశీలించి, తప్పులను గుర్తించి సంబంధిత ఎన్నికల అధికారులతో పంచుకోనట్టు కనిపిస్తోంది" అని వ్యాఖ్యానించింది. ఓటరు జాబితాలో ఓటర్ల చేరికలు, తీసివేతలకు సంబంధించిన ప్రక్రియను గురించి పది పాయింట్లతో శనివారం ఒక ప్రెస్‌నోట్‌ను విడుదల చేసిన ఈసీ.. ముసాయిదా జాబితాలను, ఖరారైన తర్వాత ఆ జాబితాలను కూడా అన్ని రాజకీయ పార్టీలకూ పంపుతామని.. వాటిలో ఏవైనా అభ్యంతరాలుంటే పార్టీలు ఆ జాబితాలను పరిశీలించి, అప్పుడే చెప్పాలని గుర్తుచేసింది. ఇప్పుడు లేవనెత్తుతున్న అభ్యంతరాలను అప్పుడే (సరైన సమయంలో), సరైన పద్ధతిలో లేవనెత్తి ఉంటే సంబంధిత అధికారులు అప్పట్లోనే ఆ తప్పులను (అవి నిజమైన తప్పులే అయి ఉంటే) దిద్ది ఉండేవారని పేర్కొంది. రాజకీయ పార్టీలు లేదా ఓటర్లు ఓటర్ల జాబితాను ఎప్పుడు పరిశీలిస్తామన్నా తాము స్వాగతిస్తామని ఈసీ స్పష్టం చేసింది. దీనివల్ల తప్పులను తొలగించడం సులువవుతుందని తెలిపింది.

సుంకాల సంకెళ్లు తప్పినట్టే!

(మొదటి పేజీ తరువాయి)

పరిణామాలు సానుకూల సంకేతాలు ఇస్తున్నాయి. రష్యాతోపాటు భారత్‌పై ఆంక్షలు, సుంకాలు పెంచుతానంటూ హూంకరించిన ట్రంప్.. ప్రస్తుతానికి అవేమీ లేనట్టేనని చెప్పడం కూడా మంచి పరిణామమని భారత వర్గాలు చెబుతున్నాయి. అయితే భూభాగాల అప్పగింతకు జెలెన్‌స్కీ నిరాకరిస్తుండటం, ఇన్నాళ్లూ ఉక్రెయిన్ అంశంలో కీలకంగా వ్యవహరించిన యూరోపియన్ దేశాలు చర్చల్లో తమను భాగస్వామ్యం చేయలేదన్న కినుకతో ఉండటం వంటివి ఇబ్బందిగా మారాయి. ఏదేమైనా సోమవారం అమెరికాలో జరిగే ట్రంప్, జెలెన్‌స్కీ భేటీ తర్వాత దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఇప్పుడిక జెలెన్‌స్కీ చేతిలో ఉంది: ట్రంప్

పుతిన్‌తో భేటీ అనంతరం ఎయిర్‌ఫోర్స్ విమానంలో మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. "పుతిన్‌తో భేటీ చాలా బాగా జరిగింది. రెండో విడత సుంకాల విధింపు ప్రస్తావన ప్రస్తుతానికి అవసరం లేదనుకుంటున్నాను. రెండు, మూడు వారాల్లోనో, ఆ తర్వాతనో దీనిపై ఆలోచిస్తా. ఒకవేళ ఇప్పుడే విధిస్తే అది వాళ్ల (రష్యా, మిత్రదేశాల)కు తీవ్రమైన దెబ్బ" అని పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు నిలిపివేస్తోంటూ.. రష్యా ఒక పెద్ద చమురు కొనుగోలుదారును కోల్పోయిందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇక పుతిన్‌తో సుమారు 3గంటల పాటు చర్చలు జరిపిన విషయాన్ని గుర్తు చేస్తూ.. యుద్ధ విరమణ అంశం ఇప్పుడు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, యూరోపియన్ దేశాల చేతిలో ఉందని ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం చేసుకోవాలని సూచించారు. రష్యా బలమైన దేశమని, ఉక్రెయిన్ కాదని వ్యాఖ్యానించారు ఇరుదేశాల్లో బందీలుగా ఉన్న వేలాది మంది యుద్ధ ఖైదీలు త్వరలోనే విడుదలవుతారని చెప్పారు.


రేపు ట్రంప్, జెలెన్‌స్కీ భేటీ

పుతిన్‌తో ట్రంప్ భేటీ, యుద్ధం నిలిపివేతపై చర్చల నేపథ్యంలో సోమవారం అమెరికాలోని వాషింగ్టన్‌లో ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భేటీకానున్నారు. పుతిన్‌తో భేటీ అయి వాషింగ్టన్‌కు తిరిగి వెళ్తున్న ట్రంప్‌తో గంటన్నర పాటు ఫోన్‌లో మాట్లాడానని జెలెన్‌స్కీ వెల్లడించారు. ఉక్రెయిన్ భద్రత కోసం శాంతి చర్చల ప్రక్రియలతో అమెరికాతోపాటు యూరప్ దేశాల భాగస్వామ్యం కూడా కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉక్రెయిన్ భద్రతకు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే భూభాగాల అప్పగింత కోసం పుతిన్ డిమాండ్ చేసినట్లు జెలెన్‌స్కీకి ట్రంప్ వివరించారని.. దీనికి జెలెన్‌స్కీ నిరాకరించారని కీవ్ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు జెలెన్‌స్కీతో చర్చల్లో సానుకూలత వస్తే.. త్వరలో పుతిన్‌తో మరో సమావేశం ఏర్పాటు చేస్తామని ట్రంప్ పేర్కొన్నారు.

యుద్ధం త్వరగా ముగియాలి: భారత్

ట్రంప్, పుతిన్ చర్చలను భారత్ స్వాగతించింది. "శాంతి కోసం వారు చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం. దౌత్యం, చర్చల ద్వారానే సమస్య పరిష్కారం అవుతుంది. ఉక్రెయిన్, రష్యా యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలని ప్రపంచం కోరుకుంటోంది" అని విదేశాంగ శాఖ పేర్కొంది.

20% భూభాగాల అప్పగింతే.. శాంతి?



ఉక్రెయిన్ అంశంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌దే పైచేయి అవుతోంది. రష్యా చేస్తున్న డిమాండ్లకు అనుగుణంగానే యుద్ధ విరమణ, శాంతి ఒప్పందం దిశగా పరిణామాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో భాగంగా ఉన్న ఖేర్సన్, జపోరిజియా, డోనెట్స్క్, లుహాన్స్క్ ప్రాంతాలు, క్రిమియా ద్వీపకల్పం తమవేనని రష్యా ఎప్పటినుంచో వాదిస్తోంది. ఈ ప్రాంతాలను తమకు అప్పగించాలని కోరుతోంది. దానికితోడు రష్యాకు శత్రుదేశాల కూటమి అయిన నాటోలో ఉక్రెయిన్ చేరడానికి ప్రయత్నించడమూ పుతిన్‌కు ఆగ్రహం తెప్పించింది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌పై యుద్ధం మొదలుపెట్టారు. యుద్ధానికి 'మూల కారణాలు' ఇవేనని, అవి పరిష్కారమైతే యుద్ధం ప్రసక్తే ఉండదని ప్రకటించారు. రష్యా కోరుతున్న ప్రాంతాలు ఉక్రెయిన్ మొత్తం భూభాగంలో 20శాతం మేర ఉంటాయి. ఇందులో క్రిమియా ద్వీపకల్పాన్ని, డోనెట్స్క్‌లో చాలా భాగాన్ని 2014లోనే రష్యా ఆక్రమించింది. తాజాగా యుద్ధంలో మొత్తం లుహాన్స్క్‌తోపాటు ఖేర్సన్, జపోరిజియా రీజియన్లలో చాలా భాగం రష్యా ఆధీనంలోకి వెళ్లాయి. అయితే వీటిని అధికారికంగా, శాశ్వతంగా అప్పగించాలని రష్యా డిమాండ్ చేస్తోంది. ఇక శాంతి ఒప్పందంలో భాగంగా భూభాగాల మార్పిడి ఉంటుందని ట్రంప్ వారం రోజుల క్రితమే చెప్పారు. పుతిన్‌తో భేటీ తర్వాత కూడా.. భూభాగాల అప్పగింత కోసం రష్యా డిమాండ్ చేస్తోందని, ఇప్పుడంతా జెలెన్‌స్కీ చేతిలోనే ఉందని ట్రంప్ స్పష్టంగా వెల్లడించారు. ఈ క్రమంలో రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం ముగింపునకు వచ్చినట్టేని.. భారత్‌కు ఉపశమనమేనని భారత అధికారులు చెబుతున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే భారత్‌పై అమెరికా అడ్డగోలు సుంకాలు విధించిందని గుర్తు చేస్తున్నారు. యుద్ధం సద్దుమణిగితే.. రష్యాతోపాటు భారత్‌పైనా ఆంక్షలు, సుంకాలు తొలగిపోయే అవకాశాలు ఎక్కువని చెబుతున్నారు. భారత్‌పై విధించిన 25శాతం అదనపు సుంకం అమల్లోకి వచ్చే ఆగస్టు 27వ తేదీనాటికి అంతా కొలిక్కి రావొచ్చని... ఈ అదనపు సుంకాలను తొలగించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై కసరత్తు ముమ్మరం

నేడు బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీ.. రేసులో రాజ్‌నాథ్



న్యూఢిల్లీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక కోసం అధికార, విపక్ష పార్టీలు కసరత్తు ముమ్మరం చేశాయి. శుక్రవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా నివాసంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ సహా సీనియర్ నేతలు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఆదివారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశం కాబోతోంది. ఇందులో ప్రధానంగా ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిపైనే చర్చ జరిగే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ప్రధాని మోదీతోపాటు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, తెలంగాణకు చెందిన ఎంపీ లక్ష్మణ్‌తో పాటు ఇతర పార్లమెంటరీ బోర్డు సభ్యులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. ఇప్పటికే స్పష్టతకు వచ్చిన కొన్ని పేర్లపై చర్చించి ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని బీజేపీ వర్గాల ద్వారా తెలిసింది. ఇందులో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. జాట్ సామాజిక వర్గానికి చెందిన ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ దన్‌ఖడ్ స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో భర్తీ చేస్తారనే ప్రచారమూ జరుగుతోంది. ప్రస్తుతం రేసులో ఉన్న గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ జాట్ వర్గానికి చెందిన వ్యక్తే. ఢిల్లీ ఎల్జీ వీకే సక్సేనా, బిహార్ గవర్నర్ ఆరిఫ్ ఖాన్, కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, సిక్కిం గవర్నర్ ఓం మాథుర్, జమ్మూకశ్మీర్ ఎల్జీ మనోజ్ సిన్హా పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. అలాగే, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త శేషాద్రి చారి అభ్యర్థిత్వంపైనా చర్చిస్తున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. సెప్టెంబరు 21న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది.

ఆ అధికారం కోర్టులకు లేదు

(మొదటి పేజీ తరువాయి)

బిల్లులపై ఆమోదం తెలిపే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్ల విచక్షణాధికారాలకు సంబంధించి.. రాజ్యాంగంలోని 200, 201 అధికరణల్లో ఎలాంటి కాలపరిమితీ లేదని గుర్తు చేసింది. ఈ అధికరణల కింద లభించిన అధికారాలను యాంత్రికంగా అమలు చేయడం సాధ్యం కాదని, వాటిని రాజ్యాంగ బాధ్యతల్లో భాగంగా భావించాలని కేంద్రం తెలిపింది. గవర్నర్లకు, రాష్ట్రపతికి.. ఉద్దేశపూర్వకంగానే రాజ్యాంగంలో ఎలాంటి కాలపరిమితీ నిర్దేశించలేదని.. అలా గడువు విధించడం వల్ల రాజ్యాంగ బాధ్యతలను వారు సరిగా నిర్వహించలేరని తెలిపింది. న్యాయ పరమైన ఆదేశాల ద్వారా కాల పరిమితిని నిర్దేశించడం సరైంది కాదని, అందుకు రాజ్యాంగంలో సవరణ చేయాల్సి ఉంటుందని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం కోర్టుకు స్పష్టం చేశారు. కాలపరిమితి అంశం 368 అధికరణ కింద పూర్తిగా పార్లమెంట్ అధికార పరిధిలోకి వస్తుందని స్పష్టంగా రాజ్యాంగ సవరణ చేయకుండా ఎలాంటి గడువూ విధించలేరని ఆయన వెల్లడించారు. జాతీయ ప్రయోజనాలు, జాతీయ స్థాయిలో ప్రజల అభిప్రాయాలను గవర్నర్లు/రాష్ట్రపతి ప్రతిబింబిస్తారని.. గవర్నర్లు కేవలం కేంద్ర దూతలు కారని పేర్కొన్నారు. 200 అధికరణలో.. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లుల విషయంలో గవర్నర్ల విధులకు సంబంధించి ఆమోదం, నిలిపివేయడం, పెండింగ్‌లో ఉంచడం, తిరిగి పంపించడం మొదలైన నాలుగు స్పష్టమైన చర్యలను మాత్రమే సూచించారని, ఒక్కో పదానికీ వేర్వేరు అర్థాలు, వేర్వేరు అధికారాలు ఉన్నాయని వివరించారు. గవర్నర్ తన విచక్షణ ప్రకారం ఆమోదం తెలపవచ్చునని చెప్పారు. 142 అధికరణ కింద పూర్తి న్యాయం చేయడానికి సుప్రీంకోర్టుకు అధికారాలు ఉన్నప్పటికీ.. రాజ్యాంగ నిబంధనలు అధిగమించి అది అధికారాలను ఉపయోగించలేదని తుషార్ మెహతా లిఖిత పూర్వకంగా స్పష్టం చేశారు. "రాజ్యాంగంలోని ఒక అంగం విఫలమైందనో, పని చేయట్లేదనో, తప్పు చేసిందనో అనుకున్నా.. ఆ కారణంగా మరో అంగం తనకు రాజ్యాంగం ఇవ్వని అధికారాలను తీసుకోవడం సరికాదు. ప్రజాహితం పేరుతోనో..ఆ వ్యవస్థ సరిగా పనిచేయడంలేదనో.. రాజ్యాంగ సిద్ధాంతాలు అలా చెబుతున్నాయనో.. మరో అంగం తనకు లేని హక్కులను దఖలుపరచుకోవడానికి అనుమతించకూడదు. అలా అనుమతిస్తే రాజ్యాంగ నిర్మాతలు సైతం ఊహించని రాజ్యాంగ అస్తవ్యస్తతకు దారితీస్తుంది" అని తేల్చిచెప్పారు. బిల్లుల ఆమోదానికి సంబంధించి గవర్నర్, రాష్ట్రపతి విచక్షణాధికారాలపై సుప్రీంకోర్టు సోమవారం విచారించనున్న నేపథ్యంలో కేంద్రం తన అభిప్రాయాన్ని నిష్పష్టంగా చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే, రాష్ట్రపతి ముర్ము సుప్రీంకోర్టు లేవనెత్తిన అంశాలపై న్యాయ పరమైన అభిప్రాయాన్ని కోరిన విషయం తెలిసిందే.

ఖజానా దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

- బిహార్ ముఠాలో మరో ఏడుగురి గుర్తింపు
- 48 గంటల్లోనే ఇద్దరు దొంగల అరెస్టు
- 900 గ్రాములు వెండి ఆభరణాలు స్వాధీనం
- దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

రాయదుర్గం/హైదరాబాద్ సిటీ, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న చందానగర్ ఖజానా జ్యూవెలరీ దుకాణంలో జరిగిన దోపిడీ కేసును సైబరాబాద్ పోలీసులు ఛేదించారు. బిహార్‌కు చెందిన ఏడుగురు దొంగలు ఈ దోపిడీకి పాల్పడినట్లు గుర్తించారు. 48 గంటల్లోనే ఇద్దరు దొంగలను పట్టుకున్నామని మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దోపిడీ గురించి తెలియగానే 10 బృందాలుగా ఏర్పడి వేట కొనసాగించామన్నారు. టెక్నికల్, సైంటిఫిక్, హ్యూమన్ ఇంటలిజెన్స్‌తో దోపిడీకి పాల్పడింది బిహార్ ముఠాగా గుర్తించామని తెలిపారు. 24 గంటల్లోనే ఏడుగురు నిందితులను గుర్తించి, 48 గంటల్లోనే ఇద్దరు దొంగలను పుణేలో అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

రూట్ మ్యాప్ సిద్ధం చేసుకొని రెక్కీ

ఈ ముఠా దోపిడీకి 20 రోజుల ముందే హైదరాబాద్‌కు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ఇద్దరు బిహారీలు ఆశీష్‌కుమార్ నానక్‌రామ్‌గూడలో, దీపక్ కుమార్ సాహు జీడిమెట్ల ఆస్‌బెస్టాస్ కాలనీలో ఉంటూ ఓ పరిశ్రమలో పనిచేస్తున్నారు. వివిధ నగరాల్లో దోపిడీలకు పాల్పడుతూ బంగారు ఆభరణాలను దోచేస్తున్న తన ముఠా సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో భారీ దోపిడీ చేయాలని పథకం వేశారు. 20 రోజుల క్రితం హైదరాబాద్ చేరుకున్న మరో ఐదుగురు నిందితులు ఆశీష్, దీపక్‌లను కలిశారు. అనంతరం వివిధ ప్రాంతాల్లోని జ్యూవెలరీ దుకాణాలను గుర్తించి రెక్కీ చేశారు. చివరకు చందానగర్‌లోని ఖజానా జ్యూవెలరీని ఎంచుకున్నారు. ఈ క్రమంలో 2 సెకండ్ హ్యాండ్ పల్సర్ బైక్‌లను కొనుగోలు చేశారు. ఈ నెల 12న ఉదయం 10:30కు చందానగర్‌లోని ఖజానా జ్యూవెలరీలోకి 4 తుపాకులతో ప్రవేశించారు. స్ట్రాంగ్ రూమ్ తాళాలివ్వాలని డిప్యూటీ మేనేజర్ సతీష్‌పై కాల్పులు జరిపారు. నిజంగానే తాళాలు మర్చిపోయిన మేనేజర్ ఇంటికి వెళ్లడం, తాళాలు లేకపోవడంతో దుండగులు దుకాణంలో ఉన్న 10 కేజీల వెండిని దోచుకొని బైక్‌లపై పరారయ్యారు. వారిలో ఒక్కరు హెల్మెట్ ధరించగా, మిగతా ఆరుగురూ మాస్కులు ధరించినట్లు పోలీసులు గుర్తించారు. బైక్‌లపై బీదర్ వైపు పారిపోయిన దుండగులు కొద్దిదూరం వెళ్లగానే మాస్కులు తీసేశారు.

సవాలుగా తీసుకున్న పోలీసులు

దోపిడీ కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయిన టెక్నికల్ ఎవిడెన్స్, ఇతర సాంకేతిక సైంటిఫిక్ ఆధారాలు సేకరించారు. పల్సర్ బైక్‌ల ఆధారంగా విచారణ కొనసాగించారు. చివరకు ఈ దోపిడీకి పాల్పడింది ఆశిష్‌కుమార్, దీపక్ సాహులకు సంబంధించిన ముఠాగా గుర్తించారు. ఆ తర్వాత ఆ ఇద్దరు నిందితులను పుణేలో అరెస్టు చేశారు. మిగిలిన ఐదుగురు దొంగలను గుర్తించామని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని డీసీపీ వినీత్ పేర్కొన్నారు. కాగా, ఈ ముఠా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో దోపిడీలు, హత్యలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా హైదరాబాద్‌లో మొదటిసారి దోపిడీకి పాల్పడిందన్నారు. క్రిమినల్ హిస్టరీ పరిశీలించాకే ఇతర రాష్ట్రాల వారిని పనిలోకి తీసుకోవాలని కంపెనీల యాజమాన్యాలకు డీసీపీ వినీత్ సూచించారు.

మల్లె జిన్.. మామిడి మద్యం!

టమాటాతో వోడ్కా, బీట్‌రూట్, క్యారెట్‌తో లిక్కర్

- మందార పువ్వూ మత్తెక్కిస్తుంది
- మార్కెట్లోకి పువ్వులు, పండ్లు, కూరగాయల మద్యం
- ఇప్పటికే యూరప్‌లోని వివిధ దేశాల్లో ఆదరణ
- 30 వేల కోట్ల మార్కెట్.. 2032 నాటికి 50 వేల కోట్లకు
- కేరళ నుంచి ఇప్పటికే విదేశాలకు పనస లిక్కర్ ఎగుమతి
- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ముందుకు ఓ సంస్థ ప్రతిపాదనలు.. కసరత్తు



హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):

మీరు మందుకొట్టారు! దాని రుచి మీకు ఎంతో ఇష్టమైన మామిడి జ్యూస్‌లా ఉంది! రుచి మాత్రమే కాదు.. వాసన కూడా.. మద్యం వాసన రాకుండా మామిడి వాసన వస్తే..!?

మీరు జిన్ తీసుకున్నారు! తాగిన తర్వాత కిక్కెక్కించే మందు వాసన కాకుండా కైపెక్కించే మల్లెపూల వాసన వస్తే..!?

.. ఇదేదో అసాధ్యమని అనుకోకండి! ఇటువంటి మద్యం, జిన్ ఇతర దేశాల్లో ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది! రాబోయే రోజుల్లో మన రాష్ట్రంలోనూ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు ఇటీవల '3 క్యుజిన్ ల్యాబ్స్ (ఆర్టిసన్ క్రాఫ్ట్ స్పిరిట్)' అనే సంస్థ తెలంగాణ ఎక్సైజ్ శాఖ కమిషనర్‌ను కలిసి ఒక ప్రతిపాదన ఇచ్చింది. టమాటాలు, మామిడి, కర్బూజ, పైనాపిల్.. ఇలా 6రకాల పండ్లతో మద్యం తయారు చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని తెలిపింది. తాము తయారు చేసిన మద్యం నమూనాలను సదరు కంపెనీ ప్రతినిధులు తీసుకొచ్చి అధికారులకు చూపారు. దాంతో, ప్రస్తుతం ఉన్న ఎక్సైజ్ విధానంలో ఈ తరహా తయారీదారులకు వర్తించే నిబంధనలు, అనుమతులపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. పండ్లు,పూలతో మద్యం తయారీకి కంపెనీలు ముందుకొస్తే అనుమతుల విషయంలో ఎలాం టి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై చర్చిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. ఇటీవల కేరళలో కేఎస్ఆర్టీసీ బస్సుడ్రైవర్లు మిగల ముగ్గిన పనస తొనలు తిన్నారు. తనిఖీల్లో భాగంగా పోలీసులు బ్రీత్ ఎనలైజర్‌తో పరిశీలిస్తే మద్యం తాగినట్లు చూపించింది. తాము మద్యం తాగలేదని, పనస తొనలే తిన్నామని వారు వాదించారు. దాంతో, పోలీసులు మరో వ్యక్తికి కూడా పనస తొనలు తినిపించి పరిశీలించారు. అతనికి కూడా మద్యం తాగినట్లు పాజిటివ్ వచ్చింది. ఇందుకు కారణం మిగల ముగ్గిన ఆ పండులో సహజసిద్ధంగా ఫెర్మెంటైన చక్కెరలు ఉండడమేనని గుర్తించారు. ఇప్పుడు పనస పళ్లతో మద్యం తయారు చేశారనుకోండి. పనస తొనలు తిన్నట్లు వాసన వస్తుంది.. మద్యం తాగినట్లు పాజిటివ్ చూపిస్తుంది! అప్పుడు అతను పనస తొనలే తిన్నానని అంటే పోలీసులు ఏం చేయాలి మరి!? ఇటువంటి సమస్యల పరిష్కారం దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పూలతో మత్తెక్కించే పానీయాల తయారీ

పూల ఆధారిత మద్యం తయారీకి అంతర్జాతీయ మార్కెట్‌లో ఆదరణ పెరుగుతోంది. స్కాట్లండ్, ఎస్తోనియా, దక్షిణాఫ్రికా, స్పెయిన్ తదితర దేశాల్లో పూల తో తయారు చేసిన మద్యం బ్రాండ్లు కనిపిస్తాయి. యూరప్ దేశాల్లో పూల మద్యం అమ్మకాలు క్రమేణా పెరుగుతున్నాయి. ఫ్లోరల్ జిన్‌కు ప్రత్యేకంగా బార్లూ పెరుగుతున్నాయి. ఎస్తోనియాలో క్రాఫ్టర్ ఆరోమాటిక్ ఫ్లవర్ జిన్ అనే సంస్థ గులాబీ, లావెండర్ (లామియాసి లేదా పుదీనా కుటుంబానికి చెందిన పుష్పించే మొక్క), ఎల్డర్ ఫ్లవర్ (బూరుగు పువ్వు, లేదా జాజి పువ్వు) నుంచి జిన్ తయారు చేసి 20 దేశాలకు ఎగుమతి చేస్తోంది. స్పెయిన్‌కు చెందిన ఓ కంపెనీ పూల తో తయారైన జిన్‌ను 13 దేశాలకు ఎగుమతి చేస్తుండగా, ఫిన్‌ల్యాండ్, స్కాట్లండ్‌లో పూల జిన్‌కు ప్రాధా న్యం పెరుగుతోంది. స్కాట్లండ్‌కు చెందిన ద బొటానిస్ట్ సంస్థ స్థానికంగా సేకరించే పూల, చెట్టు బెరడు, సుగంధ ద్రవ్యాలు, విత్తనాల నుంచి 22 రకాల జిన్‌ను తయారు చేస్తోంది. జపాన్‌లో చెర్రీ బ్లోసమ్ జిన్ ప్రత్యేక ఆకర్షణగా ఉంది. ఇటలీలో హైబిస్కస్ (మందార), ఆరెంజ్ జిన్‌కు ఎక్కువ ఆదరణ ఉంది.

రైతులకు అదనపు ఆదాయం

పూలు, పండ్లు, కూరగాయల రైతులకు ఈ కొత్త తరహా మద్యం కొత్త మార్కెట్ అవకాశాలను కల్పించనుంది. పూల తోటల్లో నష్టాలు మూటకట్టుకునే రైతులకు మద్యం కంపెనీలు కొత్త ఆదాయ వనరుగా మారే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో టమాటా, మామిడి వంటి పండ్లు, పూల దిగుబడి అధికంగా ఉన్నందున.. వీటి ఆధారంగా తయారు చేసే మద్యం పరిశ్రమలు వస్తే రైతులకు మంచి లాభాలు అందే అవకాశం ఉంది.

ఏమిటీ పూలు, పండ్ల మద్యం

సాధారణంగా మద్యాన్ని ద్రాక్షరసం, బార్లీ తదితరాలతో తయారు చేస్తారు. ఇప్పుడు కొత్త ప్రయోగాలు మద్యం ప్రపంచంలో నూతన విప్లవానికి నాందిపలుకుతున్నాయి. పూలతో జిన్, పండ్లతో లిక్కర్ తయారు చేసేందుకు పరిశ్రమలు పోటీ పడుతున్నాయి. ఇప్పటి వరకూ మందు కొడితే మద్యం వాసన వచ్చేది. కానీ, ఇక నుంచి మద్యం తాగినా సదరు పూలు, పండ్ల వాసనే మత్తెక్కించనుంది. మల్లెలు, లావెండర్లు, గులాబీ, మందారం, చెర్రీ బ్లాసమ్ తదితర పువ్వులతో తయారైన జిన్.. మామిడి, పైనాపిల్, పనస, టమాటా తదితర పండ్లతో తయారైన మద్యం మార్కెట్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించనున్నాయి. ఒక గ్లాసులో మల్లెపూల వాసన.. మరో గ్లాసులో మామిడి రుచి బార్లలో కొత్త విప్లవాన్ని సృష్టించనున్నాయి. పూల రేకులతో తయారైన ఫ్లోరో జిన్ మార్కెట్లోకి రానుంది. ఇప్పటికే ఇంగ్లాండ్, జపాన్, స్కాట్లాండ్, ఇటలీ వంటి దేశాల్లో ఈ తరహా మద్యం మార్కెట్‌లో హల్‌చల్ చేస్తోంది. త్వరలోనే రాష్ట్రంలోనూ దీని రుచులు పంచేందుకు తయారీదారులు పోటీ పడుతున్నారు. కగర్ నివేదిక ప్రకారం.. పండ్లు, పూలతో తయారు చేసిన లిక్కర్ మార్కెట్ 2023లో 3.4 బిలియన్ డాలర్లు (రూ.30 వేల కోట్లు) ఉండగా.. 2032 నాటికి ఇది 5.8 బిలియన్ డాలర్ల (రూ.50 వేల కోట్లు)కు పెరుగుతుందనే అంచనాలున్నాయి. ఇప్పుడున్న మద్యం బ్రాండ్ల స్థానంలో.. భవిష్యత్తులో పూలు, పండ్లు, కూరగాయలతో తయారయ్యే మద్యం అమ్మకాలు 5-6 శాతం అదనంగా పెరుగుతాయని కగర్ తన నివేదికలో పేర్కొంది.

పండ్లు, కూరగాయలతో లిక్కర్

మామిడి, పైనాపిల్, పుచ్చకాయ, పనస, టమాటా, బీట్‌రూట్, క్యారెట్ తదితరాలతో తయారవుతున్న లిక్కర్‌కు మార్కెట్‌లో ఆదరణ పెరుగుతోంది. స్పెయిన్, ఇటలీ వంటి దేశాల్లో టమాటా వోడ్కా విక్రయాలు ఉన్నాయి. టమాటా వాసన (అరోమా) దెబ్బతినకుండా.. మద్యం వాసన లేకుండా ఉండటం దీని ప్రత్యేకత. ఇండియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్‌లో మామిడితో మద్యం తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారు. బ్రెజిల్, హవాయి ప్రాంతాల్లో పైనాపిల్ మద్యానికి ఆదరణ ఉంది. కేరళ, శ్రీలంక నుంచి పనస లిక్కర్‌ను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అమెరికా, మెక్సికోల్లో పుచ్చకాయ ద్వారా తయారు చేసే మద్యానికి మంచి గుర్తింపు ఉంది. అక్కడ వేసవిలో ఎక్కువ విక్రయించే మద్యం బ్రాండ్లలో ఇది కూడా ఒకటి. అంతేనా.. పువ్వులు, పండ్లు, కూరగాయలతో తయారు చేసే మద్యంలో వాటి సహజ వాసనలను కోల్పోకుండా తయారు చేసి మద్యం ప్రియులను ఆకట్టుకుంటున్నారు. ప్రతి దేశంలో స్థానికంగా దొరికే రకరకాల పూలను జిన్ తయారీకి వినియోగిస్తున్నారు. ఇందులో ఆల్కహాల్ శాతం 18 నుంచి 38 శాతం వరకు ఉంటుంది.



తమిళనాడు డీజీపీకి డాక్టరేట్ అందిస్తున్న జస్టిస్ మహదేవన్

జ్ఞాన విస్తరణకు పుస్తకాలు కీలకం

- సమగ్రత లేని విజయం నిజమైనది కాదు
- వీఐటీ 40వ స్నాతకోత్సవంలో సుప్రీం జడ్జి మహదేవన్

వేలూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): 'జ్ఞాన విస్తరణకు పుస్తకాలు ఎంతో కీలకం. విద్యార్థులు తమ సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు అభ్యాసాన్ని కొనసాగించాలి' అని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.మహదేవన్ సూచించారు. శనివారం వేలూరులోని వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) 40వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... 'విశ్వాసం, క్రమశిక్షణ వ్యక్తిత్వాన్ని రూపొందిస్తాయి. నైతిక ప్రవర్తన, చర్యలను నిలబెట్టేందుకు, అంతర్గత మనస్సాక్షిని పెంపొందించుకోవడానికి విద్యార్థులను ప్రోత్సహిస్తాయి. వీఐటీ తన విద్య, పరిశోధన, పరిపాలనా విధుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానించింది. పేద, గ్రామీణ వర్గాలకు అండగా నిలబడడం కొనసాగించాలి. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, తిరుక్కురళ్ గురించి ప్రస్తావించిన విషయాన్ని ఉటంకిస్తూ.. నిపుణులుగా మారడానికి విలువల పరిజ్ఞానం చాలా అవసరం. సమగ్రత లేని విజయం నిజమైన విజయం కాదు' అని అన్నారు.

అవినీతి నిర్మూలనకు విద్యార్థులు పోరాడాలి: కులపతి విశ్వనాథన్

'భారత జీడీపీలో 6 శాతం విద్యకు కేటాయించాలన్నది దీర్ఘకాలిక డిమాండ్. ప్రస్తుతం 3 శాతమే వ్యయం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తన రూ.55 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యకు 2.5 శాతమే కేటాయిస్తోంది' అని వీఐటీ వ్యవస్థాపకులు, చాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ, 'మనం పన్ను ఎగవేత వల్ల ఏటా రూ.8-9 లక్షల కోట్లు, అవినీతివల్ల రూ.6లక్షల కోట్లు కోల్పోతున్నాం. ఈ సమస్యలను నిర్మూలించడానికి విద్యార్థి సమాజం పోరాడాలి'అని పిలుపునిచ్చారు. టైమ్స్ ఆఫ్ ఇండియా సీఈవో శివకుమార్ సుందరం, వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్, శేఖర్ విశ్వనాథన్, జీవీసెల్వం, ట్రస్టీ రమణి బాలసుందరం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంధ్య పెంటారెడ్డి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరి ఎస్.విశ్వనాథన్, వీసీ వీఎస్ కాంచన భాస్కరన్, అసోసియేట్ వీసీ పార్థసారథి మల్లిక్, రిజిస్ట్రార్ టి.జయభారతి పాల్గొన్నారు. కార్యక్రమంలో 'అబ్దుల్ కలాం, జగదీశ్ చంద్రబోస్' పేర్లతో నిర్మించిన 2 భవనాలను ప్రారంభించారు. పీహెచ్‌డీ డిగ్రీ పొందిన వారిలో తమిళనాడు పోలీస్ అకాడమీ డైరెక్టర్ డీజీపీ సందీప్ రాయ్ రాథోడ్ కూడా వుండడం విశేషం.

మెదడు తినే అమీబా వ్యాధితో చిన్నారి దుర్మరణం

- కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఈ ఏడాది నాలుగో ఘటన
- నీటి వనరుల నుంచి వ్యాధి సోకుతుందన్న నిపుణులు

కోజికోడ్, ఆగస్టు 16: కేరళలోని కోజికోడ్ జిల్లాలో అరుదైన మెదడు తినే అమీబా వ్యాధితో తొమ్మిదేళ్ల చిన్నారి రెండు రోజుల క్రితం మృత్యువాతపడింది. ఇది ఈ ఏడాది జిల్లాలో నమోదైన నాలుగో ఘటన. కోజికోడ్ జిల్లాలోని థామరస్సేరీ గ్రామానికి చెందిన చిన్నారికి తీవ్రమైన జ్వరం రావడంతో చికిత్స కోసం ఈ నెల 13న సమీప ఆస్పత్రిలో చేర్చినా, ఆమె పరిస్థితి వేగంగా విషమించిందని వైద్యులు తెలిపారు. దీంతో ఈ నెల 14న కోజికోడ్ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించినా అదే రోజు మరణించిందని సీనియర్ ఆరోగ్యశాఖ అధికారి ఒకరు చెప్పారు. ఆ చిన్నారి నుంచి సేకరించిన రక్త నమూనాలను ఆస్పత్రి మైక్రో బయాలజీ ల్యాబ్‌లో పరీక్షించినప్పుడు ఆమెకు మెదడు తినే అమీవా(అమీబిక్ మెదడు వాపు) వ్యాధి సోకిందని తేలిందన్నారు. ఇటీవల కురిసిన వర్షపు నీటిలో తడిసినా ఈ వ్యాధి సోకుతుందని వైద్యులు చెప్పారు. సాధారణంగా చెరువులు, నదులు, వాగుల్లో ప్రవహించే తాజా నీటి నుంచి ఈ వ్యాధి సోకుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

తిరుమలలో శ్రీవాణి భక్తుల నిరసన

తిరుమల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి ట్రస్టు టికెట్లు జారీ చేయాల్సిందేనంటూ శనివారం తిరుమలలో భక్తులు నిరసనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. రోజూ ఉదయం శ్రీవాణి టికెట్లు కేటాయించి సాయంత్రానికి దర్శనం చేయిస్తున్న విషయం తెలిసిందే. అయితే శుక్రవారం రద్దీ అధికమైన క్రమంలో రాత్రి 11.30 గంటలకే టోకెన్లు జారీ ప్రారంభించి శనివారం వేకువజామున 2 గంటల వరకు టికెట్లు జారీ చేశారు. ఈ క్రమంలో 2.30 గంటల తర్వాత వచ్చిన భక్తులకు 800 టికెట్ల కోటా పూర్తయిందని, తిరిగి ఆదివారం రావాలంటూ సిబ్బంది సూచించారు. దీంతో ముందుగా టికెట్లు ఎలా కేటాయిస్తారని, తాము పిల్లలతో రోడ్లపై ఉన్నామంటూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి టికెట్లు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. విజిలెన్స్ పోలీసు అధికారులు బలవంతంగా వారిని పంపాల్సి వచ్చింది.

జీఎస్టీ అధికారుల నోటీసులకు సమాధానాలు తప్పనిసరి

సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 16: కేంద్ర, రాష్ట్ర పరిధిలోని ట్యాక్స్ అధికారులు ఇచ్చే సమన్లకు స్పందించడం, షోకాజ్ నోటీసులకు సమాధానాలు ఇవ్వడం పన్నులు చెల్లించే 'అస్సెస్సీ'లకు తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సరయిన సమయంలో సమాధానాలు ఇస్తే ఇతరత్రా ఇబ్బందులు తప్పుతాయని తెలిపింది. జీఎస్టీకి సంబంధించిన కేసులపై కేంద్ర, రాష్ట్రాల పన్నుల అధికారులు ఒకరి కి తెలియకుండా మరొకరు విచా రణ జరుపుతున్న నేపథ్యంలో జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహ దేవన్‌ల ధర్మాసనం మార్గదర్శకాలు జారీ చేసింది. పన్ను చెల్లింపు విషయమై ఆర్మోర్ సెక్యూరిటీస్ అనే సంస్థకు కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ అధికారులు నోటీసులు పంపించిన నేపథ్యంలో ఈ స్పష్టత ఇచ్చింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

పులివెందుల పులి.. పిల్లి శాపనార్థాలు!

పులివెందులలో జగన్ పార్టీకి డిపాజిట్ దక్కదని తెలుగుదేశం నాయకులు ఊహించలేదు. గెలవడం ఎలా? అన్న దానిపైనే తర్జనభర్జన పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 మాసాలే అయినందున ఉప ఎన్నికలు ఏవి జరిగినా ఫలితాలు కూటమికి అనుకూలంగానే ఉంటాయి. అయితే ఉప ఎన్నికలు జరిగిన రెండు స్థానాలు కడప జిల్లాలో ఉండటం, అందులో ఒకటి జగన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఉన్నందున ఈ ఎన్నికలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఫలితాలు కూటమి నాయకుల అంచనాలకు భిన్నంగా వచ్చాయి. రాజకీయాల్లో ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో తెలియకుండా జగన్‌రెడ్డి మూర్ఖంగా వెళతారు. ఈ పోకడలను ఆయనను గుడ్డిగా అభిమానించేవారు కీర్తిస్తున్నారు. దీంతో తాను నిజంగానే పులిని అని ఆయన నమ్ముతున్నారు. తాను తలపండిన రాజకీయ నాయకుడు చంద్రబాబుతో తలపడుతున్న విషయం మరచిపోతున్నారు. ప్రస్తుతానికి తల బొప్పి కట్టింది. భవిష్యత్తులో తల పగలకూడదు అనుకుంటే రాజకీయంగా ఆచితూచి అడుగులు వేయాలి. మొరటుతనం అన్ని వేళలా పనికిరాదు.

ధర్మో రక్షతి రక్షితః ..ధర్మాన్ని నీవు రక్షిస్తే ధర్మం నిన్ను రక్షిస్తుంది. పులివెందుల-ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికలపై ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చేసిన విమర్శలు విన్న తర్వాత ఈ సూక్తి గుర్తుకురాకుండా ఉండదు. 'ఈ ఎన్నికలలో అధికార కూటమి అరాచకంగా వ్యవహరించింది. దొంగ ఓట్లతో గెలిచిన గెలుపు కూడా ఒక గెలుపేనా? ఇలా అయితే ప్రజాస్వామ్యం ఏమి కావాలి? ముఖ్యమంత్రి నరకానికి పోతాడు!' అని జగన్‌రెడ్డి అండ్ కో చేస్తున్న ఆక్రందనలు రాజకీయ ప్రత్యర్థులకు శ్రవణానందకరంగా ఎందుకు మారాయి? జగన్‌రెడ్డి పరోక్ష మద్దతుదారులు, అభ్యుదయవాదుల ముసుగులో ఉన్న జగన్‌రెడ్డి శ్రేయోభిలాషులు కూడా 'ఇది అన్యాయం' అని గట్టిగా ఎందుకు నిలదీయలేకపోతున్నారు? మనం విత్తే విత్తును బట్టే ఆ చెట్టు కాయలు ఉంటాయని జగన్‌రెడ్డి ఇటీవల తరచుగా చెబుతున్నట్టుగానే అధికారంలో ఉన్నప్పుడు ఆయనగారు చేసిన అరాచకాలు ఇప్పుడు ఖర్మ రూపంలో ఎదురొస్తున్నాయి. ఖర్మ ఫలాన్ని అనుభవించాల్సిందే. అందుకే పులివెందులలో జరిగినవి ఎన్నికలే కాదని జగన్ అండ్ కో ఆక్రోశిస్తున్నా అన్యుల చెవికి ఎక్కడం లేదు. అయినా 'పులి బిడ్డ', 'పులివెందుల పులి' అని కీర్తించబడుతున్న జగన్‌రెడ్డి పిల్లి శాపనార్థాలు పెట్టడం ఏమిటి? బెబ్బులి పులిలా గాండ్రించకుండా.. ముసలివాడైన చంద్రబాబు రామా కృష్ణా అనుకోకుండా ఇలా ఎందుకు చేస్తున్నాడు? 'నరకానికి పోతాడు.. బహుశా ఆయనకు ఇవే చివరి ఎన్నికలు' అని పిల్లి శాపనార్థాలు పెట్టడం ఏమిటి? పులికి బేలతనం ఉండదు కదా? ఆకలితో అలమటిస్తున్నా పులి గడ్డి మాత్రం తినదు. మన జగన్‌రెడ్డి కూడా ప్రతీకారం తీర్చుకోవడానికి అదను కోసం వేచిచూడకుండా బీద అరుపులు, పిల్లి శాపనార్థాలు పెట్టడం ఏమిటి? తాను మాత్రం ఉట్టి కట్టుకొని నూరేళ్లపాటు ఊరేగుతానని, 75 ఏళ్ల వయసుకు చేరుకున్న చంద్రబాబు పరిస్థితి ఇవాళో రేపో అన్నట్టుగా ఉందని వాగడం ఏమిటి? ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కూడా వచ్చే నెలతో 75 ఏళ్లు నిండుతాయి. ఆయనను కూడా ఇవాళో రేపో అని అనగలవా? అంతెందుకు, ప్రపంచ దేశాలను, మరీ ముఖ్యంగా మన దేశాన్ని సుంకాల పేరిట వేధిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు 79 ఏళ్లు. ఈ వాస్తవాలను మరిచి చంద్రబాబు జీవించి ఉన్నంత కాలం ఆయనతో నేను రాజకీయంగా పోటీ పడలేను అన్నట్టుగా జగన్ రోదన ఉంది. పులివెందుల అంటే అది తమ కుటుంబ అడ్డా అని, అక్కడ మరొకరికి చోటు లేదు బిడ్డా అన్నట్టుగా ఇంతకాలం విర్రవీగడం వల్లనే ఇప్పుడు ఈ ఆవేదన. రాజ్యాలు, సామ్రాజ్యాలు కుప్పకూలిపోయాయి. రాజులు, చక్రవర్తుల చిరునామాలు గల్లంతయ్యాయి. ఒకప్పుడు రవి అస్తమించని సామ్రాజ్యంగా కీర్తించబడిన బ్రిటన్ ప్రస్తుత పరిస్థితి ఏమిటి? అలాగే పులివెందుల అయినా మరొకటి అయినా ఏదీ ఎవరికీ సొంతం కాదు. ప్రజాస్వామ్యంలో అలా సాధ్యం కాదు కూడా. ఇంతకూ పులివెందులలో ఏమి జరిగింది? జగన్‌రెడ్డి కథ అడ్డం తిరగడానికి కారణం ఏమిటి? నిజంగా జగన్ అండ్ కో ఆరోపిస్తున్నట్టుగా దొంగ ఓటర్లు వచ్చి పడటం వల్లనే వైసీపీకి డిపాజిట్ కూడా గల్లంతయిందా? లేక ప్రజల్లో నిజంగానే జగన్ పట్ల విముఖత ఏర్పడుతోందా? అన్నది పరిశీలించాలి. తన హయాంలో జరిగిన స్థానిక ఎన్నికల సందర్భంగా జగన్‌రెడ్డి అన్ని హద్దులూ దాటారు. ప్రత్యర్థి పార్టీకి చెందిన వాళ్లను నామినేషన్లు కూడా వేయనీయలేదు. ఇప్పుడు పులివెందులలో పోలింగ్ కేంద్రాలలో తమ పార్టీ ఏజెంట్లను కూడా ఉండనివ్వలేదు అని జగన్‌రెడ్డి వాపోతున్నారు. ఇప్పుడు కనీసం నామినేషన్లు అయినా వేసుకోనిచ్చారు కదా అని సంతృప్తిపడటం మంచిదేమో. తిరుపతి పార్లమెంటు స్థానానికి జరిగిన ఉప ఎన్నిక సందర్భంగా తిరుపతి పట్టణంలో విచ్చలవిడిగా దొంగ ఓట్లు వేయించుకోలేదా? అప్పుడు అదంతా న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా జరిగిందని చెప్పుకొన్నారు కదా? ఆనాడు మీరు ఏర్పరిచిన దారిలోనే ఇప్పుడు కూటమి ప్రభుత్వం నడిచి ఉంటుంది. అందుకే జగన్ అండ్ కోను ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదు. అప్పట్లో 90 శాతానికి పైగా స్థానిక సంస్థలలో జయకేతనం ఎగురవేశామని సంబరపడ్డారు కదా? ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత పెరిగిందని మీ చర్యలను సమర్థించుకున్నారు కదా? ఇప్పుడు కూటమి నేతలు కూడా అదే పనిచేస్తున్నారు. నిజానికి స్థానిక సంస్థల ఫలితాలు అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగానే ఉంటాయి. నూటికి నూరు శాతం స్థానిక సంస్థలను కైవసం చేసుకున్నప్పటికీ సాధారణ ఎన్నికల్లో ఫలితాలను ప్రభావితం చేయలేరు. తెలంగాణలో కూడా కేసీఆర్ పార్టీ దాదాపుగా అన్ని స్థానిక సంస్థలను సొంతం చేసుకుంది. అయినా 2023లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి పరిస్థితి కూడా ఇంతే. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో కూడా స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఏం చేశారో మరచిపోతే ఎలా?

అక్కడసలు అంత సీన్ ఉందా?

జగన్‌రెడ్డి రాజకీయాల్లోకి ప్రవేశించక ముందు వరకు తెలుగునాట రాజకీయాల్లో కొన్ని ఉన్నత ప్రమాణాలు పాటించేవారు. రాజశేఖరరెడ్డి, చంద్రబాబు నాయుడు ప్రధాన ప్రత్యర్థులుగా తెలుగునాట రాజకీయాలు సాగినప్పుడు కూడా ఈ ప్రమాణాలను పాటించారు. రాజశేఖరరెడ్డిని పులివెందులలో ఓడించడానికి, కుప్పంలో చంద్రబాబును ఓడించడానికి వారు ఇరువురూ ప్రత్యేకంగా వ్యూహాలు రచించి అమలు చేయలేదు. నిజానికి పులివెందులలో వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి బయట ప్రచారం జరుగుతున్న స్థాయిలో ప్రజలలో మద్దతు లేదు. 1996 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఈ విషయం రుజువైంది. అప్పుడు కడప లోక్‌సభ స్థానం నుంచి రాజశేఖరరెడ్డి పోటీ చేశారు. చంద్రబాబు అప్పుడే ముఖ్యమంత్రి అయ్యారు. జిల్లా ఎస్పీగా ఉమేష్ చంద్ర ఉన్నారు. ఎన్టీఆర్‌ను ధిక్కరించి పార్టీని సొంతం చేసుకున్న చంద్రబాబుకు నాటి ఎన్నికలు విషమ పరీక్షగా మారాయి. దీంతో మెజారిటీ స్థానాలు గెలుచుకోక తప్పని పరిస్థితి చంద్రబాబుది. ఈ నేపథ్యంలో కడప పైన కూడా ఆయన దృష్టి కేంద్రీకరించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా చూడాలని ఆయన జిల్లా ఎస్పీ ఉమేష్ చంద్రను ఆదేశించారు. ఉమేష్ చంద్ర పులివెందులపై దృష్టి కేంద్రీకరించి రిగ్గింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. మిగతా అసెంబ్లీ నియోజకవర్గాలలో కూడా ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా ఏర్పాట్లు చేశారు. దీంతో వైఎస్ రాజశేఖరరెడ్డి ఓడిపోయే పరిస్థితి ఏర్పడింది. చివరి నిమిషంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు మనసు మార్చుకొని పులివెందులలో కాస్త చూసీ చూడనట్టు వెళ్లవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఫలితంగా కేవలం ఐదు వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో ఆ ఎన్నికల్లో రాజశేఖరరెడ్డి గట్టెక్కి పరువు దక్కించుకున్నారు. దీన్నిబట్టి ఓటర్లకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించగలిగితే పులివెందులలో వైఎస్ కుటుంబానికి చెప్పుకొనేంత సీన్ లేదని అర్థమవుతుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు పులివెందుల, ఒంటిమిట్ట ఫలితాలను చూడాల్సి ఉంది. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబును జగన్‌రెడ్డి వేధింపులకు గురిచేసి ఉండకపోతే ఇప్పుడు పులివెందులలో డిపాజిట్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడేది కాదు. నేను చేస్తే సంసారం-ఇతరులు చేస్తే వ్యభిచారం అన్నట్టుగా జగన్‌రెడ్డి ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ఇప్పుడు ధర్మం-న్యాయం అని కలవరిస్తున్న జగన్‌రెడ్డి అప్పుడు చేసిందేమిటి? ఆనాడు పోలీసులను దుర్వినియోగం చేయడం ద్వారా మీరు దారి ఏర్పరిచారు. ఇప్పుడు కూటమి నేతలు అదే దారిలో వెళ్లకూడదు అని కోరుకునే నైతికత జగన్‌రెడ్డికి ఉంటుందా? 14 మాసాల క్రితం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ప్రజలెవరూ మరచిపోలేకపోతున్నారు. అందుకే అన్యాయం జరిగిందని జగన్ అండ్ కో ఘోషిస్తున్నా మద్దతు లభించడం లేదు. కుప్పంలో చంద్రబాబును ఓడించడానికి చేయని ప్రయత్నం అంటూ లేదు కదా! 'వై నాట్ 175?' అన్నప్పుడు న్యాయం, ధర్మం గుర్తుకురాలేదా? అసెంబ్లీలో ప్రతిపక్షానికి ప్రాతినిధ్యమే ఉండకూడదని అనుకున్నారు కదా? అందుకే ప్రజలు మీకు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తీర్పు ఇచ్చారు. 2019 ఎన్నికలతో పోల్చితే 2024లో పులివెందులలో జగన్‌రెడ్డి మెజారిటీ 30 వేలకు పైగా తగ్గింది. అయినా తన పట్ల ప్రజల్లో విముఖత ఏర్పడుతోందని జగన్‌రెడ్డి గుర్తించలేకపోయారు. సొంత బాబాయిని హత్య చేసిన, చేయించిన వాళ్లకు వత్తాసు పలుకుతూ, తల్లినీ చెల్లినీ దూరం చేసుకున్న జగన్‌రెడ్డి నిజస్వరూపాన్ని పులివెందుల ప్రజలు కూడా గుర్తించారు.

> **పులివెందుల, ఒంటిమిట్ట విజయంతో తెలుగుదేశం నాయకులు మిడిసిపడకూడదు. జగన్‌రెడ్డికి ప్రస్తుత దుస్థితి ఎందుకు కలిగిందా అని అనుక్షణం గమనంలో ఉంచుకోవాలి. అంతేగానీ, పులివెందులనే కొట్టాం– ఇక మాకు తిరుగు ఉండదని భావిస్తే నడ్డివిరవడానికి ప్రజలు సిద్ధంగా ఉంటారు.**

అయినా 2024 ఎన్నికల్లో పూర్తిస్థాయిలో స్వేచ్ఛగా ఓట్లు వేసుకోలేకపోయారు. ఇప్పుడు ఆ అవకాశం వచ్చింది. వైసీపీకి డిపాజిట్ కూడా దక్కకుండా చేశారు. స్థానిక ఓటర్లు ఓటు వేయపోతే కేవలం దొంగ ఓట్లతోనే ఎవరూ ఈ స్థాయి విజయాన్ని అందుకోలేరు. నా పుట్టలో వేలు పెడితే నేను ఊరుకుంటానా అన్నట్టుగా కుప్పంలో నాడు వేలు పెట్టినందుకు చంద్రబాబు ఇప్పుడు ప్రతీకారం తీర్చుకున్నారు. నిజానికి పులివెందులలో జగన్ పార్టీకి డిపాజిట్ కూడా దక్కదని తెలుగుదేశం నాయకులు కూడా ఊహించలేదు. గెలవడం ఎలా? అన్న దానిపైనే తర్జనభర్జన పడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 మాసాలే అయినందున ఉప ఎన్నికలు ఏవి జరిగినా ఫలితాలు కూటమికి అనుకూలంగానే ఉంటాయి.



అయితే ఉప ఎన్నికలు జరిగిన రెండు స్థానాలు కడప జిల్లాలో ఉండటం, అందులో ఒకటి జగన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఉన్నందున ఈ ఎన్నికలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఫలితాలు కూటమి నాయకుల అంచనాలకు భిన్నంగా వచ్చాయి. రాజకీయాల్లో ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో తెలియకుండా జగన్‌రెడ్డి మూర్ఖంగా వెళతారు. ఈ పోకడలను ఆయనను గుడ్డిగా అభిమానించే వారు కీర్తిస్తున్నారు. దీంతో తాను నిజంగానే పులిని అని ఆయన నమ్ముతున్నారు. తాను తలపండిన రాజకీయ నాయకుడు చంద్రబాబుతో తలపడుతున్న విషయం మరచిపోతున్నారు. ప్రస్తుతానికి తల బొప్పి కట్టింది. భవిష్యత్తులో తల పగలకూడదు అనుకుంటే

> **నిజానికి పులివెందులలో వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి బయట ప్రచారం జరుగుతున్న స్థాయిలో ప్రజలలో మద్దతు లేదు. 1996 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఈ విషయం రుజువైంది. అప్పుడు కడప లోక్‌సభ స్థానం నుంచి రాజశేఖరరెడ్డి పోటీ చేశారు. చంద్రబాబు అప్పుడే ముఖ్యమంత్రి అయ్యారు. జిల్లా ఎస్పీగా ఉమేష్ చంద్ర ఉన్నారు. ఎన్టీఆర్‌ను ధిక్కరించి పార్టీని సొంతం చేసుకున్న చంద్రబాబుకు నాటి ఎన్నికలు విషమ పరీక్షగా మారాయి. దీంతో మెజారిటీ స్థానాలు గెలుచుకోక తప్పని పరిస్థితి చంద్రబాబుది. ఈ నేపథ్యంలో కడప పైన కూడా ఆయన దృష్టి కేంద్రీకరించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా చూడాలని ఆయన జిల్లా ఎస్పీ ఉమేష్ చంద్రను ఆదేశించారు. ఉమేష్ చంద్ర పులివెందులపై దృష్టి కేంద్రీకరించి రిగ్గింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. మిగతా అసెంబ్లీ నియోజకవర్గాలలో కూడా ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా ఏర్పాట్లు చేశారు. దీంతో వైఎస్ రాజశేఖరరెడ్డి ఓడిపోయే పరిస్థితి ఏర్పడింది. చివరి నిమిషంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు మనసు మార్చుకొని పులివెందులలో కాస్త చూసీ చూడనట్టు వెళ్లవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఫలితంగా కేవలం ఐదు వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో ఆ ఎన్నికల్లో రాజశేఖరరెడ్డి గట్టెక్కి పరువు దక్కించుకున్నారు.**

రాజకీయంగా ఆచితూచి అడుగులు వేయాలి. మొరటుతనం అన్ని వేళలా పనికిరాదు. పెళ్లిళ్ల పేరంటాలకు వెళ్లినప్పుడు తోలుకెళ్లిన జనంతో హడావిడి చేసి ప్రభంజనం అని మురిసిపోవడం వల్ల ప్రయోజనం ఉండదు. ప్రజలు తనను అంతలా ఎందుకు తిరస్కరిస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకోకుండా ఆత్మవంచనతో ముందుకు సాగితే ఫలితాలు ఇలా ప్రతికూలంగానే ఉంటాయి.

నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా!

అధికారంలో ఉన్నప్పుడు ధర్మాన్ని రక్షించి ఉంటే అది ఇప్పుడు నిన్ను రక్షించి ఉండేది. గడచిన 30 ఏళ్లలో తెలుగుదేశం పార్టీ అనేక పర్యాయాలు అధికారంలో ఉంది. అయినా పులివెందుల జడ్పీటీసీని గెలిపించుకోలేకపోయింది. మూడు దశాబ్దాల తర్వాత ఇప్పుడు గెలుచుకోగలిగారు. అది కూడా జగన్‌రెడ్డి పార్టీకి డిపాజిట్ కూడా దక్కకుండా చేస్తూ! ఎంత దొంగ ఓట్లు అయితే మాత్రం ఫలితం ఇంత దారుణంగా ఉంటుందా? ఇక్కడే జగన్‌రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలి. జగన్‌రెడ్డిలో ఇప్పటికీ మార్పు కనబడటం లేదు. రాజకీయ ఎత్తుగడల్లో కూడా మార్పు లేదనిపిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వల్లభనేని వంశీ, కొడాలి నాని వంటి వారిని తెలుగుదేశం పైకి ఉసిగొల్పారు. ఇప్పుడు అధికారం కోల్పోయాక కాపు సామాజిక వర్గానికి చెందిన పేర్ని నాని, అంబటి రాంబాబును ప్రయోగిస్తున్నారు. ఈ రెండు సామాజిక వర్గాల వారినే తన పావులుగా ఎందుకు ఎంచుకున్నారో తెలియదు. కృత్రిమ ప్రభంజనాలను చూసుకొని మురిసిపోకుండా పులివెందుల ప్రజలు కూడా ఎందుకు తనకు అడ్డం తిరుగుతున్నారో తెలుసుకొనే ప్రయత్నం చేస్తే మంచిది. అంతేగానీ నేను చేశానని నువ్వు కూడా చేస్తావా? నువ్వు నరకానికి పోతావు! అని పిల్లి శాపనార్థాలు పెట్టడం నీ బలహీనతను చెప్పకనే చెబుతోంది. మరోవైపు పులివెందుల, ఒంటిమిట్ట విజయంతో తెలుగుదేశం నాయకులు మిడిసిపడకూడదు. 2021లో ఇలా మిడిసిపడిన వైసీపీకి 2024లో ఏం జరిగిందో మరచిపోకూడదు. స్థానిక సంస్థల ఎన్నికలు, ముఖ్యంగా ఉప ఎన్నికలు అధికార పార్టీకి అనుకూలంగానే ఉంటాయి. జగన్‌రెడ్డి ఏలుబడిలో కుప్పం మున్సిపాలిటీని సొంతం చేసుకోలేదా? ప్రజాభిప్రాయం ఎప్పుడూ స్థిరంగా ఉండదు. ప్రభుత్వం బాగా పనిచేస్తున్నంత కాలం అనుకూలంగానే ఉంటారు. రాజ్యం వీరభోజ్యం అనుకుంటే జనం వెంటనే అడ్డం తిరుగుతారు. ముఖ్యమంత్రి చంద్రబాబును రెచ్చగొట్టినందుకు జగన్‌రెడ్డి అనుభవిస్తున్నారు. తెలుగుదేశం శాసనసభ్యులు, ఇతర నాయకులు జగన్‌రెడ్డికి ప్రస్తుత దుస్థితి ఎందుకు కలిగిందా అని అనుక్షణం గమనంలో ఉంచుకోవాలి. అంతేగానీ, పులివెందులనే కొట్టాం– ఇక మాకు తిరుగు ఉండదని భావిస్తే నడ్డివిరవడానికి ప్రజలు సిద్ధంగా ఉంటారు. పులివెందుల ఉండి ఉండకపోతే అసలు ఈ ఎన్నికల గురించి చర్చించాల్సిన అవసరమే ఉండేది కాదు. పులివెందుల విజయానికి కారణాలు ఏమిటో తెలుగుదేశం నాయకులకు తెలుసు కనుక వాపును చూసి బలుపు అనుకోవద్దు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలోని నాలుగు జడ్పీటీసీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. అప్పుడు 'కుప్పంలో కూలిన చంద్రబాబు కోట' అంటూ సంబరాలు చేసుకున్నారు. 2019 ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబుకు 30 వేల మెజారిటీ మాత్రమే లభించగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి లభించిన ఓట్లు 60 వేలు అధికమని, దీన్నిబట్టి చంద్రబాబు ఓడినట్టేనని లెక్కలు కట్టి జబ్బలు చరుచుకున్నారు. ఈ లెక్కలను జగన్ రోత మీడియా ఆనందంగా అచ్చు వేసింది. సీన్ కట్ చేస్తే 2024లో చంద్రబాబుకు 40 వేల ఓట్ల మెజారిటీ లభించింది. అది కూడా ఆయనను ఓడించడానికి ఓటుకు ఐదు వేల రూపాయల వంతున పంచి భారీ స్థాయిలో అధికార దుర్వినియోగానికి పాల్పడిన తర్వాత! నాటి వైసీపీ రోత మీడియా లెక్కల ప్రకారం ఇప్పుడు పులివెందులలో జగన్ ఓడిపోబోతున్నారని చెప్పవచ్చు. నిజానికి ఇవన్నీ కాకి లెక్కలు. నాడు జగన్‌రెడ్డి వద్ద డబ్బుతో పాటు అధికారం ఉంది. తెలుగుదేశం పార్టీకి చెందిన స్థానిక నాయకులు, కార్యకర్తలను లోబరుచుకున్నారు. ఇప్పుడు కూటమి వద్ద అధికారం, డబ్బు ఉంది. అందుకే పులివెందులలో జగన్ సొంత మనుషులు కూడా అమ్ముడుపోయారు లేదా అధికారానికి లొంగిపోయారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి కూడా అధికారం లేకపోతే ఏమీ చేయలేరని రుజువైంది. అయితే సాధారణ ఎన్నికల్లో డబ్బు, అధికారం ప్రభావం నామమాత్రమే. ప్రజలు కాదనుకుంటే ఎంత అధికారం, డబ్బు ఉన్నప్పటికీ విజయాన్ని అందుకోలేరని అనేక సాధారణ ఎన్నికల్లో రుజువైంది. ప్రజల అండ లేకపోతే పులులు పిల్లులవుతాయి. నాడు కుప్పంలో తమకు జరిగిన పరాభవానికి ఇప్పుడు చంద్రబాబు ప్రతీకారం తీర్చుకున్నారనడంలో తప్పు లేదు. గతంలో కుప్పంలో ఏం జరిగిందో ఇప్పుడు పులివెందులలో అదే జరిగిందని సరిపెట్టుకుంటే ఏ గొడవా ఉండదు. ఎన్నికల్లో అక్రమాలు చోటుచేసుకోవడం ఇవాళ కొత్త కాదు. ఓటర్ల జాబితాలు తారుమారవుతాయి. అధికారంలో ఉన్నవారికి ప్రభుత్వ యంత్రాంగం ఊడిగం చేస్తుంది. తాను నియమించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని తనను ఆదుకోలేదని జగన్‌రెడ్డి ఆవేదన చెంది లాభం లేదు. నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా!

19న ఏం తేలుతుందో?

జాతీయ స్థాయిలో ఓట్ల తొలగింపు వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బిహార్ అసెంబ్లీకి త్వరలో జరగనున్న ఎన్నికలను పురస్కరించుకొని ఎన్నికల కమిషన్ అక్కడ 65 లక్షల ఓట్లను తొలగించిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ఈ ఆరోపణలకు బలం చేకూర్చే ఉదంతాలను ఇండియా కూటమి ముందు ఉంచి వారి మద్దతు కూడగట్టడంలో రాహుల్‌గాంధీ సఫలీకృతులయ్యారు. ఇండియా కూటమి ఎంపీలు ఢిల్లీలో ర్యాలీ కూడా నిర్వహించారు. చివరికి వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఓట్ల తొలగింపు అంశాన్ని తీవ్ర అంశంగా పరిగణించిన సుప్రీంకోర్టు మొత్తం తొలగించిన 65 లక్షల ఓట్ల వివరాలను ఈ నెల 19లోపు ఎన్నికల కమిషన్ ప్రకటించాలని గురువారం నాడు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాహుల్‌గాంధీ ఆరోపణల్లో పస ఉందా? లేదా? ఎన్నికల కమిషన్ నిజంగానే ఏదో ఒక పార్టీకి మేలు చేయడానికి భారీ స్థాయిలో ఓట్లను తొలగించినదీ లేనిదీ కూడా స్పష్టమవుతుంది. ఎన్నికల కమిషన్ తప్పు చేసినట్టు ఈ నెల 19 తర్వాత రుజువైతే రాహుల్‌గాంధీ ప్రతిష్ఠ అమాంతం పెరుగుతుంది. ఎన్నికల కమిషన్ ప్రతిష్ఠ పాతాళానికి పడిపోతుంది. రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలు దారి తప్పితే దాని ప్రభావం తృతీయ ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని చెప్పుకొనే భారత్‌పై పడుతుంది. ఎన్నికల వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లితే దేశంలో అరాచక పరిస్థితులు నెలకొంటాయి. మనకూ పాకిస్థాన్‌కూ పెద్ద తేడా ఉండబోదు. న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠ కూడా ఈ మధ్య మసకబారుతోంది. గురువారం నాటి ఆదేశాలతో న్యాయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. ఎన్నికల కమిషన్ నిజంగా తప్పు చేస్తే దాన్ని సరిదిద్దే బాధ్యత సర్వోన్నత న్యాయస్థానం పైనే ఉంటుంది. మిగతా వ్యవస్థలు పతనమైనప్పుడు న్యాయ వ్యవస్థపై ఆశలు పెట్టుకోవడంలో తప్పులేదుగా? బిహార్‌లో తొలగించిన 65 లక్షల ఓట్లు అక్కడి ఫలితాన్ని తారుమారు చేస్తాయి. తొలగింపునకు గురైన ఓటర్లు అందరూ అనర్హులే అయితే ఏ పేచీ ఉండదు. ఎన్నికల కమిషన్‌ను అభినందించవచ్చు. అలా కాకుండా ఏదైనా తిరకాసు జరిగి ఉంటే దాని ప్రభావం ఎన్డీయే ప్రభుత్వంపై కూడా పడుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి సంబంధం ఉన్నా లేకపోయినా తప్పు జరిగి ఉంటే ప్రభుత్వమే ఒత్తిడి తెచ్చి ఎన్నికల కమిషన్‌తో తప్పు చేయించిందని ప్రజలు నిర్ధారణకు వస్తారు. అదే జరిగితే ఎన్డీయే కూటమి ఎంతో కొంత మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ఈ అంశంలోనూ తలదూర్చి జగన్‌రెడ్డి తన రాజకీయ అపరిపక్వతను మరోసారి చాటుకున్నారు. రాహుల్‌గాంధీ ఏపీ గురించి మాట్లాడలేదని, రాహుల్-చంద్రబాబు- రేవంత్‌రెడ్డి ముగ్గురూ హాట్‌లైన్‌లో ఉంటారని పొంతనలేని వ్యాఖ్యలు చేసి నవ్వులపాలయ్యారు. మోదీ దయ కోసం పరితపిస్తున్న బేలతనంతో సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలయ్యారు. తన మద్దతుదారులే తన రెస్క్యూకు రాని సంకట స్థితిలోకి జగన్ తనను తాను నెట్టుకున్నారు. రాజకీయ పార్టీలకు ఎన్నికల్లో జయాపజయాలు సహజం. తమకు ఓటమి ఉండకూడదు అని అధికారంలో ఉన్న ఏ పార్టీ అయినా భావించినప్పుడే అక్రమాలు, అరాచకాలకు తెరలేస్తుంది. తర్వాత కాలంలో అవే పార్టీలు బాధితులుగా మిగులుతాయి. ఒకప్పుడు కాంగ్రెస్ చేసిన తప్పులకు ఇప్పుడు ఫలితం అనుభవిస్తోంది. తరాలు మారినా చేసిన పాపం వెంటాడుతూనే ఉంటుంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్, ప్రాంతీయ స్థాయిలో జగన్‌రెడ్డి ఇందుకు సజీవ తార్కాణాలు. అందుకే 'ధర్మో రక్షతి రక్షితః' అని పెద్దలు చెప్పారు. మాకు ఈ నీతులు, సుద్దులు అవసరం లేదని ఎవరైనా భావిస్తే ఇవాళ కాకపోయినా రేపైనా ఫలితం అనుభవించాల్సిందే!

దళిత రాజకీయ సాధికారిత ఏదీ?

దేశవ్యాప్తంగా రాజకీయ వేదికలలో దళితుల ఉనికి పెరిగింది. కానీ ఈ కనిపించే ఉనికి, దళిత రాజకీయ అధికార గొంతుగా మారలేదు. చాలా మటుకు రాజకీయ పార్టీలు దళిత నాయకులను నామమాత్ర ప్రాతినిధ్యానికే పరిమితం చేశాయి. ఇంకా చేస్తూనే ఉన్నాయి. ఏ పార్టీలోనూ దళితులు నిర్ణయాత్మక స్థానాల్లో లేరు. ఒకటి అర పార్టీలలో ఉన్నప్పటికీ వారికి నిర్ణయాధికారం ఉండదు, గౌరవం ఉండదు. ఒకవేళ ఏదైనా ప్రత్యేక పరిస్థితిలో ఏదైనా రాజకీయ పార్టీలో దళితుడు నిర్ణయాధికారం కలిగి నిర్ణయాత్మక స్థానంలోకి చేరుకుంటే ఆ నాయకుడికి దళిత స్పృహ కంటే దొరల స్పృహ అధికంగా ఉంటుంది. ఈ పరిస్థితి పార్టీలకే పరిమితం కాకుండా, ఆయా పార్టీలచే ఏర్పడిన ప్రభుత్వాలలో కూడా కొనసాగుతుంది. దళిత అభ్యర్థులు ఎన్నికల్లో సీటు పొందాలన్నా, ఆ తర్వాత గెలవాలన్నా అగ్రకులాల దయాదాక్షిణ్యాలు కావాలి. దీనికి ప్రధాన కారణం దళిత నాయకులను దళితులే ఎన్నుకొనే అవకాశం కోల్పోవటమే, పైగా దళిత నాయకులు ఇతరుల స్వార్థాలకు అనుగుణంగా ఎంపిక చేయబడటమే. దీనివల్ల దళిత సమాజ అభివృద్ధి కోసం పనిచేయాల్సిన దళిత నాయకులు అగ్రకుల నాయకుల ఆశీర్వాదాల కోసం ఆరాటపడాల్సి వస్తున్నది. ఈ పరిస్థితి నిజాయితీగల దళిత నాయకులను అయోమయ స్థితిలోకి నెట్టివేస్తున్నది. ఇది ప్రస్తుత దళిత రాజకీయ చైతన్యానికి ఒక ముఖ్యమైన పార్శ్వం.

ఇప్పటి దళిత ఉద్యమాలు అంతర్గతంగా, బాహ్యంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. దళిత విముక్తి, కుల వ్యవస్థ అణచివేతలకు వ్యతిరేకంగా పోరాటం వంటి విస్తృత లక్ష్యాలు నేడు చీలికల వల్ల, అంతర్గత విభేదాల వల్ల మరుగునపడిపోయాయి. ఉద్యమంలోని విభజనలు అనేక రకాల పెడధోరణులను ముందుకు తెచ్చింది. పరస్పర విరుద్ధమైన లక్ష్యాలతో, వ్యూహాలతో దళిత ఉద్యమం దాని విప్లవాత్మక తేజస్సును కోల్పోయింది. రాజకీయ అధికార ఆకాంక్షలు కూడా చీలికలకు దారితీశాయి. పార్టీలు పెట్టే ప్రలోభాలతో దళిత నాయకుల మధ్య పోటీ తీవ్రమైంది. ఈ పరిస్థితిలో దళితులు పార్టీలవారీగా వేరైపోయారు.




దళితుల మధ్య ఈ చీలికలు ఒక లోతైన వైరుధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. రాజకీయ పార్టీల సిద్ధాంతాలకు, అగ్రకుల నాయకత్వానికి అంకితమై వ్యక్తిగత అభివృద్ధికి, అవకాశాల కోసం ఎదురు చూడటం ఒక వైపు కనిపిస్తుంది. మరోవైపు అశేష దళిత సమాజాలు తాము ఎదుర్కొంటున్న దౌర్భాగ్యం, అన్యాయం, ఆకలి, హింసలపై వ్యక్తం చేస్తున్న నిస్సహాయత, ఆందోళన కనిపిస్తాయి. రిజర్వేషన్ల లబ్ధిదారులైన మధ్యతరగతి దళితులు, దళిత మేధావులు కుల వ్యవస్థ అణచివేతను విస్మరించారు. ప్రాథమిక స్థాయి దళిత జనంలో మార్పును తేవడానికి దీర్ఘకాలిక వ్యూహాలను రూపొందించటానికి బదులు– రిజర్వేషన్లు, ఉద్యోగాల వంటి పరిమిత లాభాలపై వీరు దృష్టి కేంద్రీకరించారు.

దళిత సమూహాలకి సంయుక్త ప్రతీకలు, భాషాయాసలు, విలువలు లేకపోవడం వివిధ దళిత సమాజాల మధ్య విభేదాలను తీవ్రతరం చేస్తోంది. పార్లమెంటరీ రాజకీయాలు వ్యక్తిగత గుర్తింపునకు ప్రాధాన్యతనిస్తూ, దళిత జాతి ఉపకులాల మధ్య విభేదాలను ప్రోత్సహించాయి. ఫలితంగా దళితులు తమ పోరాటాల నుంచి వేరై రాజకీయ పార్టీలపై ఆధారపడే స్థితికి చేరుకున్నారు. ఈ పరిణామం దళిత ఉన్నత వర్గాలకు అనుకూలంగా మారి, వ్యక్తిగత స్థాయిలో వారు అధికారాన్ని, సౌకర్యాన్ని పొందే వీలు కల్పించింది. అందువల్ల వారు దళిత సమాజంపై కొనసాగుతున్న వ్యవస్థాపిత అన్యాయాలను ప్రశ్నించటం మానేశారు. అంబేడ్కర్‌ను ఒక చిహ్నంగా మారుస్తున్న తీరూ సమస్యాత్మకమే. ఆయన పోరాట చైతన్యాన్ని ఒక విగ్రహంగా మార్చి వేశారు. ఆయన కుల నిర్మూలనా సిద్ధాంతానికున్న విప్లవాత్మక లక్షణాన్ని విగ్రహారాధనగా మార్చివేసారు.

దళిత నాయకత్వ సామర్థ్యాన్ని నిర్మాణంలోని పరిమితులు నిరోధిస్తున్నాయి. ప్రధాన రాజకీయ వ్యవస్థ దళిత నాయకత్వంలోని కొన్ని వర్గాలను తనలో కలుపుకొని, దళిత ఉద్యమ విప్లవాత్మక లక్ష్యాలను నీరుగార్చుతూ, ఉద్యమ స్వతంత్ర పోరాట లక్ష్యాలకన్నా పార్టీ రాజకీయాల మీద ఆధారపడే పరిస్థితిని సృష్టించింది. ఎన్నికల పరిమితులు, పార్టీలతో అనుబంధాలు ఉద్యమాన్ని విభజించి, కలిసికట్టుగా పనిచేసే శక్తిని దెబ్బతీస్తున్నాయి. అంతేగాక, దళిత నాయకత్వం ఎక్కువగా రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల రాజకీయాలకు పరిమితమై, వ్యవస్థాపిత అసమానతలను ఎదుర్కొనేలా, విస్తృతమైన సామాజిక-ఆర్థిక మార్పును సాధించేలా దృష్టిని మళ్లించడంలో విఫలమవుతోంది. అణగారిన వర్గాల అభివృద్ధికి అనుకూలంగా రిజర్వేషన్ల వల్ల లబ్ధి పొందిన మధ్య తరగతి దళిత సముదాయం తరచుగా ప్రాథమిక స్థాయి దళిత జన ఉద్యమాలకు ప్రోత్సాహం ఇవ్వడంలో విఫలమవుతున్నది. ఇది దళిత నాయకత్వానికీ అశేష సామూహిక దళిత జనాభాకి మధ్య విబేధాన్ని పెంచుతున్నది.

దళితులు రాజకీయంగా లెక్కలోకి రావాలంటే, దళిత నాయకత్వం శక్తిమంతమైన రాజకీయ చర్యగా నిలవాలంటే, అది ఎన్నికల పరిమితులను అధిగమించి, ప్రాథమిక స్థాయి దళిత జన ఉద్యమాలను బలోపేతం చేయడం, భావజాల ఐక్యతను పెంపొందించడం, కుల ఆధిపత్యాన్ని సవాలు చేసే ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను నిర్మించడం అవసరం. అంతేకాక, దళిత కులాల మధ్య – దళిత ఉద్యమాల మధ్య ఐక్యతను పెంపొందించడం, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, అంబేడ్కర్ విప్లవాత్మక దృష్టిని కేవలం ప్రతీకాత్మక గుర్తింపుగా కాకుండా ఒక కార్యాచరణ మార్గంగా మార్చుకోవడం కీలకం. ఈ మార్గంలో మాత్రమే మరింత బలమైన, దృఢమైన దళిత రాజకీయ ఉద్యమాన్ని నిర్మించవచ్చు. ఒక సమగ్ర ప్రణాళిక ద్వారా మాత్రమే దళిత నాయకత్వం వ్యవస్థాపిత అణచివేతను పూర్తిగా విచ్ఛిన్నం చేసి, దీర్ఘకాలిక సామాజిక, రాజకీయ మార్పును సాధించగలదు.

▪ లెల్లే సురేష్
దళిత కవి, సాంస్కృతిక కార్యకర్త



కృష్ణం వందే జగద్గురుమ్..


శ్రీకృష్ణుడి అవతారంలో భద్రకాళి అమ్మవారు

వరంగల్ నగరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. పలు కాలనీలు, ఆలయాలు, వివిధ సంస్థల ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహించారు. యువకులు ఉట్టికొట్టే వేడుకలు సంబరంగా చేసుకున్నారు. చారిత్రక భద్రకాళి ఆలయంలో అమ్మవారిని శ్రీకృష్ణుడి అవతారంలో అలంకరించారు. అలాగే యాదవ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు అలరించాయి.

- వరంగల్ కల్చరల్/హనుమకొండ టౌన్

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు..

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



వరంగల్ క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ అనవసరంగా చిక్కుల్లో పడొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వాహనదారులకు సూచించారు. డ్రంకెన్ డ్రైవ్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారని, అలాంటి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. దీంతో అనేక కుటుంబాలు నష్టాలు చవిచూస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిరోధించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చర్యల్లో భాగంగా గ్రేటర్ వరంగల్‌తో పాటు కమిషనరేట్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి పట్టుబడ్డ వాహనదారులకు కమిషనరేట్ కార్యాలయంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి అనంతరం కోర్టులో హాజరుపరిచి తగిన శిక్షలు విధిస్తున్నామన్నారు. ఈ వారం రోజుల్లో ట్రైసిటీలో 324 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు కాగా, వాటిలో హనుకొండ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 121, వరంగల్ పీఎస్ పరిధిలో 97, కాజీపేట పీఎస్ పరిధిలో 106 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇందులో 16 మందికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించారని, మిగతావారికి రూ.3,95,400 జరిమానా విధించామన్నారు. వాహనదారులు తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవడం కమిషనరేట్ పోలీసుల లక్ష్యమని, కుటంబ సభ్యుల భద్రతను దృష్టిలో పెట్టుకొని వాహనాలు డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మద్యం తీసుకోవద్దని సూచించారు.

వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి..

- రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్
- కడిపికొండ పీహెచ్‌సీ తనిఖీ, సమీక్ష


మాట్లాడుతున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్

వరంగల్ మెడికల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ సూచించారు. శనివారం కడిపికొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే, నమోదు అవుతున్న కేసులు, డెంగీ పాజిటివ్ కేసుల నమోదు గురించి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ రవీంద్ర నాయక్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున నీరు నిల్వ ఉండకుండా, దోమలు వృద్ధి చెందడం వల్ల అవగాహన కల్పించాలన్నారు. తాగునీరు కలుషితం కావడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. లెప్రసీ, మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలు, ఎన్‌సీఈడీ, ఇమ్యూనైజేషన్ కార్యక్రమాలపై సమీక్షించారు. బీపీ, డయాబెటీస్ వ్యాధిగ్రస్తులకు రెగ్యులర్‌గా ఫాలో అప్ సేవలు, మందులు అందించాలన్నారు. అలాగే టీబీ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందులు క్రమం తప్పకుండా వాడేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.మదన్ మోహన్‌రావు, డాక్టర్ ఇక్తధర్ అహ్మద్, డాక్టర్ మంజుల, డాక్టర్ జ్ఞానేశ్వర్, అశోకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మం వైపే కృష్ణుడు

- భగవద్గీత అన్ని మతాలు, మానవాళికి సంబంధించింది..
- హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ
- యాదవ ట్రస్టు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు
- కాళోజీ కళాక్షేత్రంలో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు



కాళోజీ కళాక్షేత్రంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలకు హాజరైన దత్తాత్రేయ, బండా ప్రకాశ్ తదితరులు

హనుమకొండ టౌన్, 16 (ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణ భగవానుడు ధర్మం కోసం, న్యాయం కోసం నిలబడ్డాడని మాజీ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో యాదవ ట్రస్టు చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్‌యాదవ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బండారు దత్తాత్రేయ హాజరై మాట్లాడారు. భగవద్గీత అన్ని మతాలకు, మానవాళికి సంబంధించిందన్నారు. భగవద్గీత గురిం చి ప్రతీ ఒక్కరు చదివి తెలుసుకోవాలని కోరారు. అధర్మం ఎప్పుడైతే పెరుగుతుందో అప్పుడు ధర్మస్థాపన కోసం అధర్మాని నశింపజేస్తానని శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో పేర్కొన్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో పాడిపశు సంపద పెంపొందించుకోవాలని కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీని కలిసి యాదవ కులస్తులకు రాయితీపై పాడి పశువులు అందిస్తామని, సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తామన్నారు. యాదవ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న నిర్వాహకులను బండారు దత్తాత్రేయ అభినందించారు.


ఆకట్టుకున్న శోభాయాత్ర

హనుమకొండ నగరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. యా దవ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు హనుమకొండ రాంనగర్‌లోని బీసీ భవన్ వద్ద శ్రీకృష్ణుడి శోభాయాత్ర యాదవ ట్రస్టు చై ర్మన్, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి చిత్రపటాలతో ప్రత్యేకరథంలో కాళోజీ కళాక్షేత్రం వరకు శోభాయాత్ర ని ర్వహించారు. ఈ శోభాయాత్రలోభక్తులు శ్రీకృష్ణ భజనలు, గానాలతో, జానపద నృత్యాలు మహిళలు కోలాటాలు, బోనాలతో వీధులలో యాత్ర నిర్వహించారు. ఆపై కాళోజీ కళాక్షేత్రంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకర్షించాయి. చిన్నారులు శ్రీకృష్ణుడి, గోపికల వేషాధారణలతో శ్రీకృష్ణుడి పాటలకు నృత్యాలు చేశారు. ఈ వేడుకలతో కాళోజీ కళాక్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణంగా మారింది. ఈ సందర్భంగా కృష్ణ భగవానుడి చరిత్ర ఆనవాళ్లపై ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ డాక్యుమెంటరీలో గతంలో శ్రీకృష్ణుడిపై ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడిన కృష్ణుడి గీతా సారంశంను ప్రదర్శించారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ వేడుకలో పాల్గొని శ్రీకృష్ణుడి గీతా బోధనలను యావత్ ప్రపంచ దేశాలు అనుసరిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, సాంబారి సమ్మారావు, ట్రస్టు సభ్యులు గొర్రెల పెంపకదారుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ కన్నెబోయిన రాజయ్య యాదవ్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలు నిండి.. గుంతలు తేలి..

వరంగల్ నగరంలో అధ్వానంగా సైడు కాలువలు


వరంగల్ మేదరివాడలో శిథిలమైన డ్రైనేజీ


ప్రమాదకరంగా 12 మోరీల పోతన నగర్ రోడ్డు

- వర్షం తగ్గుముఖం పట్టినా మారని పరిస్థితులు
- పెద్ద ఎత్తున నిండుకున్న చెత్తా చెదారం
- గుంతలమయమైన ప్రధాన రహదారులు
- లోతట్టు ప్రాంతాల్లో ఇంకా నిలిచిన వర్షం నీరు
- పునరావాస కేంద్రాల నుంచి ఇండ్లకు తరలుతున్న ప్రజలు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విస్తారంగా కురిసిన భారీ వర్షాలకు వరంగల్ నగరం అతలాకుతలం అయ్యింది. వర్షం తగ్గుముఖం పట్టిన తర్వాత కూడా నగరంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారం పేరుకుపోయింది. ప్రధానంగా డ్రైనేజీలలో వరద నీరు నిండిపోయి కొన్ని కాలనీలో, లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి చేరుకుని జన జీవనాన్ని స్తంభింపజేశాయి. ఇంకా డ్రైనేజీలలో ఉన్న చెత్త రోడ్లపైకి చేరుకుని తిష్టవేసినా సంబంధిత శానిటేషన్ సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అరకొరగా ఉన్న శానిటేషన్ సిబ్బందిని ఇతర పనులకు పురమాయించడంతో రోడ్లపైన, డ్రైనేజీ కాల్వలు, ఇండ్ల మధ్యలో వర్షపు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. కొన్ని చోట్ల మ్యాన్ హోల్స్ మూసుకుపోవడంతో నీరు అక్కడే నిలిచి ప్రమాదకరంగా ఉంది. చెత్తకుప్పలు, మురుగునీటిపై దోమలు, ఈగలు ఆవాసాలు ఏర్పర్చుకోవడం వల్ల నగర ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. అంతే కాకుండా లోతట్టు ప్రాంతాలలోకి వర్షం నీరు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నిలిచి ఉండడంతో పాములు, తేళ్లు, విషపరుగులు ప్రాణాలను తీసే ప్రమాదం పొంచి ఉంది. కొన్ని లోతట్టు ప్రాంతాల కాలనీలోని ఇండ్లలోకి (మిగతా 6వ పేజీలో)

అధ్వానంగా నగర రోడ్లు

మూడు రోజులుగా కురిసిన వర్షం కారణంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. స్మార్ట్‌సిటీ, అభయ్, సీఎం ప్రత్యేక నిధులు, జనరల్ ఫండ్ ద్వారా కోట్లు ఖర్చు చేసి వేసిన రోడ్లు కాంట్రాక్టర్ల కక్కుర్తితో నాసిరకం పనులు చేయడం వల్ల చిన్నపాటి వర్షానికే గుంతలు పడిపోయాయి. కేయూ రోడ్డు, రంగశాయిపేట, శివనగర్, ఏనుమాముల, చిన్నవడ్డెపల్లి చెరువు రోడ్డు, భద్రకాళి రోడ్డు, భట్టుపల్లిరోడ్డు, పోతననగర్, 12 మోరీల రోడ్డు, చింతల్, లేబర్ కాలనీల ప్రధాన రోడ్లు వర్షం కారణంగా గుంతలు ఏర్పడ్డాయి. రోడ్లపై ఏర్పడిన గుంతలలో నీరు నిలిచి ఉండడం గుర్తించకుండా వాహనచోదకులు అటుగా ప్రయాణం చేయడంతో ప్రమాదాలు బారిన పడుతున్నారు. గొల్లపల్లి క్రాస్‌రోడ్డు వద్ద అడుగులోతు గుంత ఏర్పడినా సంబంధిత అధికారులు, స్థానిక కార్పొరేటర్ పట్టించుకోవడం లేదని అక్కడి ప్రజలు మండిపడుతున్నారు. ప్రధాన రహదారులపై అడుగడుగునా గుంతలు ఏర్పడినా ఇంజనీరింగ్ అధికారులు కాసులకు కక్కుర్తిపడి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారని ఆరోపిస్తున్నారు.


అశోకనగర్ కాజ్‌వేను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారద

అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద

నర్సంపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న భారీవర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం, ఇబ్బందులు కలుగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు సూచించారు. నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు మత్తడి పోస్తుండడంతో అశోకనగర్ సమీపంలోని పాకాల వాగు ఉధృతంగా ప్రవహిస్తుందన్న సమాచారంతో అధికారులతో కలిసి వాగును శనివారం సందర్శించారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున రెవెన్యూ, వైద్యశాఖ అధికారులతో పాటు పోలీసులు, ఇతర శాఖల అధికారులు అ ప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రెండు కోట్లు ఇవ్వాలి

- న్యాయం జరగకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తాం
- మామునూరు ఎయిర్‌పోర్ట్ భూబాధిత రైతుల డిమాండ్
- ఎయిర్‌పోర్టు వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన


ఎయిర్ పోర్ట్ సమీపంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న భూబాధితులు

మామునూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలని కోరుతూ వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయ బాధిత రైతులు శనివారం ఎయిర్‌పోర్టు సమీపంలోని రహదారిని దిగ్బంధించి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు సర్ది చెప్పినా వినకపోవడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గాడిపల్లి, గుంటూర్ పల్లి గ్రామాలకు చెందిన 40 మంది రైతులు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టు నిర్మాణం వరంగల్ జిల్లా ప్రజలకు సంతోషకర వార్త అయినప్పటికీ కమర్షియల్ భూములు కోల్పోతున్న రైతులకు మాత్రం బాధ కలిగిస్తోందన్నారు. పరిహారంగా ఎకరాకు రెండు కోట్ల రూపాయలు చెల్లించాలని, లేదంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ముఖ్య మంత్రి స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కమర్షియల్ భూములకు సరైన ధర కల్పిస్తామని హామీలిచ్చిన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు.. ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికి దాదాపు పది సార్లు కలెక్టర్ రైతులతో సమావేశం నిర్వహించారని, గజానికి రూ.4వేలు ఇస్తామని హామిలిచ్చారని, ఈ విషయమై చెప్పులు అరిగేలా తిరిగామని, అనేక సార్లు ఎమ్మెల్యేలను కలిసినా ప్రయోజనం లేదని వాపోయారు. రైతుల ప్రభుత్వం అంటున్న ముఖ్యమంత్రి తమకు మాత్రం న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు విమానాశ్రయానికి 5 కిలోమీటర్‌ల పరిధిలో భూమికి బదులు భూమే ఇస్తామని అప్పుడు హామీలిచ్చారని, అంతే కాక ఇండ్ల స్థలాలు, సీసీ రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని మంత్రి కొండా సురేఖ చెప్పారని, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని రైతులు కోరారు. లేదంటే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముందు బైఠాయిస్తామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నేతలు ఐకమత్యంతో పనిచేయాలి

రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్



ముల్కనూర్‌లో మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమదేవరపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో తన గన్‌మెన్ ముష్కె రవి, ఏఆర్ సీఐ రజినీకాంత్‌ల తల్లి లచ్చమ్మ మృతి చెందగా, శనివారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవి, రజినీకాంత్‌లను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మొదటిసారిగా భీమదేవరపల్లి మండలానికి రాగా, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శాలువాలు, పూలదండలతో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రతిపక్షాల మాటలను వినవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కరుణాసాగర్‌రావు, హేమంత్‌రెడ్డి, వంగ రామచంద్రం, గజ్జెల రమేష్, జక్కుల అనిల్, ఎదులాపురం తిరుపతి, మాడ్గుల కృష్ణకాంత్, మాడ్గుల చింటూ తదితరులు పాల్గొన్నారు.

బొగత సందర్శన బంద్

వాజేడు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలోని బొగత జలపాత సందర్శనను నిలిపివేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు శనివారం సాయంత్రం ప్రకటించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలపాతానికి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి తెలిపారు. వాజేడు మండలం బొగతతో పాటు వెంకటాపురం ఫారెస్టు డివిజన్ పరిధిలోని అన్ని జలపాతాలకు ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. సందర్శకులు తమ పర్యాటనను వాయిదా వేసుకోవాలని సూచించారు.

‘ప్రజల కథే - నా ఆత్మకథ’ పుస్తకావిష్కరణ

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ స్వీయ రచన

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ రచించిన ‘ప్రజల కథే - నా ఆత్మకథ’ పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం హనుమకొండలోని సామ జగన్మోహన్‌రెడ్డి స్మారక భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఓరుగల్లు సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా ఫోరం కన్వీనర్ డాక్టర్ సమ్మిరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఈ పుస్తకాన్ని ప్రముఖ సాహితీవేత్త సహృదయ సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు సమీక్షించారు. సామాన్య కుటుంబ నుంచి గవర్నర్ స్థాయికి ఎదిగిన దత్తాత్రేయ రాజకీయ జీవితాన్ని వివరించే ఈ పుస్తకం కొత్తగా రాజకీయాల్లోకి వస్తున్న యువ రాజకీయవేత్తలకు ప్రేరణ ఇస్తోందన్నారు. దత్తన్న ఆదర్శ ప్రాయమైన జీవిత చరిత్ర ఈ గ్రంథంలో ఉందన్నారు. ఈ సందర్భంగా వరంగల్‌తో బండారు దత్తాత్రేయకు ఉన్న అనుబంధాన్ని స్థానిక సీనియర్ బీజేపీ నాయకుడు వివరించారు.

చివరిగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. తనకు ఓరుగల్లు రాజకీయ చైతన్యాన్ని ఆత్మీయతను పంచిందన్నారు. ఇక్కడి నేతలు జంగారెడ్డి, డాక్టర్ సౌందరయ్య, లింగాల నర్సింహరెడ్డి తనకు ఆత్మీయులుగా ఉన్నారని అన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన తనకు ఆర్ఎస్ఎస్ పరిచయం లేకుంటే తాను ఈ స్థాయికి చేరుకునే వాడిని కాదన్నారు. రాజకీయాలంటే వ్యాపారం కాదని, సేవ చేస్తూ నైతిక విలువలు పాటించాలని ఆయన సూచించారు. హిందీలో తాను రాసిన ఆత్మకథ ‘జనతాకీ కహానీ మేరీ ఆత్మకథ పేరుతో గత మే నెలలో ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ చేతుల మీదుగా ఢిల్లీలో ఆవిష్కరింపబడిందని, దానికి తెలుగు అనువాదం ప్రస్తుతం హనుమకొండలో ఆవిష్కరించినట్లు ఆయన తెలిపారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రేమేందర్‌రెడ్డి, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, వన్నాల శ్రీరాములు, రావు పద్మ, మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీ సీతారాం నాయక్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆర్ఎస్ఎస్ నేతలు, స్వయం సేవకులు, దత్తన్న అభిమానులు, నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ కృష్ణుడి అలంకరణలో రుద్రేశ్వర స్వామివారు

శ్రీకృష్ణుడి అలంకరణలో రుద్రేశ్వరుడు

హనుమకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వేయిస్తంభాల గుడిలో శ్రీ కృష్ణజన్మాష్టమి, శ్రావణ బహుళ అష్టమిని పురస్కరించుకొని రుద్రేశ్వర స్వామివారిని శ్రీ కృష్ణుడిగా అందంగా అలంకరించారు. శ్రీ సూక్త పూజావిధానంతో పూజలు నిర్వహించారు. వేలాదిమంది భక్తులు ఆలయాన్ని సందర్శించి రుద్రేశ్వరుడిని శ్రీ కృష్ణుడి రూపంలో దర్శించుకొని తన్మయులయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో భగవద్గీత పారాయణం నిర్వహించారు. భక్తుల హరే క్రిష్ణ నామ జపంతో ఆలయం ప్రతిధ్వనించింది. స్వామివారికి నివేదన సమర్పించిన అనంతరం అటుకులు, చక్కెర మిశ్రమంతో తయారు చేసిన ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు. ఆలయ వైదిక కార్యక్రమాలను ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ నిర్వహించారు. అంతకుముందు ఉదయం రుద్రేశ్వరుడికి నిత్యాహ్నికాన్ని, రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ.. శ్రీ కృష్ణతత్వం విశ్వవ్యాప్తమైందని, గీతను కానుకగా ఇచ్చిన ఆ దేవదేవుడిని కృష్ణం వందే జగద్గురుం.. అంటూ భూమండలం అంతా దేవుడిగా కొలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో డి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయానికి బస్సు

ప్రారంభించిన ఆర్టీసీ అధికారులు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

వరంగల్ కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి అమ్మవారి భక్తులకు శుభవార్త. ఆలయానికి సులభంగా వెళ్లడానికి వీలుగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సును ప్రారంభించారు. ఈ బస్సు వరంగల్ బస్టేషన్ నుంచి బయలు దేరి భద్రకాళి ఆలయం మీదుగా కాజీపేటకు వెళ్తుంది. మళ్లీ అదే రూట్‌లో వస్తుంది. అయితే వీటి సంఖ్య రద్దీని బట్టి పెంచుతామని అధికారులు తెలిపారు. ప్రధాన రహదారి నుంచి భక్తులు ఆలయానికి రావడానికి ఇబ్బంది పడుతున్నందున ప్రత్యేక బస్సులు నడపాలంటూ ‘ఆంధ్రజ్యోతి’ గతంలో ప్రత్యేక కథనం ప్రచురించింది. ఈ విషయమై ఆలయ అధికారులు, ధర్మకర్తలు ఆర్టీసీ అధికారులకు విన్నవించగా వారు స్పందించి శనివారం ఆలయం వద్ద బస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బత్తిని శ్రీనివాసరావు, కార్పొరేటర్ దేవరకొండ విజలక్ష్మి సురేందర్, ఆలయ చైర్మన్ డాక్టర్ బి.శివసుబ్రహ్మణ్యం, ఈవో రామల సునిత, అర్చకులు భద్రకాళి శేషు, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, గాండ్ల స్రవంతి, మోత్కూరి మయూరి, ఓరుగంటి పూర్ణచందర్, బింగి సతీష్, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద బస్సు ప్రారంభిస్తున్న అధికారులు

జిల్లాస్థాయి వాలీబాల్, ఫుట్‌బాల్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ స్కూల్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అండర్ 15, 17 బాలబాలికల వాలీబాల్, ఫుట్‌బాల్ ఎంపికలు సందడిగా ప్రారంభం అయ్యాయి. శనివారం హనుమకొండ జేఎన్ఎస్‌లో వాలీబాల్ ఎంపిక పోటీలను ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ వి.ప్రశాంత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లాస్థాయిలో అండర్ 15 బాలబాలికల వాలీబాల్ విభాగంలో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించామన్నారు. అండర్ 15, 17 బాలుర ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన వాలీబాల్, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో 150 క్రీడాకారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 18 19 తేదీల్లో సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అదే విధంగా ఫుట్‌బాల్ విభాగంలో ప్రతిభకనబర్చిన క్రీడాకారులో ఈనెల 20, 21 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కాగా వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో సత్తా చాటేందుకు క్రీడాకారులు చెమటోడ్చారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ జనగామ జిల్లా కార్యదర్శి మర్కల యాదిరెడ్డి, కన్వీనర్ రాముడు, టీజీపేట స్టేట్ ప్రెసిడెంట్ పార్థసారథి, టీజీపేట స్టేట్ వైస్ ప్రెసిడెంట్ డి.సుధాకర్, జిల్లా జాయింట్ సెక్రటరీ నీలం సురేశ్, పీడీలు ఎన్.శ్రీధర్, ఎం.సురేశ్, స్వప్న, నిఖిల్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

డ్రెయినేజీలు నిండి.. గుంతలు తేలి..

(5వ పేజీ తరువాయి)

వర్షం నీరు చేరుకుని నిత్యావసర వస్తువులు వరదనీటిలో తడిసిపోయాయి. కూలడానికి సిద్ధంగా ఉన్న ఇండ్లను గుర్తించిన బల్దియా డీఆర్ఎఫ్ సిబ్బంది నేలమట్టం చేశారు. ఈ మేరకు చాలా కాలనీలలో నివసించే నిరుపేద ప్రజలు వస్తులతో అలమటిస్తుండగా మరికొందరిని మునిసిపల్ అధికారులు గుర్తించి నగరంలోని పునరావాస కేంద్రాలకు తరలించి భోజనం అందిస్తున్నారు. సుమారు 26 కాలనీల ఇండ్లలోకి వర్షం నీరు చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. వర్షం నీరు తగ్గడంతో పునరావాస కేంద్రాలలో ఆశ్రం పొందిన వారు ఇండ్లకు చేరుకుంటున్నారు. ఇంకా చాలా కాలనీలలో నీరు నిలిచి ఉండడం వల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు పయనం

నగరంలో విరివిగా కురుస్తున్న వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను బల్దియా అధికారులు గుర్తించి ఆయా ప్రాంతాలు, డివిజన్‌కు కేటాయించిన పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వరంగల్ ట్రైసిటీస్‌లో 6 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ వెల్లడించారు. గురువారం రాత్రి వరకు 2000మందికి పైగా పలు కేంద్రాలలో ఆశ్రయం కల్పించామని, వారికి కావలసిన భోజన, అల్పాహారం, మందులు, దుప్పట్లు అందించినట్లు అధికారులు తెలిపారు. అంతేకాకుండా కొందరు నిరాశ్రయులు, చెట్ల కింద ఉంటున్న వారికి, కాలనీలలోనే ఉంటున్న కొందరికి స్వచ్ఛంద సంస్థలు ముందుకువచ్చి ఆహారాన్ని అందిస్తున్నారు. వాతావరణ అనుకూలిస్తుండడంతో పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు పయనమైనట్లు తెలిపారు. ప్రజలు ఇప్పుడే ఇళ్లకు వెళ్లిపోవద్దని, పరిస్థితులు చక్కబడే వరకు ఇక్కడే ఉండాలని అధికారులు సూచించారు. ప్రజలకు వైద్యసౌకర్యం, భోజనం అందిస్తామని, వర్షాలు పూర్తిగా తగ్గకముందే వెళ్లి ఇబ్బంది పడవద్దని శానిటేషన్ అధికారులు ప్రజలకు సూచించారు.



మాట్లాడుతున్న డాక్టర్ కె.గీతాంజలి నరేశ్

అరుదైన కిడ్నీ సర్జరీ

యూరాలజిస్టు గీతాంజలి నరేశ్

వరంగల్ మెడికల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పూర్తి గుండె వైఫల్యం, దీర్ఘకాలిక మూత్రపిండ వైఫల్యం ఉన్న రోగికి అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు బాలసముద్రంలోని అంజలి కిడ్నీ కేర్, రీసెర్చ్ సెంటర్ యూరాలజిస్టు డాక్టర్ కె.గీతాంజలి నరేశ్, చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నరేశ్ సముద్రాల శనివారం తెలిపారు. సీరం క్రియాటిన్ 6.8తో ఉన్న హైరిస్క్ సర్జికల్ ఇంటర్వెన్షన్ రోగికి యూఆర్ఎస్ఎల్ సర్జరీతో పాటు ద్వైపాక్షిక డీజే సెట్టింగ్ చేసినట్లు తెలిపారు. ఇదే రోగి ఈ చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లగా సర్జరీ చేయడం కుదరదని చెప్పగా మరో ఆస్పత్రి వారు రూ.3లక్షల 50 వేలు ఖర్చు అవుతుందని తెలుపడంతో నిరాశ చెందిన రోగి చివరకు తమ ఆస్పత్రిని సందర్శించినట్లు పేర్కొన్నారు. తాము మనోధైర్యం కల్పించి కేవలం రూ.60వేలకే ఈ శస్త్ర చికిత్సను పూర్తి చేశామన్నారు. అనస్తీషియా డాక్టర్ సాగర్, థియేటర్ అసిస్టెంట్ నరేశ్, శ్రీకాంత్ పాల్గొన్నట్లు తెలిపారు.



కాశీప్రసాద్‌రావు-సాగరిక నివాసంలో విరబూసిన బ్రహ్మ కమలాలు

విరబూసిన బ్రహ్మ కమలాలు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): హిమాలయ పర్వత ప్రాంతాల్లో కనిపించే, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన బ్రహ్మకమలాలు హనుమకొండ 8వ డివిజన్ మాదిరెడ్డికుంటలోని పగడాల కాశీప్రసాద్‌రావు-సాగరిక నివాసంలో శనివారం విరబూశాయి. సాధారణంగా హిమాలయాల్లో ఎక్కువగా కనిపిస్తూ, రాత్రి పూట మాత్రమే వికసించే అరుదైన పుష్పంగా బ్రహ్మకమలాలు ఎంతో గుర్తింపు పొందాయి. రాత్రిసమయంలో పూసిన ఈ పుష్పలను చూసిన కాశీప్రసాద్‌రావు-సాగరిక కుటుంబ సభ్యులు మంగళ హారతులు సమర్పించి పూజలు నిర్వహించారు. శుభ ఫలితాలకు సంకేతంగా భావించబడే ఈ పుష్పాలు సంవత్సరానికి ఒక్కసారి రాత్రివేళల్లో మాత్రమే వికసిస్తాయి. విరబూసిన బ్రహ్మకమలాలను తిలకించేందుకు కాలనీవాసులు, బంధువులు పెద్ద ఎత్తున కాశీప్రసాద్‌రావు-సాగరిక నివాసానికి బారులు తీరుతున్నారు.

50 ఏళ్లు పైబడిన వారికి ఉచిత ఓపీ

నెఫ్రాన్ కిడ్నీ సెంటర్ యూరాలజిస్టు డాక్టర్ రాఘవేంద్ర ప్రదీప్

వరంగల్ మెడికల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ, మూత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 50 ఏళ్ల వయస్సు పైబడిన వారికి ఉచిత ఓపీ సౌకర్యం అందిస్తున్నట్లు హనుమకొండ విజయ టాకీస్ రోడ్‌లోని రంగా రావు కాంపెక్స్‌లో ఉన్న నెఫ్రాన్ కిడ్నీ సెంటర్ యూరాలజిస్టు డాక్టర్ రాఘవేంద్ర ప్రదీప్ తెలిపారు. 8ఏళ్లుగా సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నగరంలో మొట్టమొదటిసారిగా అత్యాధునిక సాంకేతికతతో కిడ్నీలోని రాళ్లను తొలగిస్తున్నామని, లేజర్ సర్జరీలు, కోత, స్టంట్, గాటు, మత్తు లేకుండా తక్కువ ఖర్చుతో సర్జరీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ సర్జరీలు డేకేర్ సర్జరీలుగా ఉంటాయని తెలిపారు. చిన్నపిల్లల దగ్గర నుంచి పెద్ద వారందరికీ మూత్రపిండాల సమస్యలకు ఒకే చోట చికిత్స అందిస్తున్నామని, అతి తక్కువ ఖర్చుతో ఇప్పటికే 2500 పైగా లేజర్ సర్జరీలు నిర్వహించామన్నారు.

ప్రొస్టేట్ సం బంధిత సమస్యలు, 100 వాట్స్ హైపవర్ లేజర్ మిషన్ తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. యూరో అంకాలజీ, పీడియాట్రిక్ యూరాలజీ లాంటి సౌకర్యాలు కూడా తమ ఆస్పత్రిలో ఉన్నాయని ప్రముఖ యూరాలజిస్టు డాక్టర్ రాఘవేంద్ర ప్రదీప్ తెలిపారు.



సర్జరీ చేస్తున్న రాఘవేంద్ర ప్రదీప్

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సక్సెస్‌కు స్కాలర్స్ కీలకం

ప్రొఫెసర్ మల్లారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ప్రసాద్

కేయూ క్యాంపస్ ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19, 20, 21 తేదీల్లో కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించే ప్రతిష్ఠాత్మకమైన తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ రెండో జాతీయ సదస్సు సక్సెస్‌కు స్కాలర్లు ప్రధాన భూమిక వహించాలని సైన్స్ కాంగ్రెస్ బాధ్యులు ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ ఆర్.మల్లికారున్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్‌లు అన్నారు. శనివారం కేయూలో స్కాలర్స్‌తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ప్రసాద్‌లు పాల్గొని తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సదస్సులో స్కాలర్స్ పాత్రపై దశదిశా నిర్దేశం చేశారు. పేరొందిన శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు కీలక అంశాలపై ప్రతిపాదనలు చేస్తారని వాటిని రీసెర్చ్ పరంగా ఎప్పటికప్పుడూ నోట్ చేసుకుని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. సైన్స్ కాంగ్రెస్‌లో భాగస్వాములు కావాలని కోరారు. రానున్న అతిథుల నుంచి విలువైన సమాచారాన్ని పొందాలని పేర్కొన్నారు. సదస్సును సక్సెస్ చేయాలని అన్నారు. సదస్సు అనంతరం స్కాలర్స్ తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించే ఆడిటోరియం ప్రాంతంలో స్కాలర్స్ శ్రమదానం చేసి చెట్ల మొక్కలను, చెత్త చెదారాన్ని తొలిగించారు. క్యాంపస్‌లోని ఫిజిక్స్ కెమిస్ట్రీ, ఫార్మసీ, జువాలజీ తదితర సెమినార్స్ హాల్‌ను పరిశీలించారు. వసతుల ఇబ్బందులను పరిశీలించారు.

ఇదిలా ఉండగా, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ కమిటీల బాధ్యులతో ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. క్షేత్రస్థాయిలో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ, డాక్టర్ పి.వెంకటయ్య, డాక్టర్ తాడూరి శాస్త్రి, స్కాలర్స్ అంబాల కిరణ్, శ్రీకాంత్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



ఆడిటోరియం ప్రాంతంలో శ్రమదానంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, స్కాలర్లు



హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఉన్న టౌన్ హాల్

శిథిల టౌన్‌షిప్

- మసకబారుతున్న పురాతన కట్టడం
- అద్దాలు పగిలిపోయిన తలుపులు, కిటికీలు
- పెచ్చులూడుతున్న భవనం పైకప్పు
- పాకురు పట్టిన గోడలు, దెబ్బతింటున్న స్తంభాలు
- 101 సంవత్సరాల కిందటి భవనం
- కొంతకాలంగా మూసివేత
- వారసత్వ సంపదను కాపాడడంలో నిర్లక్ష్యం

హనుమకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని అత్యంత ప్రాచీన కట్టడమైన టౌన్‌హాల్ భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. వరంగల్ నగరపాలక సంస్థగానీ, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థగానీ ఈ వారసత్వ సం పదను పట్టించుకోవడం లేదు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, రాష్ట్రావతరణ దినోత్సవం వంటి సందర్భాల్లో విద్యుత్‌దీపాలతో పైపైన అలంకరించడంతోనే సరిపెడుతున్నారు. దూరం నుంచి చూస్తే టౌన్‌హాల్ బాగానే కనిపిస్తున్నా.. దగ్గరకి వెళితేగానీ దీనస్థితి, అసలు స్వరూపం తెలియదు. గతంలో టౌన్‌హాల్‌ను బాగానే చూసుకునేవారు. కొన్నేళ్లుగా దీని గురించి పట్టించుకోవడం మానేసినట్టున్నారు. నిర్వహణ సరిగా లేక క్రమంగా శిథిలమవుతోంది.



దెబ్బతింటున్న టౌన్‌హాల్ పిల్లర్



పెచ్చులూడుతున్న భవనం పైకప్పు

వందేళ్ల కిందట..

టౌన్‌హాల్‌ను నిర్మించి 101 ఏళ్లవుతోంది. భవనం గోడకున్న శిలాఫలకంలో పేర్కొన్న తేదీ ప్రకారం 1334 ఫస్లీ (1924) ఫిబ్రవరి 19న అప్పటి కలెక్టర్ ఎస్ఎం నయీమొద్దీన్ సాహిబ్ దీనికి శంకుస్థాపన చేశారు. మరో దిక్కున గోడకు ఇంకో శిలాఫలకం కూడా కనిపిస్తోంది. దీనిపై ఊర్దూలో రాసి ఉంది. హజ్రత్ సఫీ, సంజ్ నిజాం మాలిక్ షా అనే ఇద్దరు దీనికి శంకుస్థాపన చేసినట్టు అందులో పేర్కొన్నారు.

నిజాం కాలం నిర్మించిన ఈ టౌన్‌హాల్‌ను మొదట్లో మహబూబ్‌భాగ్‌గా పిలిచేవారు. అప్పట్లో ఈ భవనాన్ని కొంత కాలం పాటు పరిపాలనా భవనంగా ఉపయోగించినట్టు తెలుస్తోంది. వరంగల్ పురపాలక సంఘం ఏర్పాటైన తర్వాత ఈ భవనం ఉన్న ప్రాంతాన్ని పబ్లిక్‌గార్డెన్‌గా మార్చి దీనికి టౌన్‌హాల్ అని పేరు పెట్టారు. హనుమకొండ నడిబొడ్డున ఉన్న ఈ ప్రాచీన కట్టడం వరంగల్ నగరానికే ఒక ల్యాండ్‌మార్క్‌గా నిలుస్తోంది. భవనాన్ని కుతుబ్‌షాహీల శైలిలో నిర్మించారు. భవనంలో విశాలమైన హాల్, దాని పక్కన కొన్ని గదులు, చుట్టూ వరండా నాలుగు వైపులా డోమ్‌లను నిర్మించారు. రాజప్రాసాదంగా కనిపించే ఈ భవనాన్ని పూర్తిగా డంగు సున్నంతో కట్టారు. ఇనుప బీముల సాయంతో పైకప్పును ఏర్పాటు చేశారు.



అద్దాలు ధ్వంసమైన దర్వాజలు



పాకురు పట్టిన గోడ

శిథిలావస్థలో..

కట్టడం ఇప్పటికీ పటిష్టంగానే ఉన్నది. నిర్వహణ సరిగా లేకపోవడంతో క్రమంగా దెబ్బతింటోంది. పైకప్పు పెచ్చులూడుతోంది. ఇనుప బీములు తుప్పపట్టి బయటికి కనిపిస్తున్నాయి. స్తంభాలు పగుళ్లు ఏర్పడి దెబ్బతింటున్నాయి. వర్షపు నీరు కారుతుండడం వల్ల పాకురు పట్టి గోడలు దెబ్బతింటున్నాయి. భవనం చుట్టూ ఉన్న తలుపులు, కిటికీల అద్దాలు పగిలిపోవడంతో వాటిని అట్టచెక్కలతో మూసి వేసారు. తలుపులకు ఉన్న జాలీలు ధ్వంసం అయ్యాయి. పబ్లిక్ గార్డెన్‌కు వచ్చినవారు గోడలపై బొగ్గు, పెన్సిల్, పెన్నులతో పిచ్చిరాతలు రాయడంతో వికృతంగా కనిపిస్తున్నాయి. సున్నం వేయక చాలా రోజులు అయినందువల్ల గోడలపై పెచ్చులు రాలుతున్నాయి. హాల్‌ను స్టోర్ రూమ్‌గా మార్చేశారు. వీధి దీపాలకు సంబంధించిన విద్యుత్ వైర్లు, లైట్లు, ఇతరత్రా పరికరాలు, సౌండ్ బాక్సులు ఇతరత్రా సామానులతో నింపేశారు. దీంతో హాల్ అంతా దుమ్ముపట్టి, చెత్తచెదారం పేరుకుపోయి దెబ్బతింటోంది. టౌన్‌హాల్ నాలుగువైపులా డోమ్‌ల కింద ఉండే చిన్నపాటి గదులను కూడా సామానులతో నింపేశారు. సందర్శకులు పాన్‌ను నమిలి ఉమ్మి వేడయంతో గోడమూలలు అసహ్యంగా కనిపిస్తున్నాయి.

టౌన్‌హాల్ మూసివేత

గతంలో టౌన్‌హాల్‌లో ఏదో ఒక కార్యక్రమం జరుగుతూ సందడిగా కనిపిస్తోంది. చేనేత వస్త్రాలు, చేతి ఉత్పత్తులు, పుస్తకాల ప్రదర్శన వంటివి ఇందులో నిర్వహించేవారు. ఆర్ట్ ఎగ్జిబిషన్లు కూడా జరుగుతుండేవి. సాంస్కృతిక పోటీలను, సాహిత్య కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుండేవారు. పంద్రాగస్టు, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ పండుగలు జరిగినప్పుడు ఛాయా చిత్ర ప్రదర్శనలు కూడా ఇందులోనే నిర్వహించేవారు. ఇతర రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు కూడా అడపాదడపా జరుగుతుండేవి. టౌన్‌హాల్‌ను మూసివేయడంతో ఇప్పుడు అలాంటివేవి ఇందులో జరగడం లేదు. దీనితో పర్యవేక్షణ కొరవడి టౌన్‌హాల్ భవనం శిథిలమవుతోంది.

పట్టించుకోని కుడా, కార్పొరేషన్

రూ.10కోట్లకు పైగా ఖర్చుచేసి పబ్లిక్‌గార్డెన్‌ను అభివృద్ధి చేసిన కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ.. వారసత్వ సంపద అయిన టౌన్‌హాల్‌ను మాత్రం పట్టించుకోలేదు. గతంలో బల్దియా కమిషనర్లుగా పని చేసిన ఒకరిద్దరు టౌన్‌హాల్ పరిరక్షణకు చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత వచ్చిన కమిషనర్లు ఎవరూ దీని వంక కన్నెత్తి చూడడం లేదు. 130 ఏళ్ల నాటి కలెక్టర్ బంగ్లాను రూ.2కోట్ల వ్యయంతో ఇటీవల పునరుద్ధరించిన కుడా.. టౌన్‌హాల్‌కు కూడా తగిన మరమ్మతులు చేసి ఈ వారసత్వ సంపదను కాపాడాలని నగరవాసులు కోరుతున్నారు. వందేళ్లకు పైబడిన టౌన్‌హాల్ గత చరిత్రకు సాక్షీభూతం. నిజాం పాలనకు ప్రత్యక్ష సాక్ష్యం. నగరంలోని అపురూప వారసత్వ కట్టడాల్లో ఒకటి. దీనిని పరిరక్షించాల్సిన బాధ్యత కుడా, కార్పొరేషన్‌కు ఉందని ప్రజలు కోరుతున్నారు. తగిన మరమ్మతులు చేసి పూర్వవైభవాన్ని తిరిగి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. హాల్‌లోని సామానులను తొలగించి నిత్యం ఏదో ఒక కార్యక్రమం జరిగేలా చూస్తే టౌన్‌హాల్‌కు పూర్వవైభవం వస్తుందని అభిప్రాయపడుతున్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు బాధ్యతలు అప్పగింతలో తాత్సారం

ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఐదుగురి ఎంపిక

బాలసముద్రం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నియామకమైన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు బాధ్యతలు అప్పగించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 22 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను టీజీపీఎస్సీ ద్వారా ఎంపిక చేసి ఉద్యోగాల్లో నియమించారు. గత సంవత్సరం డిసెంబరులో ఖాళీగా ఉన్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలకు పోస్టింగ్ ఇచ్చింది. ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగులకు 45 రోజుల పాటు శిక్షణ కూడా ఇచ్చింది. గత మే 7న శిక్షణ పూర్తి చేసిన ఉద్యోగులకు ఆహార తనిఖీల బాధ్యతలు అప్పగించక పోవడం విస్మయం కలిగిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఐదుగురు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను కేటాయించగా అందులో హనుమకొండ జిల్లాకు ఒకరు, వరంగల్ జిల్లాకు ఇద్దరు, మహబూబాబాద్ జిల్లాకు ఒకరు, జనగామ జిల్లాకు మరొకరు ఖాళీగా ఉన్న స్థానాలకు కేటాయించారు. ఉద్యోగాల్లో చేరిన వారికి ఇంత వరకు ఆహార పదార్థాలను తనిఖీ చేయడానికి అధికార బాధ్యతలు అప్పగించలేదు. అంతేగాక ఉమ్మడి వరంగల్ జిల్లాకు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌గా పనిచేస్తున్న అధికారి సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లగా ఆ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌గా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన ఎప్పుడో ఒకసారి అడపాదడపా వచ్చి వెళ్తుండగా ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఆహార వ్యాపారులపై పర్యవేక్షణ లేకుండా పోయింది.

అసలు జిల్లాలో ఆహార నియంత్రణ శాఖ పనిచేస్తుందా ? లేదా ? అన్న సందిగ్ధత నెలకొంది. దీంతో వ్యాపారులు తాము ఆడిందే ఆట పాడిందే పాటగా యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు, శుచీశుభ్రతలేని పదార్థాల తయారీ, విక్రయాలతో ప్రజలు రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై చొరవ తీసుకొని నూతనంగా నియమితులైన ఉద్యోగులకు ఆహార పదార్థాల తనిఖీ బాధ్యతలను అప్పగించాలని పలువురు కోరుతున్నారు.

ఏడేళ్ల ఎడారి జీవితం సుఖాంతం

- ఎట్టకేలకు సౌదీ నుంచి స్వగ్రామానికి ఈశ్వర్
- మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ



తాళ్లపల్లి ఈశ్వర్

భీమదేవరపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాళ్లపల్లి ఈశ్వర్ 2017లో సౌదీ అరేబియాకు వలస వెళ్లాడు. ఏడేళ్లుగా అక్కడ ఒక ఖర్జూర తోటలో చిక్కుకుపోయాడు. ఈశ్వర్ భార్య తాళ్లపల్లి లత, ఇద్దరు కూతుళ్లతో కలిసి హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సీఎం ప్రవాసీ ప్రజావాణి కౌంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు గత జూన్ 27న వినతిపత్రం అందజేశారు. ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్‌చైర్మన్ మంద భీంరెడ్డి స్వయంగా వెంట ఉండి వారికి మార్గనిర్దేశం చేశారు. సీఎం ప్రజావాణి నోడల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి దివ్యా దేవరాజన్ ఈశ్వర్‌ను వాపస్ తెప్పించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం జీఏడీ ఎన్నారై విభాగం ద్వారా రియాద్‌లోని ఇండియన్ ఎంబసీకి, ఢిల్లీలోని విదేశీ వ్యవహారాల మంత్రికి లేఖలు రాయించారు. గల్ఫ్ కార్మికుడు ఈశ్వర్ దీనగాథకు మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ఎడారిలో అతను పడ్డ ఏడేళ్ల తపనకు తెర పడింది. సౌదీ అరేబియాలో ఖర్జూరాలను పండించిన ఆ తెలంగాణ వలస జీవి, మాతృభూమికి రావడానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. సౌదీ నుంచి హైదరాబాద్‌కు ఆదివారం చేరుకోనున్నారు. గ్లోబల్ తెలంగాణ ఫోరం అధ్యక్షుడు, సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో నివసించే, కరీంనగర్‌కు చెందిన సామాజిక సేవకులు మహ్మద్ జబ్బార్ ఇండియన్ ఎంబసీతో సమన్వయం చేసి ఈశ్వర్‌ను ఇంటికి వెళ్లడానికి మార్గం సుగమం చేశారు. సౌదీ నుంచి స్వగ్రామానికి వెళ్లే ఆనందంలో భావోద్వేగంతో గల్ఫ్ కార్మికుడు తాళ్లపల్లి ఈశ్వర్ ఏడున్నవే నా పల్లె.. నువ్వు ఏడున్నవే నా తల్లీ.. బతుకు దెరువు కోసం బాట పట్టినా.. పొట్ట తిప్పల కోసం సౌదీ కొచ్చినా.. అంటూ స్వయంగా పాడిన పాటను ఐఏఎస్ అధికారి దివ్యా దేవరాజన్‌కు అంకితం చేశారు.

సైకిల్ సవారీ.. రోగాలు పరార్

» సైక్లింగ్‌తో ఉపయోగాలెన్నో.. » అనారోగ్యాలకు చెక్ » కొవ్వు కరిగించడంలో భేష్ » పర్యావరణానికి తోడ్పాటు



లింగాలఘణపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మూడు పదులు నిండక ముందే కీళ్ల నొప్పులు.. కాసింత నడుస్తారో లేదో ఆయాసం.. మూడడుగులు వేయకముందే మోకాళ్ల నొప్పులు.. ఇలా అనేక రకాల సమస్యలతో సతమతమయ్యేవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. ఇందుకు ప్రధాన కారణం ఒంటికి సరైన వ్యాయామం లేకపోవడమే కాకుండా చీటికిమాటికి వాహనాలను వినియోగించడం. కూరగాయలు కొనాలన్నా.. పాల ప్యాకెట్ తేవాలన్నా ఆఖరికి ప్లే గ్రౌండ్‌కు వెళ్లాలన్నా బైక్ వెంట తీసుకెళ్లాల్సిందే. వ్యాయామానికి ఉపకరించే ఎలాంటి నిర్వహణ ఖర్చులేని పేదోడి వాహనం సైకిల్‌ను తొక్కేవారి సంఖ్య ఏటేటా తగ్గిపోతుంది. వాహనాలను వినియోగించేవారి సంఖ్య మాత్రం పెరిగిపోతూ వాతావరణం కాలుష్యమవుతుంది. దీంతో అనేక రకాల ఆరోగ్య సమస్యలతో ఎంతో మంది బాధపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సైకిల్‌ను వాడితే ఆరోగ్యం.. ఖర్చు లేకుండా పొదుపుతో పాటుగా పర్యావరణ హితులుగా నిలిచే అవకాశం ఉంటుంది.

అనారోగ్య సమస్యలకు చెక్

సైకిల్.. ఎలాంటి ఇంధన ఖర్చు అవసరం లేని వాహనం. కాలంతో పాటు పరుగెడుతున్న ఈనాటి పరిస్థితుల్లో మోటార్ వాహనాల వినియోగం పెరిగిపోతోంది. ద్విచక్ర వాహనాల వినియోగంతో పని సులువుగా అయిపోవడమే కాకుండా ఎలాంటి శ్రమ లేకుండానే పని పూర్తి చేయొచ్చనే భావన నేటితరంలో అధికమైంది. దీంతో రెండు దశాబ్దాల క్రితం దాకా ఆరోగ్య ప్రదాయినిగా నిలిచిన సైకిల్‌ను ఇప్పుడు చాలా మంది చులకనగా చూస్తున్నారు. సైకిల్ వినియోగించేవారి సంఖ్య పడిపోయింది. అయితే సైకిల్ వాడకంతో అనేక రకాల వ్యాధులకు చెక్ పెట్టవచ్చు ప్రధానంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు సైకిల్ తొక్కడం వల్ల షుగర్ అదుపులో ఉంటుంది. దీంతో పాటే ఖరీదైన పెట్రోల్ వాడకం తగ్గించుకునే పొదుపు మంత్రంతో విదేశీ మారకద్రవ్యాన్ని సైతం మిగిల్చిన వారమవుతాం.

ఆరోగ్యానికి హాయి..

సైకిల్ తొక్కడంతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు సైకిల్ వినియోగంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాయి. సైకిల్ తొక్కడంతో గంటకు సుమారు 300 కేలరీల శక్తి ఖర్చవుతుంది. తద్వారా శరీరంలో కొవ్వు పేరుకోకుండా ఉపయోగపడుంది. స్థూలకాయులకు ఇది మంచి వ్యాయామంగా పనిచేస్తుంది. ప్రతీ వంద మందిలో 10-15 మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. అయితే వీరంతా చీటికి మాటికి మోటారు వాహనాలను వినియోగిస్తున్నవారు కావడం గమనార్హం. ఇలాంటి వారు సైకిల్ తొక్కడం వల్ల కొవ్వు తగ్గించుకుని ఆరోగ్యంగా ఉంటారు. నిత్యం సైకిల్‌ను సవారీ చేయడం వల్ల గుండె, ఊపిరితిత్తులు, నాడీ వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. మామూలు వారికంటే సైకిల్ తొక్కేవాళ్లు చురుగ్గా కనిపిస్తుంటారు. ప్రతిరోజూ ఉదయం కొద్దిసేపు సైక్లింగ్ చేయడంతో హృదయ సంబంధిత సమస్యలు దూరమవుతాయని గుండె వైద్యనిపుణులు చెబుతున్నారు.

పర్యావరణానికి ఎంతో మేలు..

సైకిల్ వినియోగంతో అనేక రకాల ప్రయోజనాలు చేకూరుతాయి. దీని వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుంది. మోటారు వాహనాల వినియోగం తగ్గించడంతో పాటు ఇంధన వినియోగాన్ని అదుపులో పెట్టుకోవచ్చు. సాధారణంగా ఏ వాహనంలో కూడా వంద శాతం ఇంధనాన్ని వినియోగించుకునే పరిస్థితులు ఉండవు. దానిలో సరాసరి రెండో వంతు గాలిలో కలిసి పర్యావరణానికి ప్రమాదకరంగా మారుతుంది. దీంతో పాటు వాహనాల నుంచి వెలువడే పొగతో ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో సైకిల్‌ను వినియోగిస్తే ఎలాంటి సమస్యలు ఉండకపోవడమే కాకుండా పెరుగుతున్న ఆర్థిక భారాన్ని నియంత్రించే వీలుంటుంది. ఇందుకోసం ఇప్పుడు అనేక దేశాల్లో సైకిల్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ కొంతమంది పర్యావరణ హితులు వేల కిలోమీటర్ల దూరం సైకిల్ యాత్రను చేపడుతూ అవగాహన కల్పిస్తుండడం విశేషం.

తప్పించుకున్నా.. తప్పదు

- వాహనదారులపై చలాన్ కొరడా
- ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానాలు
- ఉల్లంఘనుల ఫొటోలు ప్రజలు సైతం తీయొచ్చంటున్న పోలీసులు

వరంగల్ క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ పోలీసుల కళ్లు గప్పి తప్పించుకున్నామనుకుంటే పప్పులో కాలేసినట్లే.. దారిలో ఉన్న జంక్షన్లలో విధుల్లో ఉన్న పోలీసులు నిబంధనలు పాటించని వాహనదారుల నెంబర్ పేట్లను కెమెరాల్లో బంధించి చలాన్ల రూపంలో జరిమానా విధిస్తున్నారు. కొంత మంది వాహనదారులు పోలీసులు ఫొటోలు తీసింది గమనించి కూడా జరిమానా వేసినప్పుడు చూద్దాంలే.. అన్నట్లు తేలికగా తీసుకుంటున్నారు. వేల రూపాయలు జరిమానా విధించేదాకా తెలియకుండా రోడ్లపై వాహనాలపై తిరుగుతున్నారు. పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డప్పుడు వెలుగులోకి వచ్చే పెండింగ్ చలాన్లను చూసి షాక్‌కు గురవుతున్నారు. మరికొందరు పోలీసులకు పట్టుబడకుండా నగరంలోని షార్ట్‌కట్ దారుల్లో ప్రయాణిస్తున్నారు.

పెండింగ్ చలాన్లు, చోరీ చేసిన బైకులు

ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా చేస్తున్న తనిఖీల్లో ఎక్కువ మొత్తంలో ఉన్న పెండింగ్ చలాన్ల వాహనాలతో పాటు చోరీ చేసిన ద్విచక్రవాహనాలు పట్టుబడుతున్నాయి. 2024 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలోని మహబూబాబాద్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, ధర్మసాగర్, సుబేదారి, కొండాపూర్, సదాశివపేట, గోదావరిఖని, కాటారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆకివీడు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో చోరీకి గురైన సుమారు 14 ద్విచక్రవాహనాలను హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు తనిఖీల్లో గుర్తించి వాహనాలను బాధితులకు అందజేయడంతో పాటు నేరస్తులను స్థానిక పోలీసులకు అప్పగించారు. జూన్ నెలలో కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ వెంకన్న ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా హనుమకొండ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఏకంగా 233 పెండింగ్ ట్రాఫిక్ చలాన్లు, వాటి జరిమానా సుమారు రూ.45,300తో పట్టుబడ్డాడు. జూన్ 4న హనుమకొండ పీఎస్ పరిధిలోని అశోక జంక్షన్‌లో సీఐ సీతారెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా 109 పెండింగ్ చలాన్లు, వాటి జరిమానా రూ.26,310తో ఓ వాహనదారుడు పట్టుబడ్డాడు. అయితే వాహనం ధర కన్న పెండింగ్ చలాన్ల జరిమానా ఎక్కువగా ఉండటంతో చెల్లించకుండా వాహనాన్ని వదిలేసుకుంటున్నారు. పాత వాహనాలు కొనుగోలు చేస్తున్న సమయంలో తప్పనిసరిగా పెండింగ్ చలాన్ల వివరాలు తెలుసుకునే కొనుగోలు చేయాలని పోలీస్‌శాఖ సూచిస్తోంది.



వాహనదారుడి చలాన్లను చూపిస్తున్న సీఐ వెంకన్న

ప్రజల ఫొటోలకూ జరిమానాలు విధింపు

నిబంధనలు ఉల్లంఘనకు పాల్పడే వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు, లాఅండ్‌ఆర్డర్ పోలీసులే జరిమానా విధించడం కాదు.. ప్రజలు సైతం తమ ఫొటోల ద్వారా పరోక్షంగా జరిమానాలు విధిస్తున్నారు. రోడ్లపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ఇష్టానుసారంగా ప్రయాణించే వాహనదారులతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే విధంగా రోడ్లపై పార్కింగ్ చేసే వాహనాలను ఫొటోలు తీసి ట్రాఫిక్ పోలీసులకు వాట్సాప్‌లో పంపిస్తే వాటిని పరిశీలించి జరిమానా విధిస్తున్నారు. నిత్యం జరిగే ట్రాఫిక్ ఉల్లంఘనలను ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులే గమనించాల్సిన అవసరం లేదని, బాధ్యతగల పౌరులు సైతం ఉల్లంఘనుల ఫొటోలు తీసి పంపిస్తే కొంత మేరకు ఉల్లంఘనలను నియంత్రించవచ్చే ఆలోచనతో ప్రజలు పంపించే ఫొటోలు పరిశీలించి జరిమానాలను విధిస్తున్నామని ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు. ట్రాఫిక్‌కు పెద్దగా అంతరాయం లేకుండా వచ్చే ఫొటోల్లో వాహనదారుడికి కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాయితీల కోసం వేచి చూడొద్దు
ట్రాఫిక్ ఏసీపీ తీర్థాల సత్యనారాయణ



వాహనదారులు ముందుగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు, జరిమానాలకు దూరంగా ఉండొచ్చు. నిబంధనలు తెలిసినా మాటిమాటికి ఉల్లంఘిస్తూ జరిమానాల చెల్లింపుల్లో రాయితీల కోసం ఎదురుచూస్తున్నారు. అలాంటి రాయితీలకు ఆవకాశం లేదు. ఈలోపు పోలీసులకు పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తాం. నిబంధనలు ఉల్లంఘించినట్లనిపిస్తే ఆన్‌లైన్‌లోని ఎం వాలెట్ యాప్‌లో చూసుకొని జరిమానాకు గురైనట్లు ఉంటే వెంటనే చెల్లించాలి. పోలీసులే ఫొటోలు తీయాల్సిన అవసరం లేదు నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రజలే రోడ్లపై ఫొటోతీసి పంపిస్తున్నారు వాటికి సైతం జరిమానాలు విధిస్తున్నాం. పోలీసులు గమనించిన, గమనించకపోయిన నిబంధనలు పాటిస్తే ఏ చిక్కు ఉండదు.

ఇక్కడ ఉంటాం.. అక్కడ ఉంటాం..

- పంద్రాగస్టు వేడుకల్లో ఉరుకులు పరుగులు
- ఖిలావరంగల్, పోలీస్ పరేడ్ గ్రౌండ్ వేడుకలకు ఒత్తిడితో హాజరు

వరంగల్ క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టు వేడుకల్లో ఉరుకుల పరుగుల వాతావరణం కనిపించింది. గ్రేటర్ వరంగల్‌లోనే రెండు జిల్లాలకు సంబంధించిన పంద్రాగస్టు వేడుకలు నిర్వహించగా కొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులు రెండుచోట్ల హాజరుకావడానికి నానా హైరానా పడ్డారు. అత్యవసం లేకున్న హాజరుకావాలనే అతృతతో సైరన్ వినియోగించి పరుగులు తీశారు. ఓ పోలీస్ అధికారి రాష్ట్ర ఉత్తమ సేవా పతకంతో పాటు జిల్లా యంత్రాంగం ఇచ్చే ఉత్తమ ఉద్యోగి ప్రశంసా పత్రానికి ఎంపికయ్యాడు. హనుమకొండ పరేడ్ గ్రౌండ్‌లో మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ఓ అవార్డు తీసుకొని అక్కడి నుంచి వరంగల్‌లో మంత్రి పొంగులేటి శ్రీనువాస్‌రెడ్డి చేతుల మీదుగా మరో అవార్డు అందుకోవడానికి ఆగమేఘాల మీద పరుగెత్తాడు.

మరో అధికారి హనుమకొండ పరేడ్‌గ్రౌండ్‌లో మంత్రికి గౌరవ వందనం సమర్పించి, ఓ ప్లాటూన్‌కు ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తించి జిల్లా ఉత్తమ ఉద్యోగ ప్రశంసాపత్రం అందుకునేందుకు హడావిడిగా ఖిలావరంగల్‌లో జరిగే పంద్రాగస్టు వేడుకలకు హాజరుకావడం కనిపించింది. ఓ ప్రజాప్రతినిధి సైతం మంత్రి ప్రసంగం జరుగుతుండగానే మధ్యలోనే స్టేజీపై నుంచి వెళ్లిపోయి ఖిలావరంగల్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కనిపించారు. ఇలా అక్కడ ఉంటాం... ఇక్కడ ఉంటాం.. అన్న సినిమా డైలాగు చందంగా చాలామంది అక్కడ, ఇక్కడ కనిపించారు.

తీజ్ పండుగను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలి



తీజ్ వేడుకల్లో మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ

- హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ
- గిరిజన భవన్‌లో ఘనంగా తీజ్ సంబరాలు

వడ్డెపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తీజ్ పండుగను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గ్రేటర్ వరంగల్ తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన తీజ్ ఉత్సవాలను శనివారం ఆయన సందర్శించారు. బంజారాల ఆరాధ్య దైవాలు శ్రీరామాయాడి, సంత్ సేవాలాల్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను బంజారా సమాజం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. బంజారా సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, బంజారా నేతలు అంగోతు వినోద్ లోక్ నాయక్, బదావత్ బాలాజీ నాయక్, డాక్టర్ గుగులోతు రాజునాయక్, భూక్యా హేమానాయక్, గుగులోతు సజ్జన్ నాయక్, లకావత్ రవీందర్, డుంగ్రోతు కిశోర్ నాయక్, భూక్యా సాంబయ్య నాయక్, కిషన్ నాయక్, మాలోతు నానునాయక్, అజ్మీరా ప్రియాంక నాయక్, అంగోతు రమాబాయి, మాజీ జడ్పీటీసీ కేలోతు సత్తమ్మ, భూక్య సునీత, శ్రీలత రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధరమ్‌సింగ్‌కు 'హ్యూమానిటేరియన్' అవార్డు

53 సార్లు రక్తదానానికి గుర్తింపుగా ప్రదానం



న్యూ ఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు సంతోష్ భగ్‌ధోరియా చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఠాకూర్ ధరంసింగ్

హనుమకొండ సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హనుమ కొండకు చెందిన ఠాకూర్ ధరంసింగ్‌కు 'హ్యూమాని టేరియన్ ఎక్సలెన్స్-2025' జాతీయ అవార్డు దక్కింది. యేటా క్రమం తప్పకుండా మూడు సందర్భాల్లో మొత్తం గా 53సార్లు రక్తదానం చేసినందుకు గుర్తిం పుగా ధరంసింగ్ అవార్డు పొందారు. స్వాతం త్ర్య దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం రాత్రి న్యూఢిల్లీలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. 'ఐకెన్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యులు సంతోష్ భగధోరియా హాజరయ్యారు. వివిధ రంగాల్లో సేవా, సామాజిక కార్యక్రమాలు చేపట్టిన అవారికి హ్యూమానిటేరియన్ ఎక్సలెన్స్ జాతీయ స్థాయి అవార్డులను ప్రదానం చేశారు. హనుమకొండకు చెందిన ఠాకూర్ ధరంసింగ్ ప్రభుత్వ ఉద్యోగి. రాష్ట్ర భూగర్భ జల శాఖలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు. గతంలోనూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి అవార్డులను పొందారు. అవార్డు దక్కడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. యేటా జనవరి 23 (సుభాష్ చంద్రబోస్ జయంతి), జూన్ 14 (ప్రపంచ రక్తదాన దినోత్సవం), సెప్టెంబర్ 27(భగత్‌సింగ్ జయంతి) సందర్భాల్లో రక్తదానం చేస్తానని ఈ సందర్భంగా ఠాకూర్ ధరంసింగ్ తెలిపారు. రక్తదానం ఎంతో గొప్పదని దీనిపై ముఖ్యంగా యువతను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

నేడు వారాల కుల సంఘం ఎన్నికలు

హసన్‌పర్తి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తిలోని వారాల కుల సంఘం భవనంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు వారాల కుల సంఘం హసన్‌పర్తి 2025-28 నూతన కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పావుశెట్టి నర్సింహరాములు, కందుకూరి సంజీవ్ తెలిపారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర బాధ్యులు పావుశెట్టి వెంకటేశం, గుండమీది రవీందర్ హాజరవుతున్నట్లు చెప్పారు. పాత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి సత్యనారాయణ, గంట నాగేశ్వర్ నివేదిక అనంతరం ఎన్నిక ప్రక్రియ ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పోస్టులకు ఒక్కొక్కరు, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శుల పోస్టులకు ఇద్దరు చొప్పున, కార్యవర్గ సభ్యులకు 8 మందితో పాటు జోనల్ పోస్టుకు ఒకరిని ఎన్నుకుంటారని తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సమయానికి సకాలంలో హాజరై దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వారాల కుల సంఘం భవనంలో జరిగే ఎన్నికలకు కుల సభ్యత్వం తీసుకున్న వారు హాజరై ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.

సువిద్య జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే



కళాశాలలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ప్రశాంతి

బాలసముద్రం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నక్కలగుట్టలోని సువిద్య జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ ప్రశాంతి మాట్లాడుతూ.. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండి సాకారం చేసుకునే విధంగా కృషి చేసి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని ఉద్బోధించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సంస్కారంతో కూడిన విద్యతో బంగారు భవిష్యత్ కోసం ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థినులను ఆశీర్వదించారు. కళాశాల డైరెక్టర్లు జితేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి విద్యార్థినులకు ఫ్రెషర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. సువిద్య కళాశాలల్లో చదివి ఐఐటీ, మెడికల్ ర్యాంకులు సాధించిన విద్యార్థినులను సన్మానించారు. వేడుకల్లో విద్యార్థినులు పలు నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవో జ్ఞానేశ్వర్‌పై చర్యలు తీసుకోవాలి

- మంత్రి కొండా సురేఖకు విజ్ఞప్తి
- ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి అభ్యర్థన



మంత్రి సురేఖకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

హనుమకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కులవివక్షతో దుర్భాషలాడిన వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి మామిడి జ్ఞానేశ్వర్‌పై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని సైతం వినతి పత్రాలు సమర్పించారు. ఈనెల 12న ఆకడమిక్ విషయాలపై ఎంఈవోలతో వాట్సాప్ గ్రూప్ కాల్‌లో మాట్లాడే క్రమంలో ఏఎంవో సుజన్ తేజను డీఈవో దుర్భాషలాడాడని అందులో పేర్కొన్నారు. డీఈవో మాటతీరు వల్ల ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతినే వ్యవహరిస్తున్నారన్నారు. డీఈవోపై తక్షణం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మంత్రి సురేఖను, ఎంపీ, ఎమ్మెల్యేను కలిసి వారిలో టీజీహెచ్‌ఎం నాయకులు ఆచార్య ప్రద్యుమ్న, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు తాటికాయ కుమార్, సి.సుజన్ ప్రసాదరావు, నామోజు శ్రీనివాస్, గుండు కరుణాకర్, ఎస్.రవూఫ్, కె.రవీందర్, కె.కుమార్‌స్వామి, డీటీఎఫ్ పక్షాన ఎ.శ్రీనివాసరెడ్డి, ఎ. గోవిందరావు, టీపీటీఎఫ్ నుంచి కె.భోగేశ్వర్, టీపీయుఎస్ నుంచి బి.వెంకరమణ, ఎస్.వెంకన్న, ఎం.నర్సయ్య తదితరులు ఉన్నారు.

కృష్ణస్వామి సేవలు మరువలేనివి

శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్



కృష్ణస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బండా ప్రకాష్, ముదిరాజ్ సంఘం నాయకులు

న్యూశాయంపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ తొలి మేయర్ కృష్ణస్వామి ముదిరాజ్ సేవలు మరువలేనివని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని బండా ప్రకాష్ నివాసంలో శనివారం కృష్ణస్వామి 132వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణస్వామి చిత్రపటానికి బండా ప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రజినీకాంత్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం వరంగల్ జిల్లా చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్య ముదిరాజ్, కలకోట అభినాశ్, గిన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికల ప్రచారం షురూ

వరంగల్‌సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికల ప్రచారం శనివారం మొదలైంది. ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తన ప్యానెల్ సభ్యులతో కలిసి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డిని, బ్యాంక్ షేర్ హోల్డర్స్‌ను కలిసి తమ ప్యానెల్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తోట జగన్నాథం, ముందాడ వేణుగోపాల్, చకిలం ఉపేందర్, కూరపాటి చంద్రమౌళి, వడ్నాల సదానందం, సత్యమోహన్, నీల మల్లేశం పాల్గొన్నారు.

జర్నలిస్టును దుర్భాషలాడిన వ్యక్తిని అరెస్టు చేయాలి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు కంకణాల సంతోష్‌ను సోషల్ మీడియా ద్వారా దుర్భాషలాడిన శ్రీధర్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి బండి అశోక్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ టైలర్‌స్ట్రీట్‌లోని అమరావతి కాన్ఫరెన్స్ హాలులో మాల మహానాడు ముఖ్య కార్యకర్తల అత్యవసర సమావేశం పనికెల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బండి అశోక్ మాట్లాడుతూ.. దళిత జర్నలిస్టు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సంతోష్ ఎదుగుదలను ఓర్వలేని ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు తుమ్మ శ్రీధర్‌రెడ్డి అగ్ర కుల దురహంకారంతో సోషల్ మీడియాలో దుర్భషలాడుతూ పోస్టులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శ్రీధర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయినా పోలీసులు అరెస్టు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. శ్రీధర్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ ఓరం సమ్మయ్య, గ్రేటర్ వరంగల్ మాలమహానాడు అధ్యక్షుడు ఎ.రామచంద్రరావు, సభ్యులు కొరివి అనిల్, నూనె రాములు, కొమ్మాలు, సురాసి విక్రమ్ కుమార్, రాజ్‌కుమార్, నర్సయ్య, వంగేటి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు
- ప్రత్యేక ఆకర్షణగా గ్రీస్ పోల్ అధిరోహణ



హనుమకొండ బీఆర్‌ఎస్ కార్యాలయం వద్ద ఉట్టి కొడుతున్న చిన్నారులు

వడ్డేపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 57వ డివిజన్ గోకుల్‌నగర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గోకుల్ యాదవ సంఘం, శ్రీవేణు గోపాలస్వామి, పోచమ్మ దేవాలయ అభివృద్ధి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయం ఆవరణలో నేత్రపర్వంగా నిర్వహించారు. సాంస్కృతిక ఉత్సవాలు ఆద్యంతం అలరించాయి. శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారుల ప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారులతో ఉట్లు కొట్టించారు. యాదవ యువకులు గ్రీస్ పోల్‌ను అధిరోహించారు. విజేతలకు బహుమతులను సేవా సమితి ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీవేణుగోపాలస్వామి, పోచమ్మ దేవాలయ అభివృద్ధి సేవా సమితి అధ్యక్షుడు చాతబోయిన వెంకటేశ్వర్లు, గోకుల్ యాదవ సంఘం అధ్యక్షుడు చల్లా రాజు యాదవ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ యాదవ్, నర్సంపేట, హనుమకొండ ఏసీపీలు కిరణ్‌కుమార్, నర్సింహరావు, గోకుల్ యాదవ సంఘం ప్రతినిధులు మూగల కుమార్ యాదవ్, బంక సంపత్ యాదవ్, బంక రమేష్, బొంగు రాజు యాదవ్, నక్క లింగయ్య, సత్యం యాదవ్, సతీష్ యాదవ్, చేరాలు, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆలయ పూజారులు రామ్ శర్మ, రాజయ్య తదితరులు శ్రీకృష్ణుడి ప్రతిమలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

● హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ వంద ఫీట్ల రోడ్డులోని వేంకటేశ్వర కాలనీలో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని త్రైత సిద్ధాంత హిందూ జ్ఞాన వేదిక జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణాన్ని శనివారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. భగవద్గీతలోని శ్రీకృష్ణుడి గీతా బోధనలను పఠించారు. కాలనీలోని భక్తులు శ్రీకృష్ణ భగవానుడిని కొలిచారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత హిందూ జ్ఞానవేదిక జమ్మికుంట శాఖ వ్యవస్థాపకులు వెంకటాచార్యులు మాట్లాడుతూ భగవద్గీత ప్రజలకు మరింత చేరువయ్యేందు కోసమే తమ ప్రయత్నమన్నారు. జ్ఞానవేదిక ప్రతినిధులు శశికాంత్, వెంకట్, రాధిక, రాజు, భార్గవి, కవిత, దివ్య, రాజలింగంతో పాటు భక్తులు భగవద్గీత పారాయణంలో పాల్గొన్నారు.



బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్‌లో ఉట్టి కొడుతున్న విద్యార్థులు

● **న్యూశాయంపేట:** గ్రేటర్ వరంగల్ పరిధిలోని 31వ డివిజన్ న్యూశాయంపేటలో యాదవ యూత్ సంఘం ఆధ్వర్యంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు యాదవ్ హాజరై ఉట్టి కొట్టిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. అలాగే న్యూశాయంపేటలోని కేతన్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకున్నారు.

● **కాజీపేట:** కాజీపేట 62వ డివిజన్ సోమిడిలోని రాధాకృష్ణ దేవాలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ కుటుంబం పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులు చిన్నికృష్ణుడి ప్రతిమ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలు ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఎంతో ఉల్లాసంగా పాల్గొన్నారు. రాజస్థాన్ ప్రగతి సమాజ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదానం జరిగింది. ఈ ఉత్సవంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ పాల్గొని ఉట్టి కొట్టారు. కాజేపేటలోని వివిధ కాలనీలలో సైతం కృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



హనుమకొండ గోపాల్‌పూర్‌లో గోపిక వేషధారణలో చిన్నారి

శ్రీనివాస్ గురుకుల్ పాఠశాలలో..

● **బాలసముద్రం:** హనుమకొండ బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ పాఠశాలలో శనివారం శ్రీకృష్ణ అష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పోటీ పడ్డారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు చూపరులను ఆకట్టుకున్నారు. నృత్యాలతో అందరిని ఉత్సాహపరిచారు. పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించినందుకు కరస్పాండెంట్ చిదురాల సోమరత్నం విద్యార్థులను ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పిన్సిపాల్ యుగేందర్, అధ్యాపకులు అనూష, రాధిక, రజిని, లావణ్య, దివ్య, శిరీష, సదానందం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీఆర్ స్కూల్‌లో..

● **హసన్‌పర్తి:** శ్రీకృష్ణుడు లేని మహాభారతాన్ని ఊహించలేమని ఎస్‌పీఆర్ స్కూల్ డైరెక్టర్ గౌరిశెట్టి జగన్‌మోహన్ అన్నారు. గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్ శివారు బావుపేట క్రాస్‌రోడ్డులోని ఎస్‌పీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాఠశాల ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమం జరుగగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై కృష్ణాష్టమి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



న్యూశాయంపేటలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

● వాసవి క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో గల గోశాలలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు, క్లబ్ అధ్యక్షుడు సంద్రు నాగేందర్, కార్యదర్శి చిదర పురవర్దన్, జోన్ చైర్మన్‌లు నాగమల్ల సుధీర్, వెలగందుల భీష్మనాథం, మంచెన శ్యాంసుందర్, అప్పని రమేష్, చిదర భానుప్రకాష్, సంద్రు సత్యప్రకాష్, నిరోషా, రేణుక, లక్ష్మీదుర్గ, పురోహితులు పాల్గొన్నారు.

● **హనుమకొండ టౌన్:** హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో కృష్ణాష్టమి వేడుకలను శనివారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. అనంతరం కార్యాలయంలో చిన్నారులతో ఉట్టి కొట్టించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంక్ నర్సింగరావు, పశ్చిమ నియోజక వర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, నాయకులు పాల్గొన్నారు.



కృష్ణాష్టమి వేడుకలను ప్రారంభిస్తున్న పాఠశాల డైరెక్టర్ జగన్మోహన్



సోమిడిలోని రాధాకృష్ణ ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న స్థానికులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సఖి లీగల్ అడ్వైజర్ శ్రీదేవి

హసన్‌పర్తి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి లీగల్ అడ్వైజర్ శ్రీదేవి అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి కమ్యూనిటీ హాల్‌లో శనివారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ సెంటర్ నిర్వహించబడుతుందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు ప్రతి రోజు 24 గంటల పాటు సఖి సెంటర్ ద్వారా కౌన్సిలింగ్ సహాయం, న్యాయ, వైద్య, పోలీసు, తాత్కాలిక వసతి వంటి ఐదు రకాల సేవలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. సమస్య ఉన్న మహిళలు హెల్ప్‌లైన్ 181, చైల్డ్‌లైన్ నెంబర్ 1098, 0870-2452112, 7382983088 నెంబర్లకు కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సఖి కేస్ వర్కర్ అనూష, సీసీలు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సఖి లీగల్ అడ్వైజర్ శ్రీదేవి తదితరులు

మడికొండ గురుకులం తనిఖీ



మడికొండ బాలికల గురుకుల పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

మడికొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనశాలకు వెళ్లి విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను స్వయంగా పరిశీలించారు. రోజువారి మెనూ ప్రకారం విద్యార్థులకు శుభ్రమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రిన్సిపాల్, నిర్వాహకులను ఆదేశించారు.

మాదకద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన ఉండాలి

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : సీఐ శివకుమార్

వరంగల్ క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మాదవ ద్రవ్యాల అనర్థాలు, సైబర్ క్రైమ్ ముప్పుపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని హనుమకొండ సీఐ శివకుమార్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా శనివారం రాత్రి కొత్తూర్ జెండాలో హనుమకొండ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ శివకుమార్ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ప్రధానమైందని, ప్రతీ షాపుల ఎదుట, కార్నర్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి భవిష్యత్‌ను కాపాడుకోవాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని, ఓటీపీ, పర్సనల్ వివరాలను ఎవరికి చెప్పవద్దన్నారు. సైబర్ మోసం జరిగితే 1930కు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కాలనీవాసులంతా ముందుకొచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేరాలను నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పరశురాములు, స్థానిక కార్పొరేటర్ శ్రీమాన్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ ప్రైవేట్ వాహనాల యాజమానులను హెచ్చరించారు. హనుమకొండ బస్టాండ్ సర్కిల్ నుంచి హైద్రాబాద్‌కు వెళ్లే ప్రైవేట్ వాహనాల యాజమానులతో శనివారం హనుమకొండ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో సమావేశం ఏర్పాటు చేసి పలు హెచ్చరికలు జారీ చేశారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, ప్రయాణికుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందినా చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగే వెంటనే హనుమకొండ పోలీసులు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.



కొత్తూర్ జెండా వద్ద అవగాహన కల్పిస్తున్న సీఐ శివకుమార్

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లి బోనాలు

మడికొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మడికొండలో ముదిరాజ్ కులస్థుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి బోనాల జాతర శనివారం వైభవంగా జరిగింది. మహిళలు నెత్తిన బోనం ఎత్తుకొని భక్తితో గ్రామ శివారులోని పెద్దమ్మ తల్లి అమ్మవారి ఆలయానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల నడుమ ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి పిల్లా పాపలను చల్లంగా చూడు తల్లీ అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కులపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



బోనాలతో పెద్దమ్మ తల్లి ఆలయానికి వెళ్తున్న భక్తులు

ఢిల్లీ ఎన్‌సిఆర్ వీధుల నుంచి వీధి కుక్కలను తొలగించి షెల్టర్‌కు పంపించాలంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన సంచలన తీర్పు పలు విమర్శలు, వాదనలకు తెర లేపిన విషయం అందరికీ తెలిసిందే! నిజానికి వీధి కుక్కలను పెంపుడు కుక్కలుగా ఆదరించినప్పుడు ఇలాంటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు తక్కువ. ఈ దిశగా ఆలోచించి వాటిని అక్కున చేర్చుకున్న కొందరు ప్రముఖుల గురించి తెలుసుకుందాం!

వీరికి ప్రేమ ఎక్కువే!



రతన్ టాటా

దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటా, వీధి కుక్కలను ఆదరించడమే కాకుండా, వాటి సంరక్షణ, పునరావాస కార్యక్రమాలు కూడా చేపట్టారు. తన పెంపుడు కుక్కను జీవితాంతం జాగ్రత్తగా చూసుకోవాలని తన వీలునామాలో కూడా రాసుకున్నారాయన. జంతువుల ఆస్పత్రి, ఆశ్రయాలను స్థాపించి, విలాసవంతమైన తన తాజ్ హోటల్‌లో ప్రత్యేకమైన ప్రవేశాన్ని కూడా కల్పించారు. గతంలో రతన్ టాటా గోవాలో పర్యటిస్తున్నప్పుడు, ఒక వీధి కుక్క తననే వెంబడిస్తూ ఉండడాన్ని గమనించి, దాన్ని వెంట తెచ్చుకుని 'గోవా' అనే పేరుతో ప్రేమగా పెంచుకున్నారు.


హృతిక్ రోషన్

ఈ బాలీవుడ్ నటుడు 2022లో 'మోగ్లి' అనే వీధి కుక్కను దత్తత తీసుకున్నారు. ముంబయి వీధుల్లో కారు కింద కనిపించిన ఈ వీధి కుక్కను ఒక వ్యక్తి కాపాడినప్పుడు, అతన్నుంచి దాన్ని హృతిక్ దత్తత తీసుకున్నారు.

జాన్ అబ్రహామ్



బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహామ్‌కు 'బెయిలీ అబ్రహామ్' (తల్లి కుక్క), 'సియా అబ్రహామ్' (కుక్క పిల్ల) అనే రెండు వీధి కుక్కలున్నాయి. జంతు ప్రేమికుడైన జాన్ అబ్రహామ్, లాభాపేక్షలేని జంతు హక్కుల సంస్థ పెటాతో కలిసి పని చేస్తున్నాడు.



సిద్ధార్థ్ మల్హోత్ర

సిద్ధార్థ్ మల్హోత్రకు 'జెర్రీ' అనే ఇండీ డాగ్ ఉంది. కుక్కల పట్ల తనకున్న ప్రేమను సామాజిక మాధ్యమాల్లో చాటుకునే ఈ హీరో, శాంతి అనే రెస్క్యూ డాగ్ ఫొటో షూట్‌లో మోడల్‌గా కూడా నటించాడు.

సోహా అలీ ఖాన్



సోహా, ఆమె భర్త కునాల్‌కు... 'నిమ్కి, మిష్టి, మస్తి, ఆరియో' అనే వీధి కుక్కలున్నాయి. వీళ్ల వీధి కుక్కల దత్తత క్యాంపులు, ఆశ్రయాలకు కార్యకర్తలుగా వ్యవహరిస్తూ, సామాజిక మాధ్యమాల ద్వారా భారతీయ వీధి కుక్కల దత్తతను ప్రోత్సహిస్తూ ఉంటారు.



ఆదిత్య రాయ్ కపూర్

తన ఫామ్ హౌస్ దగ్గర కనిపించిన వీధి కుక్కను మరో ఆలోచన లేకుండా ఇంటికి తెచ్చి పెంచుకున్నారు హిందీ నటుడు, ఆదిత్య రాయ్ కపూర్. దాని పేరు 'లూనా'.

సన్నీ లియోన్

నటి సన్నీ లియోన్ 'లిలు' అనే వీధి కుక్కతో పాటు ఏడు కుక్కలను దత్తత తీసుకుంది. గతంలో సన్నీ లియోన్ పెటాకు ప్రచారకర్తగా వ్యవహరించి, జంతు హక్కుల పట్ల అవగాహనా కార్యక్రమాలు చేపట్టింది.



మాధురి దీక్షిత్

2019లో మాధురి, ఒక ఇండీ డాగ్‌ను దత్తత తీసుకుంది. 'ఈ కుక్కపిల్ల మా మనసునెంతగా దోచుకుందో మా ముఖాల మీద విరబూసే ఈ చిరునవ్వులే చెబుతున్నాయి' అంటూ తన పెంపుడు కుక్క గురించి సామాజిక మాధ్యమంలో పోస్ట్ కూడా పెట్టారామె. అలాగే జంతు ప్రేమికులందరూ వీధి కుక్కలను దత్తత తీసుకుని, జీవితాల్లో ఆనందం నింపుకోవాలని కూడా కోరారు.



రణదీప్ హుడా

ఈ నటుడికి 'బాంబి' అనే ఇండీ డాగ్ ఉంది. 2018లో ఈ కుక్కను దత్తత తీసుకున్న రణదీప్, పలు సందర్భాల్లో కుక్కలను కొనుక్కోవద్దు, దత్తత తీసుకోమని అభిమానులను కోరాడు.


ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
రివర్స్ ఆఫ్ ఫేట్	హాలీవుడ్ సిరీస్	ఆగస్టు 20
హోస్టేజ్	హాలీవుడ్ సిరీస్	ఆగస్టు 21
అమెజాన్ ప్రైమ్		
రోడ్ ఆన్ ఏ మిలియన్ సీజన్ 2	హాలీవుడ్ సిరీస్	ఆగస్టు 22
జియో హాట్‌స్టార్		
పీస్ మేకర్ సీజన్ 2	హాలీవుడ్ సిరీస్	ఆగస్టు 21
ఆహా		
కొత్తపల్లిలో ఒకప్పుడు	తెలుగు సినిమా	ఆగస్టు 22
ఆపిల్ టీవీ		
ఇన్‌వేషన్: సీజన్ 3	హాలీవుడ్ సిరీస్	ఆగస్టు 22







తన నటనతో తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న నటీమణులలో **ప్రగతి** ఒకరు. తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో అనేక వందల సినిమాల్లో నటించిన ప్రగతి... ఇటీవల పవర్ లిఫ్టింగ్ జాతీయ పోటీల్లో గోల్డ్ మెడల్ గెలిచారు. త్వరలో జరగనున్న 'పవర్ లిఫ్టింగ్ ఆసియా ఛాంపియన్‌షిప్స్'లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించబోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రగతిని 'నవ్య' పలకరించింది.

సండే సెలబ్రిటీ



ఆ దశ దాటేశా

ఎలా ఉన్నారు?

బాగున్నాను. కొత్త సవాళ్లు, వాటిని ఎదుర్కోవటం, గెలవటం... జీవితం చాలా ఎక్సైటింగ్‌గా ఉంది.

పవర్‌లిఫ్టింగ్‌లో బంగారు పతకం గెలిచి అందరిని ఆశ్చర్యంలో ముంచారు.. ఈ క్రీడలోకి ఎలా ప్రవేశించారు?

చిన్నప్పటి నుంచి నాకు ఫిట్‌గా ఉండటమంటే ఇష్టం. అన్ని ఆటలూ ఆడేదాన్ని. కాలేజీలో నేను ఎన్‌సీసీలో ఉండేదాన్ని. ఎన్‌సీసీలో నాకు జాతీయ స్థాయి సైక్లింగ్‌లో గోల్డ్‌మెడల్ వచ్చింది. ఆ తర్వాత కూడా ప్రతిరోజూ నడక తప్పనిసరిగా ఉండేది. అయితే గత 15 ఏళ్ల నుంచి ఫిట్‌నెస్ కోసం రోజూ జిమ్‌కు వెళ్లేదాన్ని. కొత్త రకాల ఎక్సర్‌సైజ్‌లు, కొత్త వర్కవుట్లు చేస్తూ ఉండేదాన్ని. సుమారు మూడేళ్ల క్రితం అనుకుంటా... నేను నివసించే కమ్యూనిటీలో ఒకావిడ పవర్‌లిఫ్టింగ్ శిక్షణతీసుకొనేవారు. ఆవిడ్ని చూసి పారు అనే నా స్నేహితురాలు ఆ శిక్షణలో చేరింది. తను వచ్చి - "నీకు పవర్ లిఫ్టింగ్ బాగా నచ్చుతుంది" అని తనతో పాటు శిక్షణకు రమ్మంది. "సరే.. ఒక రోజు చూద్దాం" అని నేనూ చేరాను. అలా నా పవర్‌లిఫ్టింగ్ ప్రస్థానం ప్రారంభమయింది.

మూడేళ్లలో జాతీయ స్థాయిలో పతకం గెలవటం కష్టం కదా...

అవును. ఈ మూడేళ్లూ చాలా కష్టపడ్డా. ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. నేను 2022లో మొదలుపెట్టాను. 2023లో కొన్ని సదరన్ స్టేట్స్ పోటీల్లో, నేషనల్స్‌లో పాల్గొన్నాను. 2024లో నా కాలికి సర్జరీ అయింది. దాంతో ఆ సంవత్సరమంతా పవర్‌లిఫ్టింగ్ చేయలేకపోయాను. ఈ ఏడాది ప్రారంభంలో మళ్లీ ట్రైనింగ్ మొదలుపెట్టా. ఈ నెలలో జరిగిన నేషనల్స్‌లో బంగారు పతకం వచ్చింది. డిసెంబర్‌లో ఆసియా ఛాంపియన్‌షిప్స్ ఉంది. దాన్లో మన దేశం నుంచి పాల్గొంటున్నా.

ఫైటింగ్ ప్రధానంగా ఉన్న సినిమా పాత్రలేమైనా చేశారా?

రెండు, మూడు సినిమాలు చేశాను. తెలుగులో 'ప్రేమ ఖైదీ' సినిమాను కన్నడంలో తీశారు. తెలుగులో శారదగారు చేసిన పాత్ర అక్కడ చేశాను. తెలుగులో ఆ పాత్రను వయస్సులో పెద్దదిగా చూపించారు. కన్నడంలో ఆ పాత్రకు తక్కువ వయస్సు ఉంటుంది. ఆ సినిమాలో ఫైట్స్ ఉంటాయి. సినిమా కోసం ఫైట్స్ చేయటం అదే తొలిసారి. ఆ తర్వాత విష్ణువర్ధన్ హీరోగా తీసిన 'హృదయవసంత' అనే సినిమాలో పోలీస్ ఆఫీసర్ క్యారెక్టర్ వేశాను. దానిలో కూడా కొన్ని ఫైట్స్ ఉంటాయి. ఆ తర్వాత నేను అమెరికా వెళ్లిపోయాను. సినిమాలకు బ్రేక్ వచ్చింది. అమెరికా నుంచి వచ్చి మళ్లీ సినిమాలు చేయటం మొదలుపెట్టిన తర్వాత ఫైటింగ్ పాత్రలు చేయలేదు.

మీరు ఎప్పుడూ మీడియాకు ఎందుకు దూరంగా ఉంటారు? సోషల్ మీడియాలో మీ అప్‌డేట్స్ ఎందుకు కనిపించవు?

నేను గతంలో రెండు, మూడు ఇంటర్వ్యూలు ఇచ్చాను. వాటి ద్వారా నా గురించి ప్రజలకు తెలుసు. నేను చెన్నైలో చదువుకున్నా. చిన్నప్పుడే పెళ్లి అయిపోయింది. నాకు ఇద్దరు పిల్లలు. నేను సింగిల్ మదర్‌ని. ఇంత కన్నా నా జీవితంలో చెప్పుకోదగ్గ విషయం కానీ, ప్రేక్షకులు తెలుసుకోవాల్సిన విషయాలు కానీ ఏమి లేవు. గతంలో చెప్పిన విషయాలనే పదే పదే ఎందుకు చెప్పాలి? దానివల్ల ప్రయోజనం ఏముంటుంది? అందుకే నేను మీడియాకు దూరంగా ఉంటా.

> **"ఆసియా ఛాంపియన్‌షిప్‌లకు వెళ్లటానికి చాలా ఖర్చవుతుంది. స్పాన్సర్లతో మాట్లాడుతున్నా. కొన్ని కంపెనీలు ముందుకు వచ్చాయి. కానీ ఇంకా ఏదీ ఫైనల్ కాలేదు."**

కానీ చాలా మంది సినీ తారలు తమ వ్యక్తిగత జీవితాల గురించి సోషల్ మీడియాలో పంచుకుంటూనే ఉంటారు కదా...

నా వృత్తి జీవితానికి, వ్యక్తిగత జీవితానికి మధ్య స్పష్టమైన విభజన రేఖ గీసుకున్నాను. నా వ్యక్తిగత జీవితం గురించి నా కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, సన్నిహితులకు తెలిస్తే చాలు. ఒక విధంగా అది వారికి నేను ఇచ్చే గౌరవం. నాతో కలిసి ప్రయాణం చేస్తున్నందుకు వారికి నేను పంచే ప్రేమ. ఆ వివరాలను అందరితో పంచుకోవటం నాకు ఇష్టం ఉండదు. ప్రేమించే వ్యక్తులకు నేను ప్రత్యేకంగా ఇచ్చే స్పేస్ అది. ఇక ఆర్టిస్టుగా ప్రగతి గురించి ప్రేక్షకులకు ఎంత తెలియాలో అంత తెలిస్తే చాలు. ప్రగతి వ్యక్తిగత విషయాలు తెలియాల్సిన అవసరం లేదనేది నా భావన.

మీరు చాలా ఎమోషనలా?

అవునండి. నేను చాలా ఎమోషనల్. నేను మనుషులను చాలా త్వరగా నమ్మేస్తాను. త్వరగా హర్ట్ అవుతాను. బహుశా అందుకే నేను ఎక్కువమందికి దూరంగా ఉంటా. అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మంచిది కదా!

మరి క్రీడల్లో గెలుపోటములు సహజం కదా! అంత ఎమోషనల్‌గా ఉంటే ఎలా ఆడగలుగుతారు?

నేను శారీరకంగా చాలా బలంగా ఉంటాను. మానసికంగా కొద్దిగా వీక్‌గా ఉండవచ్చు. అయితే ప్రతి రోజూ మూడు గంటల పాటు క్రమం తప్పకుండా ప్రాక్టీసు చేయటం, గెలవాలనే పట్టుదలతో పాజిటివ్ ఆలోచనలతో ఉండటం వల్ల నేను అనేక పాఠాలు నేర్చుకున్నా. ఇప్పుడు మానసికంగా కూడా బలంగా ఉండగలుగుతున్నా! పవర్ లిఫ్టింగ్‌లోకి రాకముందు చాలా సెన్సిటివ్‌గా ఉండేదాన్ని. నన్ను ఎవరూ ఏమీ అనకపోయినా- 'అన్నారేమో' అనే ఆలోచనలు నన్ను పీకుతూ ఉండేవి. పవర్ లిఫ్టింగ్‌లోకి వచ్చిన తర్వాత నాలో చాలా మార్పు వచ్చింది.

> **"నేను పవర్ లిఫ్టింగ్ మొదలుపెట్టిన మొదటి రెండు నెలలు నరకం చూశాను. శరీరంలో ప్రతి అణువణువు నొప్పి పుట్టేది. ఆ నొప్పుల వల్ల రాత్రి నిద్ర పట్టేది కాదు. నొప్పితో, నిద్ర రాక ఏడ్చిన రాత్రులు ఎన్నో ఉన్నాయి. 'మళ్లీ ప్రాక్టీసుకు వెళ్లకూడదు' అని పడుకొనేదాన్ని. కానీ ఉదయం మామూలే! ప్రాక్టీసు వెళ్తే కలిగే తృప్తి వేరే ఉండేది. అది ఈ నొప్పులు, బాధల కన్నా గొప్పది. ఈ విషయం తెలిసిన తర్వాత నాలో మార్పు వచ్చింది. పవర్ లిఫ్టింగ్‌ను ప్రేమించడం నేర్చుకున్నా!**



మీరు కొద్దిగా లేటు వయస్సులో పవర్ లిఫ్టింగ్‌లోకి ప్రవేశించారు కదా... ఇబ్బంది అనిపించలేదా?

లేదండి. పవర్ లిఫ్టింగ్ నన్ను శారీరకంగా.. మానసికంగా ఆరోగ్యంగా ఉంచుతోంది. ప్రతి మహిళ జీవితంలో మోనోపాజ్ ఒక కీలకమైన దశ. ఆ సమయంలో మూడ్ స్వింగ్స్ ఉంటాయి. శారీరకంగా కూడా అనేక మార్పులు వస్తాయి. వాటన్నిటినీ తట్టుకోవటం చాలా కష్టం. ఈ దశలో నాకు పవర్ లిఫ్టింగ్ చాలా సాయం చేసింది. మోనోపాజ్ సమస్యలు ఎదుర్కొనేవారికి నేను ఇచ్చే సలహా ఏమిటంటే- "మీరు కూడా ఏదో ఒక యాక్టివిటీ ప్రారంభించండి. దీనివల్ల శారీరకంగా.. మానసికంగాను చాలా ప్రశాంతత లభిస్తుంది. మోనోపాజ్ వల్ల కలిగే రకరకాల మూడ్ స్వింగ్స్ తగ్గుతాయి. ఒక పని చేశామనే తృప్తి కలుగుతుంది. నా ఉద్దేశంలో 40 నుంచి 50 ఏళ్ల వయస్సు మధ్యలో ఉన్న మహిళలు అందం మీద కన్నా ఫిట్‌నెస్ మీద ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. ఒక మనిషికి ఆరోగ్యాన్ని మించిన సంపద ఇంకోటి ఉండదు. ఈ సంపదను మనం మాత్రమే సంపాదించుకోవాలి. ఎవ్వరూ ఇవ్వరు.

ఒక వైపు సినిమాలు.. మరో వైపు ప్రాక్టీసు... ఎలా సాధ్యమయింది?

నేను సినిమాలు చాలా తగ్గించేసుకున్నా. నాకు బాగా నచ్చిన పాత్రలు వస్తేనే చేస్తున్నా. నాకు పవర్ లిఫ్టింగ్ ఎంత సంతృప్తి ఇస్తోందో... అంత సంతృప్తి ఇచ్చే పాత్ర వస్తేనే చేస్తాను. దీనికి నేను మానసికంగా సిద్ధపడ్డా.

అలా అయితే ఎక్కువ సినిమాలు చేయలేరు కదా...

నేను మంచి ఆర్టిస్టుని. నా జీవితంలో ఎన్నో కష్టనష్టాలు చూశాను. నన్ను నేను తీర్చిదిద్దుకుంటూ ఈ స్థితికి వచ్చాను. ఇప్పుడు నాకు సంతృప్తి చాలా అవసరం. మంచి పాత్రలు వచ్చినప్పుడు తప్పకుండా చేస్తాను. డబ్బుల కోసం చేయను. నాది మిడిల్ క్లాస్ జీవన విధానం. ఉన్నంతలోనే బతుకుతాను. ఒకప్పుడు మంచి దుస్తులు, మేకప్ సామాన్లు, వాచీలు.. ఇలాంటి వాటిపై ఆసక్తి ఉండేది. ఇప్పుడు ఆదశ దాటేశాను. వాటికి అయ్యే ఖర్చును పవర్‌లిఫ్టింగ్ శిక్షణమీద పెడుతున్నా.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

• టీజర్

బాలీవుడ్‌కు మరో విశ్వసుందరి

ఇతర పరిశ్రమల నుంచి బాలీవుడ్‌కు దిగుమతి అయిన మరో తార... హర్నాజ్ సంధు. చేసింది రెండే పంజాబీ చిత్రాలు. అయినా అందంతో పాటు నటనపరంగానూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఒకప్పటి విశ్వసుందరిగా సుపరిచితురాలైన ఆమె... ఇప్పుడు 'బాగీ4'లో టైగర్ షరాఫ్‌కు జోడీగా అదరగొట్టడానికి సిద్ధమవుతోంది.



కొన్త ఆలస్యమైనా మెగా ప్రాజెక్ట్‌తో హిందీ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇస్తోంది హర్నాజ్. వచ్చే నెల ఐదున విడుదలవుతున్న 'బాగీ4'లో సూపర్‌స్టార్లు సంజయ్‌దత్, టైగర్ షరాఫ్‌తో పాటు పంజాబీలో అగ్ర తార సోనమ్ బజ్వా నటిస్తోంది. వారందరితో కలిసి తెరపై మురిపించే అరుదైన అవకాశం రావడంతో, దాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తీవ్రంగా కష్టపడుతోంది హర్నాజ్. సాజిద్ నడియడ్‌వాలా నిర్మిస్తున్న ఈ సినిమాలో ఆమెది యాక్షన్ సన్నివేశాలతో కూడిన గ్లామరస్ పాత్ర. అందుకే దానిపై ఎన్నో ఆశలు పెట్టుకుంది. తొలి చిత్రంతోనే బ్లాక్‌బస్టర్ దక్కుతుందని ఆశిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్లలో హర్నాజ్‌ను చూసి ఫిదా అవుతున్నారు అభిమానులు.

కల నిజమైన రోజు...

"డిసెంబరు 12... నా జీవితంలో ఎంతో అమూల్యమైనది. ఆ రోజునే నేను 'విశ్వసుందరి' కిరీటాన్ని గెలుచుకున్నాను. మూడేళ్ల తరువాత మళ్లీ అదే రోజున 'బాగీ4' లాంటి భారీ ప్రాజెక్టులో భాగస్వామిని అయ్యాను. ఇది నా కొత్త ప్రయాణానికి నాందిగా భావిస్తున్నాను" అని ఓ సందర్భంలో తన సంతోషాన్ని పంచుకుంది హర్నాజ్. అంతేకాదు... నిర్మాత సాజిద్‌కూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. "నాకు ఇంత అద్భుతమైన అవకాశం ఇచ్చినందుకు దార్శనికుడైన సాజిద్ సర్‌కు రుణపడి ఉంటాను. ఆ నిర్మాణ సంస్థ కుటుంబంలో నేనూ ఒక సభ్యురాలిని అవడం ద్వారా నా కల నిజమైంది. నాపై నమ్మకం ఉంచి, ఎన్నో ఏళ్ల నా బాలీవుడ్ కలను నిజం చేసినందుకు ధన్యవాదాలు" అంటూ భావోద్వేగానికి లోనైంది.

చదువుకొంటూనే...

పంజాబ్ గురుదాస్‌పూర్ జిల్లా కోహలిలో పుట్టిన హర్నాజ్‌కు మొదటి నుంచి గ్లామర్ ప్రపంచంపై మక్కువ ఎక్కువ. ఆ దిశగానే ప్రయత్నాలు చేస్తూ వచ్చింది. ఆమె తండ్రి ప్రీతమ్ పాల్ సింగ్ సంధు రియల్‌ఎస్టేట్ వ్యాపారి. తల్లి రబీందర్‌కౌర్ గైనకాలజిస్టు. కొంతకాలం బ్రిటన్‌లో ఉన్న ఆమె కుటుంబం, తిరిగి భారత్‌కు వచ్చాక చండీగఢ్‌లో స్థిరపడింది. హర్నాజ్... అక్కడి శివాలిక్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసింది. ప్రభుత్వ పీజీ కళాశాల నుంచి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందింది. పంజాబీతోపాటు హిందీ, ఇంగ్లీష్ కూడా అనర్గళంగా మాట్లాడగలదు. చదువుకొంటూనే మోడల్‌గా ప్రయత్నాలు మొదలుపెట్టింది. తల్లిదండ్రులు కూడా ఆమె అభిరుచిని కాదనలేదు.



మలుపు తిప్పిన మజిలీ...

కొంత కాలానికి హర్నాజ్ ప్రయత్నాలు ఫలించాయి. 2017లో స్థానిక అందాల పోటీల్లో పాల్గొని 'మిస్ చండీగఢ్' టైటిల్‌ను గెలుచుకుంది. ఏడాది తరువాత 'మిస్ మాక్స్ ఎమర్జింగ్ స్టార్ ఇండియా' కిరీటం దక్కింది. 2019లో పంజాబ్ రాష్ట్రం నుంచి 'ఫెమినా మిస్ ఇండియా'కు ఎంపికైంది. కానీ టాప్ 12కే పరిమితమైంది. అయితే 2021లో 'మిస్ దివా' టైటిల్ సాధించడంతో ఆమె ఆత్మవిశ్వాసం రెట్టింపయింది. ఆమె కెరీర్‌ను అనూహ్య మలుపు తిప్పింది. అదే ఏడాది జరిగిన 'మిస్ యూనివర్స్' పోటీల్లో నెగ్గి, చిరకాల కోరికను నెరవేర్చుకుంది. ఈ ఘనత సాధించిన మూడో భారతీయురాలిగా రికార్డులకు ఎక్కింది. 'మిస్ యూనివర్స్'గా ఇజ్రాయిల్, అమెరికా, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, వియత్నాం, దక్షిణాఫ్రికా తదితర దేశాలు చుట్టివచ్చింది. అదే ఏడాది పంజాబీ చిత్రంతో నటిగా కెరీర్‌ను ఆరంభించింది. 'బాగీ4'తో హిట్ కొడితే బాలీవుడ్‌లో ఇక తనకు తిరుగులేదని భావిస్తోంది ఈ భామ. మరి ఆమె కోరిక నెరవేరుతుందా..? సెప్టెంబరు 5 వరకు... వెయిట్ అండ్ సీ!









చిత్రజ్యోతి
SINCE 1965

నిర్మాతలే సమస్యను పెంచుతున్నారు

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

సినీ కార్మికుల సమ్మె 13వ రోజుకు చేరుకుంది. కానీ నిర్మాతలు సంప్రదింపుల పేరుతో కాలయాపన చేస్తున్నారు. మేము షరతులకు అంగీకరించట్లేదని బయట మాట్లాడుతున్నారు' అని ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ అన్నారు. సినీ కార్మికుల సమ్మె.. వారి వేతనాల పెంపుపై శనివారం ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ స్పందించారు. 'మమ్మల్ని మీడియా ముందు మాట్లాడవద్దు అని చెప్పి, నిర్మాతలు మాత్రం శుక్రవారం ప్రెస్ మీట్ పెట్టారు. మేము రెండు పాత షరతులను అంగీకరించట్లేదని అన్నారు, అది తప్పు. మాతో చర్చించకుండానే మేము షరతులకు అంగీకరించట్లేదు అని ఎలా చెబుతారు. 50 ఏళ్ల నుంచి లేని కండిషన్స్ ఇప్పుడు పెడితే ఎలా. మీరు ఎంత వేతనం ఇస్తారో కచ్చితంగా చెబితే, కార్మికులతో చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని ఇప్పటికే స్పష్టం చేశాం. బ్లాంక్ పేపర్ కూడా తీసుకొచ్చి వారికి ఇచ్చాం. మీకు నచ్చినట్లు రాయండి అని చెప్పాం. నిర్మాతలు కూడా కష్టాల్లో ఉన్నారని తెలుసు. అందుకే దిగి వచ్చి చర్చలకు సిద్ధం అని మరోసారి చెప్తున్నాము. కానీ వారు చర్చలకు అందుబాటులో ఉండడం లేదు. షూటింగ్ చేసుకునేవాళ్లకు ఎలా సహకరించాలో.. షూటింగ్ చేయని వారి నుంచి ఎలా డబ్బులు రాబట్టాలో మాకు తెలుసు. గౌరవ వేతనం అనేది సినిమాను, కష్టాన్ని బట్టి. అలాగే, ఛాంబర్, కౌన్సిల్ నిర్ణయాలను బట్టి ఉంటుంది. వేతనాల గురించి మాట్లాడితే ఏవేవో పాయింట్లు తెస్తున్నారు. గతం గురించి మాట్లాడితే మేమూ మాట్లాడాల్సి ఉంటుంది. నిర్మాతలే సమస్యను పెంచుతున్నారు. వారి నిర్ణయం చెబితే మా కార్యాచరణ మేము ప్రకటిస్తాం' అని అన్నారు.



తరాలు మారినా తగ్గని క్రేజ్


వెండి తెరపై సూపర్ స్టార్ రజని అని టైటిల్స్‌లో కనిపించగానే థియేటర్ ఏ విధంగా మారుమోగుతుందో పలుమార్లు తాను స్వయంగా చెన్నైలో చూశానని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గుర్తుచేసుకున్నారు. సినీ జీవితంలో స్వర్ణోత్సవం చేసుకుంటున్న సూపర్ స్టార్ రజనీకాంత్‌కు శనివారం ఒక ప్రకటన ద్వారా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తరాలు మారుతున్నా సినీప్రియుల్లో ఆ ఆనందోత్సాహాల వన్నె తగ్గలేదని, ఆ స్థాయి అభిమానులను దక్కించుకున్న అగ్రశ్రేణి కథానాయకుడు రజనీకాంత్ ఒక్కరే అని కొనియాడారు. "నటుడిగా రజనీకాంత్ ప్రయాణం ఎందరికో స్ఫూర్తిగా నిలిచింది. ప్రతినాయక పాత్ర పోషించినా, కథానాయకుడిగా మెప్పించినా రజనీకాంత్ తనదైన స్టైల్‌ను చూపించి ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేశారు. రజనీకాంత్ మరిన్ని విభిన్న పాత్రలతో సినీ ప్రియులను మెప్పించాలి." అని ఆయన ఆకాంక్షించారు.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

అలరించే సుందరకాండ



నారా రోహిత్, విర్తి వాఘని జంటగా నూతన దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కించిన చిత్రం 'సుందరకాండ'. సందీప్ పిక్చర్ ప్యాలెస్ బేనర్‌పై సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మించారు. సినిమా ఈనెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో నారా రోహిత్ మాట్లాడుతూ 'సినిమా చాలా కొత్తగా ఉంటుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలకు మంచి స్పందన లభిస్తోంది. వినాయక చవితి రోజు కుటుంబమంతా కలసి థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నా' అని అన్నారు. నటుడు నరేశ్ వీకే మాట్లాడుతూ 'ఇలాంటి రొమాంటిక్ కామెడీ ఇప్పటి వరకూ రాలేదు. తప్పకుండా మిమ్మల్ని అలరిస్తుంది' అని చెప్పారు. దర్శకుడు వెంకటేశ్ మాట్లాడుతూ 'నా మొదటి సినిమా ఒక డ్రీమ్ మూమెంట్. ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసుకీ, శ్రీదేవి విజయ్ కుమార్, నిర్మాత సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కన్మణి... కనువిందు

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వం వహిస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'ఓజీ'. సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఓజాస్ గంభీర్ అనే గ్యాంగ్‌స్టర్ అవతార్‌లో పవన్ కల్యాణ్ కనిపించనున్నారు. ఆయనకు జోడీగా ప్రియాంక అరుళ్ మోహన్ నటించారు. ఆమె ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం శనివారం విడుదల చేసింది. కన్మణి పాత్రలో ప్రియాంక అలరించనున్నారు. త్వరలో ఈ చిత్రం నుంచి రెండో పాటను విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇమ్రాన్ హష్మీ, అర్జున్‌దాస్, ప్రకాశ్‌రాజ్, శ్రియా రెడ్డి కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవి కె చంద్రన్, మనోజ్ పరమహంస, ఎడిటర్: నవీన్ నూలి

నటుడిగా నాకు సవాల్ విసిరే పాత్ర



సాయిపల్లవి, రణ్‌బీర్‌కపూర్ సీతారాములుగా నితేశ్ తివారి దర్శకత్వం వహిస్తున్న బాలీవుడ్ చిత్రం 'రామాయణ'. సన్నీడియోల్ ఇందులో హనుమంతుడి పాత్రలో కనిపించనున్నారు. త్వరలో ఆయన పాత్రకు సంబంధించిన చిత్రీకరణ ప్రారంభించబోతున్నారు. ఈ సందర్భంగా సన్నీడియోల్ మాట్లాడుతూ 'హనుమంతుడి పాత్ర పోషిస్తున్నందుకు ఆనందంతోపాటు భయం కూడా కలుగుతోంది. త్వరలోనే రామాయణ సెట్స్‌లోకి అడుగుపెట్టబోతున్నాను. నటుడిగా నాకు సవాల్ విసిరే పాత్ర ఇది. హనుమంతుని పాత్రలో జీవించాలి. ఈ సినిమాతో ప్రపంచమంతా రామాయణం గొప్పదనాన్ని మరోసారి తెలుసుకుంటుంది' అని చెప్పారు.

ఆమెలోని గొప్ప నటిని చూస్తారు

- దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల



'భావోద్వేగాలతో అందరికీ కనెక్ట్ అయ్యే చిత్రం 'పరదా'. సినిమా చూస్తున్న ప్రేక్షకుల కళ్లలో నీళ్లు తిరుగుతాయి. ఈ చిత్రం ఒక చర్చకు తావిస్తుంది. జనం మాట్లాడుకునే సినిమా అవుతుంది. ఇందులో అనుపమలోని గొప్ప నటిని చూస్తారు' అని అన్నారు దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల. అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో ఆయన తెరకెక్కించిన 'పరదా' ఈనెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రవీణ్ మీడియాతో సినిమా విశేషాలు పంచుకొన్నారు. 'ఈ కథ వినగానే అనుపమ చాలా భావోద్వేగానికి గురయ్యారు. 'నేను చేయాలని అనుకుంటున్నది ఇలాంటి సినిమానే' అని చెప్పారు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. చిత్రీకరణకు దాదాపు మూడేళ్లు పట్టింది. మనాలి, ధర్మశాల ఇలా ఎన్నో అద్భుతమైన ప్రదేశాల్లో వందలాది మందితో చిత్రీకరించాం. ఎక్కడా గ్రీన్ మ్యాట్ వాడలేదు. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ అనుభూతిని ఇవ్వాలనే ప్యాషన్‌తో చేసిన సినిమా ఇది. ఇప్పటి వరకు చూసిన అనుపమ వేరు ఈ సినిమాలో చూసే అనుపమ వేరు. నిర్మాత సురేశ్ బాబు సినిమా చూసి బాగుందని మెచ్చుకున్నారు. నేను చిన్నప్పటి నుంచి మాస్ కమర్షియల్ సినిమాలు చూస్తునే పెరిగాను. అలాంటి సినిమాలు చేయడం నాకు ఇష్టం. ఆ అవకాశం రావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

వినోదం పంచే కథతో



యాక్షన్‌కి థ్రిల్‌ని మేళవించి తీసిన చిత్రం 'ఫైటర్ శివ'. ప్రభాస్ నిమ్మల దర్శకత్వంలో ఉన్నం రమేశ్, నర్సింహ గౌడ్ నిర్మించారు. సునీల్ కీలకపాత్ర పోషించారు. ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ చేతుల మీదుగా చిత్రబృందం శనివారం టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రభాస్ నిమ్మల మాట్లాడుతూ 'సామాజిక అంశానికి వాణిజ్య హంగులు జోడించి తెరకెక్కించిన చిత్రమిది. ప్రథమార్థం అంతా వినోదాత్మకంగా, ఉల్లాసంగా నడుస్తుంది. ద్వితీయార్థంలో పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. మణికాంత్ డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్ర చేస్తున్నారు. ఆయన నటన అందర్నీ అలరిస్తుంది అని నిర్మాతలు తెలిపారు. 'ఊహకందని మలుపులతో కథ సాగుతుంది. ప్రేక్షకులకు వంద శాతం వినోదాన్ని పంచుతుంది' అని మణికాంత్ తెలిపారు.



సస్పెన్స్ థ్రిల్లర్

రియా సచ్‌దేవ, సత్యం రాజేశ్ జంటగా నటిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఫ్రెండ్లీ ఘోస్ట్'. జి. మధుసూధన్‌రెడ్డి దర్శకుడు. విశ్వనాథ్ డీకే నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మంచు మనోజ్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ 'మంచి కాన్సెప్ట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా 'ఫ్రెండ్లీ ఘోస్ట్' సినిమా థియేటర్లలోకి రాబోతోంది. ఈ సినిమాతో సత్యం రాజేశ్, మధుసూధన్ రెడ్డి, విశ్వనాథ్ గారికి మంచి పేరు రావాలి' అని ఆకాంక్షించారు. భయపెట్టి, ఊపిరిసలపని ట్విస్ట్‌లతో ప్రేక్షకులను మెప్పించేలా సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు. "ఫ్రెండ్లీ ఘోస్ట్' నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో టీజర్, ట్రైలర్ విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. ఈ చిత్రంలో శ్రీనివాస్‌రెడ్డి, సప్తగిరి, వెన్నెల కిశోర్ కీలకపాత్రలు పోషించారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.

ఉత్కంఠభరితంగా బెంగాల్ ఫైల్స్



'ద కశ్మీర్ ఫైల్స్' ఫేమ్ వివేక్‌రంజన్ అగ్నిహోత్రి తెరకెక్కిస్తున్న చిత్రం 'ద బెంగాల్ ఫైల్స్'. అభిషేక్ అగర్వాల్, పల్లవి జోషీ, వివేక్‌రంజన్ అగ్నిహోత్రి నిర్మిస్తున్నారు. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఆలోచన రేకెత్తించే సంభాషణలు, సంగీతం, హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో ఉత్కంఠభరితంగా సాగింది ట్రైలర్. వాస్తవిక సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రం సెప్టెంబరు 5న విడుదలవుతోంది.

పల్లెటూరి ప్రేమ కథ



శ్రీచరణ్ రాచకొండ, గీత్ సైనీ జంటగా సృజన్ అట్టాడ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కన్యాకుమారి'. నటి మధు శాలిని సమర్పించారు. ఈనెల 27న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. మధు శాలిని మాట్లాడుతూ సృజన్ తీసిన 'పుష్పక విమానం' నాకు బాగా నచ్చింది. అలాంటి కొత్త టాలెంట్‌ని సపోర్ట్ చేయాలనిపించింది. సృజన్ చాలా కష్టపడి ఈ సినిమా చేశారు. మంచి థియేట్రికల్ అనుభూతినిచ్చే చిత్రమిది' అని తెలిపారు. దర్శకనిర్మాత సృజన్ మాట్లాడుతూ 'సహజ పాత్రలతో ఆద్యంతం వినోదం అందించే చిత్రమిది. మంచి అనుభూతిని పొందాలంటే తప్పకుండా థియేటర్లలో చూడాలని ప్రేక్షకులను కోరుతున్నా. ఈ సినిమాని ముందుకు తీసుకొస్తున్న మధు శాలినికి కృతజ్ఞతలు' అని అన్నారు. దర్శకుడు ప్రవీణ్ మాట్లాడుతూ మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇది అని అన్నారు. చిత్ర కథానాయిక గీత్ సైని మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమ కథ ఇది. వర్షం పడినప్పుడు వచ్చే మట్టి సువాసన అంత స్వచ్ఛంగా ఉంటుంది. కన్యాకుమారి పాత్రలో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

ఈ రోజుల్లో కోటి రూపాయలంటే చాలా పెద్ద మొత్తమే. అంత డబ్బుంటే విలాసంగానే బతికేయొచ్చు. మంచి ఇళ్లు కొనుగోలు చేయొచ్చు. పిల్లల్ని విదేశాల్లో చదివించవచ్చు. ఆర్భాటంగా పెళ్లిళ్లూ చేయొచ్చు. మరి పాతికేళ్ల తర్వాత మాటేమిటి..? 2050లోనూ రూ.కోటితో ఇవన్నీ సాధ్యపడకపోవచ్చు. ఎందుకంటే, ధరాఘాతం కరెన్సీ విలువను కరిగించేస్తోంది. ఏటేటా ధరలు పెరుగుతూ పోతున్న నేపథ్యంలో కరెన్సీ నోటు కొనుగోలు సామర్థ్యం కూడా అదే స్థాయిలో తగ్గుతూ వస్తోంది. గతంలో మనం చూసిన 5 పైసలు, 10 పైసలు, 20 పైసలు, పావలా, అర్ధ రూపాయి నాణేలు ధరాఘాతం కారణంగా కాలక్రమేణా కనుమరుగైపోవడమే ఇందుకు మంచి ఉదాహరణ. ప్రస్తుతం చలామణిలో ఉన్న రూపాయి, రూ.2, రూ.5, రూ.10 నాణేలదీ భవిష్యత్‌లో అదే పరిస్థితి. కాబట్టి మన ఆర్థిక భవిష్యత్‌ను మెరుగు పర్చుకోవాలంటే.. ధరల పరుగును మించిన వేగంతో ఆదాయాన్ని, పొదుపు సొమ్ము విలువను పెంచుకోవడమే మన ముందున్న మార్గం. అదెలాగో తెలుసుకుందాం..

నేడు రూ. కోటి..



మరి పాతికేళ్ల తర్వాత?

ప్రస్తుతానికి ఆర్థికంగా బలంగానే ఉన్నా.. ద్రవ్యోల్బణం కారణంగా భవిష్యత్‌లో బలహీనపడే ప్రమాదం ఉంది. మీ ప్రస్తుత సంపద విలువను ఏటేటా పెంచుకుంటూ పోవడం ద్వారానే ఈ ముప్పు నుంచి తప్పించుకోగలరు. అది కూడా ద్రవ్యోల్బణం కంటే వేగంగా. ధరల వార్షిక పెరుగుదల రేటునే ద్రవ్యోల్బణం అంటారు. గత 20-25 ఏళ్లలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం సగటు 6 శాతం పైమాటే. ప్రస్తుతం ఇది కాస్త తగ్గి 5 శాతానికి దిగివచ్చింది. వచ్చే 25 ఏళ్లూ ద్రవ్యోల్బణం సగటు 5 శాతంగా ఉండవచ్చనుకుంటే, నేటి కోటి రూపాయల వాస్తవిక విలువ 2050లో రూ.30 లక్షల దిగువకు (రూ.29.53 లక్షలు) పడిపోనుందన్నమాట. అలాగే, ప్రస్తుతం రూ.కోటితో పొందగలిగేదేదైనా 2050లో కావాలంటే దాదాపు రూ.3.4 కోట్లు చెల్లించాల్సి రావచ్చు. అంటే, వచ్చే పాతికేళ్లలో ధర దాదాపు మూడున్నర రెట్లు కానుందన్నమాట. అందుకే, మీ దగ్గరున్న సొమ్ము విలువను కాపాడుకోవాలంటే ధరల పరుగుతో పోటీపడాల్సిందే.

సంపద లేదా పెట్టుబడుల విలువను పెంచుకునేందుకు పలు మార్గాలున్నాయి. ఈక్విటీ మార్కెట్లో నేరుగా లేదా మ్యూచువల్ ఫండ్ పథకాల ద్వారా పెట్టుబడులు మీ సంపద విలువను వేగంగా పెంచే అవకాశం ఉంది. అయితే, ఇది అధిక రిస్క్‌తో కూడుకున్నది. స్థిరాస్తి, బంగారం లేదా వెండి వంటి విలువైన లోహాల్లో పెట్టుబడులూ దీర్ఘకాలంలో ఆకర్షణీయ ప్రతిఫలాలు అందించగలవు. అయితే, వీటిలోనూ ఎంతో కొంత రిస్క్ ఉంటుంది. ప్రభుత్వ సెక్యూరిటీలు, బాండ్లలో పెట్టుబడులు భద్రమైనవి. పైగా ద్రవ్యోల్బణం కంటే అధిక రిటర్నులు లభిస్తాయి. వీటితో పాటు రిస్క్ లేని మరిన్ని పెట్టుబడి సాధనాలు..

నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ (ఎన్‌సీసీ)

చిన్న మదుపరులు పన్ను రాయితీ ప్రయోజనాలతో దీర్ఘకాలం పెట్టుబడులు పెట్టేందుకు ఎన్‌సీసీ మంచి ప్రత్యామ్నాయం. ప్రభుత్వ హామీతో కూడిన ఈ ఐదేళ్ల కాలపరిమితి పథకంపై వార్షిక వడ్డీ రేటు ప్రస్తుతం 7.7 శాతంగా ఉంది.

కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ)

కేంద్ర ప్రభుత్వ పొదుపు పథకమైన కేవీపీపై ప్రస్తుత వార్షిక వడ్డీ రేటు 7.5 శాతంగా ఉంది. ఈ పథకంలో పెట్టుబడి 115 నెలల్లో (9.5 సంవత్సరాలు) రెట్టింపు అవుతుంది.

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్)

60 ఏళ్లు దాటిన వారికోసం కేంద్రం ప్రవేశపెట్టిన పథకమిది. ప్రభుత్వ హామీ, సెక్షన్ 80సీ కింద పన్ను రాయితీ వంటి ప్రయోజనాలున్న ఈ పథకంపై వార్షిక వడ్డీ రేటు 8.2 శాతంగా ఉంది. దీంట్లో గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ)

బ్యాంకుల ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలూ సురక్షితమైనవే. అయితే, దీర్ఘకాలపరిమితి డిపాజిట్లపైనే ఆకర్షణీయ వడ్డీ లభించేందుకు అవకాశం ఉంటుంది.

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)

దీర్ఘకాల వ్యూహంతో సురక్షిత పెట్టుబడి కోసం పీపీఎఫ్ మంచి ఆప్షన్. చక్రవడ్డీ ద్వారా మంచి ప్రతిఫలాలూ లభిస్తాయి. ప్రస్తుతం పీపీఎఫ్‌పై వార్షిక వడ్డీ రేటు 7.10 శాతంగా ఉంది. పన్ను రహిత వడ్డీ, ఐటీ చట్టంలో సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు వంటి ప్రయోజనాలూ ఉన్నాయి.



ఆదాయం పన్ను పరిమితికి లోబడి ఉన్నా

రిటర్నులు దాఖలు చేయాల్సిందే...

ఆదాయ పన్ను (ఐటీ) రిటర్నుల ఫైలింగ్ గడువు దగ్గర పడుతోంది. ఏటా జూలై ఆఖరు వరకు ఉండే గడువును ఈ సంవత్సరం ప్రభుత్వం సెప్టెంబరు 15 వరకు పొడిగించింది. చాలా మంది మన ఆదాయం పన్ను పరిమితికి లోబడే ఉంది కదా.. రిటర్న్ ఫైల్ చేయాల్సిన అవసరం ఏముందని అనుకుంటారు. అయితే ఆదాయం, పన్ను మినహాయింపు పరిధికి లోబడి ఉన్నా.. ఈ కింది సందర్భాల్లో రిటర్న్ ఫైల్ చేయక తప్పదు. అవేమిటంటే..

విదేశీ ప్రయాణ ఖర్చులు: ఆదాయం తక్కువగా ఉన్నా చాలా మంది విదేశీ పర్యటనల్లో జోరుగా ఖర్చు చేస్తుంటారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఈ ఖర్చులు రూ.2 లక్షలు లేదా అంతకు మించి ఉంటే వారి ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా వారు తప్పనిసరిగా ఐటీ రిటర్న్ దాఖలు చేయాలి.

విదేశీ ఆస్తులు: ప్రపంచీకరణ పుణ్యమానీ భారతీయులూ పెద్దఎత్తున విదేశాల్లో ఆస్తులు కూడబెడుతున్నారు లేదా విదేశీ కంపెనీల షేర్లు, రుణ పత్రాల్లో మదుపు చేసి వాటిపై వచ్చే డివిడెండ్, వడ్డీ ఆదాయం పొందుతున్నారు. ఇలాంటి వ్యక్తుల ఆదాయం మన దేశంలో పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా.. తప్పనిసరిగా తమ విదేశీ ఆస్తులు, పెట్టుబడులు, ఆదాయ వివరాలతో ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి.

టీడీఎస్, టీసీఎస్: గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో మీ ఆదాయం నుంచి టీడీఎస్ లేదా టీసీఎస్ రూ.25,000 లేదా అంతకు మించి ఉన్నా ఐటీ రిటర్న్ చేయడం తప్పనిసరి.

వ్యాపార టర్నోవర్, రాబడి: ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక వ్యక్తి వ్యాపార అమ్మకాలు, టర్నోవర్, ఆదాయం రూ.60 లక్షలు మించితే..ఆ వ్యక్తి తప్పనిసరిగా రిటర్న్ ఫైల్ చేయాలి. అదే వృత్తి నిపుణులైతే వార్షిక ఆదాయం రూ.10 లక్షలు మించితే తప్పనిసరిగా రిటర్న్ దాఖలు చేయాలి.

కరెంట్ బిల్లు: కరెంట్ బిల్లు కూడా మీరు ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలా? వద్దా? అనే విషయాన్ని నిర్ణయిస్తుంది. ఆర్థిక సంవత్సరంలో మీ వార్షిక కరెంటు బిల్లు రూ.2 లక్షలు లేదా అంతకు మించి ఉంటే తప్పనిసరిగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి.

ఐటీ రిఫండ్: మీ వార్షిక ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా, ట్యాక్స్ రిఫండ్ ఏమైనా ఉంటే, ఐటీ రిటర్న్ ఫైల్ చేయడం తప్పనిసరి. ఈ రిటర్న్‌లోని సమాచారాన్ని సరిచూసుకునే ఆదాయ పన్ను శాఖ రిఫండ్ జారీ చేస్తుంది.

డిపాజిట్లు: ఏ వ్యక్తికైనా ఒక ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు కరెంట్ ఖాతాలో అయితే రూ.కోటి లేదా అంతకు మించి, సేవింగ్స్ బ్యాంకు ఖాతాలో అయితే రూ.50 లక్షలు లేదా అంతకు మించి డిపాజిట్లు ఉంటే.. వారు తప్పనిసరిగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి.

ఎల్‌టీసీజీ మినహాయింపు కోరితే: వార్షిక ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా పెట్టుబడి లాభాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) మినహాయింపు కోరుకునే వ్యక్తులూ తప్పనిసరిగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



17 తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	520
వరంగల్	487	గోదావరి	510
చిత్తూరు	548	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,180 ▼	92,750 ▼	1,26,200 ▲
విజయవాడ	1,02,600 ▼	96,500 ▼	1,17,400 ▼
విశాఖపట్నం	1,01,350 ▼	92,750 ▼	1,26,200 ▲
రాజమండ్రి	1,01,180 ▼	92,750 ▼	1,17,600 ▼
ప్రొద్దుటూరు	1,00,650 ▼	92,600 ▼	1,17,300 ▼
ముంబై	1,00,023 ▲	91,621 ▲	1,14,933 ▼

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	121
కరీంనగర్	102	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	98
కర్నూలు	102	నెల్లూరు	103
విశాఖపట్నం	113	అనంతపురం	103
గోదావరి	119		

ఎస్‌బీఐ గృహ రుణ రేటు 0.25% పెంపు

తక్కువ క్రెడిట్ స్కోర్ కలిగిన కొత్త రుణగ్రహీతలపై ప్రభావం

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ కొత్త రుణగ్రహీతలకు గృహ రుణాల (టర్మ్ లోన్) వడ్డీ రేటు శ్రేణిని 0.25 శాతం పెంచింది. ఈ నెల 1 నుంచే పెంపు అమల్లోకి వచ్చింది. జూలైలో ఎస్‌బీఐ గృహ రుణాల వడ్డీ రేట్ల శ్రేణి 7.5-8.45 శాతంగా ఉంది. తాజా పెంపుతో 7.5-8.70 శాతానికి చేరుకుంది. వడ్డీ శ్రేణిలో దిగువ స్థాయిని యథాతథంగా కొనసాగించిన బ్యాంకు.. ఎగువ స్థాయిని మాత్రం పెంచిన నేపథ్యంలో తక్కువ క్రెడిట్ స్కోర్ కలిగిన రుణగ్రహీతలపై అధిక భారం పడనుంది. ఎందుకంటే, బ్యాంకులు రుణగ్రహీత క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ ఆధారంగా రుణంపై వడ్డీని నిర్ణయిస్తాయి. సాధారణంగా మంచి స్కోర్ కలిగిన వారికి తక్కువ వడ్డీకే రుణం లభిస్తుంది. క్రెడిట్ స్కోర్ అంతంత మాత్రంగా ఉన్న వారి నుంచి బ్యాంకులు గరిష్ఠ పరిమితి వడ్డీని వసూలు చేస్తుంటాయి. లాభాల మార్జిన్లను కాపాడుకునేందుకు ఎస్‌బీఐ తీసుకున్న తాజా నిర్ణయాన్ని మిగతా బ్యాంకులు అనుసరించే అవకాశం ఉంది.

ఎస్‌బిఐ గృహ రుణ సంబంధిత వడ్డీ రేట్ల వివరాలు..

గృహ రుణం (టర్మ్ లోన్)	7.50-8.70%
హోమ్‌లోన్ మ్యాక్స్‌గెయిన్ (ఓడీ)	7.75-8.95%
టాప్ అప్ లోన్	8.0-10.75%
టాప్ అప్ (ఓడీ) లోన్	8.25-9.45%
స్థిరాస్తి తనఖాపై రుణం	9.20-10.75%
రివర్స్ మార్టిగేజ్ లోన్	10.55%
యోనో ఇన్‌స్టా హోమ్ టాప్ అప్ లోన్	8.35%

స్పోర్ట్స్

ఫైనల్లో అనహత్



న్యూఢిల్లీ: భారత టీనేజ్ స్క్వాష్ సంచలనం అనహత్ సింగ్ మరో అంతర్జాతీయ టైటిల్ అందుకునేందుకు అడుగు దూరంలో నిలిచింది. 17 ఏళ్ల అనహత్.. ఆస్ట్రేలియాలోని బేగాలో జరుగుతున్న ఎన్‌ఎస్‌డబ్ల్యూ స్క్వాష్ ఓపెన్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్లో అనహత్ 3-2తో నూర్ కఫాగీ (ఈజిప్టు)పై గెలిచింది. టైటిల్ కోసం ఈజిప్టుకు చెందిన హబిబా హనితో అనహత్ తలపడనుంది. మరో సెమీస్‌లో హబిబా 3-1తో భారత క్రీడాకారిణి ఆకాంక్ష సాలుంఖేను ఓడించింది.

తాన్యాకు 'సైపన్' టైటిల్



న్యూఢిల్లీ: భారత యువ షట్లర్ తాన్యా హేమంత్ అంతర్జాతీయ వేదికపై మెరిసింది. యూఎస్ఏలోని నార్తర్న్ మరియానా ఐలాండ్స్‌లో జరిగిన సైపన్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో తాన్య మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది. ఫైనల్లో తాన్య 15-10, 15-8తో కనాయి సకాయి (జపాన్)ను ఓడించి ట్రోఫీ అందకుంది. 21 ఏళ్ల తాన్యకు ఇది కెరీర్‌లో నాలుగో ఇంటర్నేషనల్ సిరీస్ టైటిల్.

మ్యాక్స్‌వెల్ మెరుపుల్

మూడో టీ20లో సఫారీలపై ఆసీస్ గెలుపు

2-1తో సిరీస్ కైవసం



కెయిన్స్: నరాలు తెగే ఉత్కంఠ మధ్య మ్యాక్స్‌వెల్ (36 బంతుల్లో 62 నాటౌట్) అర్ధ శతకంతో మెరవడంతో.. దక్షిణాఫ్రికాతో మూడో టీ20లో ఆస్ట్రేలియా 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడు టీ20ల సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకొంది. చివరి రెండు బంతుల్లో ఆసీస్ గెలుపునకు 4 పరుగులు కావాల్సి ఉండగా.. ఎన్‌గిడి బౌలింగ్‌లో మ్యాక్సీ రివర్స్ స్వీప్ బౌండ్రీతో జట్టుకు థ్రిల్లింగ్ విక్టరీని అందించాడు. శనివారం జరిగిన సిరీస్ నిర్ణాయక మ్యాచ్‌లో తొలుత దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 172/7 స్కోరు చేసింది. డివాల్డ్ బ్రెవిస్ (53), డుస్సెన్ (38 నాటౌట్) రాణించారు. నాథన్ ఎల్లీస్ 3 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో ఆసీస్ 19.5 ఓవర్లలో 8 వికెట్లకు 173 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ మార్ష్ (54) హాఫ్ సెంచరీ సాధించాడు. కార్బిన్ బాష్‌కు 3 వికెట్లు దక్కాయి. ఆసీస్‌కు ఇది వరుసగా ఏడో ద్వైపాక్షిక టీ20 సిరీస్ విజయం కావడం విశేషం.

ఫిట్‌నెస్ టెస్ట్‌లో సూర్య పాసయ్యాడు



బెంగళూరు: ఆసియాకప్ టీ20 టోర్నీకి ముందు టీమిండియాకు శుభవార్త. గాయం నుంచి కోలుకున్న కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌నెస్ టెస్టులోనూ పాసయ్యాడు. జూన్‌లో హెర్నియా సర్జరీ తర్వాత అతను సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సీ పునరావాస శిబిరంలో చేరాడు. ఇటీవలే పూర్తి స్థాయిలో కోలుకున్న సూర్య బ్యాటింగ్ ప్రాక్టీస్ కూడా ఆరంభించాడు. ఇక తాజా ఫలితంతో అతను ఆసియాకప్ బరిలో దిగడం ఖాయమైంది. అలాగే ఈనెల 19న ఆసియాకప్ జట్టు ఎంపికలో పాల్గొనేందుకు సూర్య ముంబైకి వెళ్లనునున్నట్టు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

అండర్ 19 వరల్డ్‌కప్‌లో యూఎస్ఏ

రైడల్ (జార్జియా): వచ్చే ఏడాది జరిగే అండర్-19 పురుషుల వరల్డ్‌కప్‌లో చివరి బెర్త్‌ను యూఎస్ఏ జట్టు దక్కించుకుంది. జింబాబ్వే-నమీబియా ఆతిథ్యమిచ్చే ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయి. అమెరికన్ క్వాలిఫయర్స్‌లో భాగంగా కెనడా, బెర్ముడా, అర్జెంటీనాలపై గెలిచిన యూఎస్ మరో మ్యాచ్ ఉండగానే మెగా టోర్నీకి అర్హత సాధించింది.

ఆసీస్ క్రికెట్ దిగ్గజం బాబ్ సింప్సన్ ఇకలేరు



సిడ్నీ: ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ బాబ్ సింప్సన్ (89) అనారోగ్యంతో మృతి చెందారు. జట్టు కెప్టెన్‌గానే కాకుండా ఆసీస్ తొలి కోచ్‌గా సింప్సన్ పని చేశారు. 1957-1978 మధ్య కాలంలో 62 టెస్టులు ఆడిన సింప్సన్ 4,869 రన్స్ సాధించారు. ఇందులో 10 సెంచరీలు ఉన్నాయి. లెగ్ స్పిన్నర్ కూడా అయిన ఆయన 71 వికెట్లు పడగొట్టారు. ఇక, వన్డేల్లో మాత్రం రెండు మ్యాచ్‌లే ఆడారు. సింప్సన్ 60వ దశకంలో అద్భుత స్లిప్ ఫీల్డర్‌గా పేరుతెచ్చుకున్నారు. అలెన్ బోర్డర్, మార్క్ టేలర్ కెప్టెన్లుగా ఉన్నప్పుడు సింప్సన్ కోచ్‌గా వ్యవహరించి జట్టును ఉన్నత స్థితిలో నిలిపారు. సింప్సన్ తొలిసారిగా 1968లో ఆటకు వీడ్కోలు పలికారు. కానీ, మరో తొమ్మిదేళ్ల తర్వాత 41 ఏళ్ల వయస్సులో కెప్టెన్‌గా పునరాగమనం చేసి ఏడాది పాటు జట్టుకు ఆడారు.

చాంపియన్ అరోనియన్

గుకేష్‌కు ఆరో స్థానం


విజయానంతరం భార్యతో అరోనియన్

సెయింట్ లూయిస్ (యూఎస్ఏ): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరిగిన సెయింట్ లూయిస్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో ప్రపంచ చాంపియన్ గుకేష్ (18 పాయింట్లు) ఆరో స్థానంలో నిలిచాడు. ఇక..అమెరికన్ గ్రాండ్ మాస్టర్ లెవాన్ అరోనియన్ (24.5 పాయింట్లు) టోర్నీ విజేతగా నిలిచాడు. అమెరికాకే చెందిన కరువానా (21.5)కు రెండో స్థానం దక్కింది. చివరి ఐదు గేమ్‌లలో మూడింటిని డ్రా చేసిన గుకేష్ రెండు గేమ్‌లలో ఓడాడు. దాంతో మొత్తం 18.5 పాయింట్లతో లీమ్ లే (వియత్నాం)తో కలిసి ఆరో స్థానాన్ని పంచుకున్నాడు.

ఛెత్రికి దక్కని చోటు



కాఫా నేషన్స్ కప్‌నకు భారత ప్రాబబుల్స్

న్యూఢిల్లీ: కాఫా నేషన్స్ కప్ కోసం భారత ఫుట్‌బాల్ కొత్త కోచ్ ఖాలిద్ జమీల్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఈ టోర్నీ కోసం ప్రకటించిన 35 మంది ప్రాబబుల్స్‌లో దిగ్గజ ఫుట్‌బాలర్ సునీల్ ఛెత్రికి చోటు దక్కలేదు. ఈ విషయమై అటు భారత ఫుట్‌బాల్ సమాఖ్య, కోచ్ నుంచి ఎలాంటి వివరణ రాకపోవడం గమనార్హం. ఆగస్టు 29 నుంచి తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌లలో ఈ టోర్నీ జరుగుతుంది. భారత్‌తో పాటు తజకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, ఇరాన్ టోర్నీలో ఆడుతున్నాయి. 40 ఏళ్ల ఛెత్రి గత జూన్‌లోనే ఆటకు వీడ్కోలు పలికాడు. అయితే అప్పటి కోచ్ మార్క్వెజ్ వినతి మేరకు ఈ మార్చిలో ఆసియాకప్ క్వాలిఫయర్స్‌లో ఆడాడు. కానీ తాజా పరిస్థితుల నేపథ్యంలో ఛెత్రి కెరీర్ ఇక ముగిసినట్టే.

పాక్ క్రికెటర్ల జీతాల్లో కోత!

కరాచీ: పాకిస్థాన్ క్రికెట్ జట్టు కొంతకాలంగా వరుస పరాజయాలను ఎదుర్కొంటోంది. ఈనేపథ్యంలో పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కఠిన నిర్ణయం తీసుకోబోతున్నట్టు కథనాలు వినిపిస్తున్నాయి. తమ సెంట్రల్ కాంట్రాక్ట్‌లో ఉన్న బాబర్ ఆజమ్, రిజ్వాన్ తదితర ఆటగాళ్ల జీతాల్లో కోత విధించబోతున్నారు. అలాగే ఐసీసీ నుంచి బోర్డుకు దక్కే ఆదాయం నుంచి ప్రస్తుతం ఆటగాళ్లకు 3 శాతం మొత్తాన్ని ఇస్తున్నారు. ఇకముందు ఈ వెసులుబాటును తొలగించనున్నట్టు సమాచారం.

ఏసీఏలోకి మళ్లీ చిన్ని, సానా

అధ్యక్ష, కార్యదర్శులుగా ఏకగ్రీవ ఎన్నిక

కొలువుదీరిన నూతన కార్యవర్గం

తాడేపల్లి (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడిగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శిగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని విజయవాడ క్లబ్‌లో ఏసీఏ నూతన కార్యవర్గాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ప్రకటించారు. చిన్ని, సతీష్‌తో పాటు మిగిలిన కార్యవర్గ సభ్యులకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను రమేష్‌కుమార్ అందజేశారు. ఉపాధ్యక్ష పదవి ఎన్నికపై కొన్ని అభ్యంతరాలు రావడంతో దానిపై తుది నిర్ణయం త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. కోశాధికారిగా దండమూడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా విజయకుమార్, కౌన్సిలర్‌గా దండు గౌర్ విష్ణుతేజ్ కూడా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

విహారి ఆల్‌రౌండ్ షో

ఏపీఎల్‌లో లయన్స్‌పై రాయల్స్ విజయం


విహారి

విశాఖపట్నం-స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో కెప్టెన్ హనుమ విహారి (62 నాటౌట్, 2/32) ఆల్‌రౌండ్ షో ప్రదర్శించడంతో అమరావతి రాయల్స్ 7 వికెట్లతో సింహాద్రి వైజాగ్ లయన్స్‌పై గెలిచింది. తొలుత లయన్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 139 పరుగులు చేసింది. వీరారెడ్డి (41), రోషన్ (30) మినహా ఎవరూ రాణించ లేదు. సందీప్ 3, విహారి, అయ్యప్ప, సంతోష్ తలా 2 వికెట్లు తీశారు. ఛేదనలో రాయల్స్ 15 ఓవర్లలో 140/3 స్కోరు చేసి నెగ్గింది. విహారికి తోడు ప్రణీత్ (44), ప్రసాద్ (21 నాటౌట్) అదరగొట్టారు. ఇక, వర్షం కారణంగా ఏడు ఓవర్లకు కుదించిన రెండో మ్యాచ్‌లో తుంగభద్ర వారియర్స్ 10 వికెట్ల తేడాతో కాకినాడ కింగ్స్‌ను ఓడించింది.

ఒకరికి గాయమైతే మరొకరు ఆడొచ్చు

బీసీసీఐ కీలక నిర్ణయం

ఆటగాడికి సబ్‌స్టిట్యూట్ నిబంధన

ఈ దేశవాళీ సీజన్‌లో అమలు



న్యూఢిల్లీ: ఈ దేశవాళీ సీజన్ (2025-26) 'ప్లేయింగ్ కండీషన్స్'కు సంబంధించి బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో కీపర్ రిషబ్ పంత్ తీవ్రంగా గాయపడిన నేపథ్యంలో ఎదురైన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని..తీవ్రంగా గాయపడిన ఆటగాడి స్థానంలో మరో క్రికెటర్‌ను అనుమతించే విషయంలో నూతన నిబంధనను వెలువరించింది. 'ఏదైనా మ్యాచ్‌లో ఆటగాడు తీవ్రంగా గాయపడితే అతడికి బదులు మరో ఆటగాడిని అనుమతిస్తాం' అని బీసీసీఐ శనివారం ప్రకటించింది. ఈమేరకు 'ఆట నిబంధనల'లో మార్పు చేసినట్టు తెలిపింది. రంజీట్రోఫీ, దులీప్ ట్రోఫీ, సీకే నాయుడు అండర్-19 ట్రోఫీ టోర్నమెంట్లకు కొత్త నిబంధన వర్తిస్తుంది. అయితే ఆ క్రికెటర్ సదరు మ్యాచ్‌కు మైదానంలో ఉన్న సమయంలో గాయపడినప్పుడే సబ్‌స్టిట్యూట్ ఆటగాడిని అనుమతిస్తారు. ఫ్రాక్చర్ లేదా శరీరంపై లోతైన గాయం అయినప్పుడే ఈ నిబంధన అమలవుతుంది. భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య ఇటీవల ముగిసిన అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ సిరీస్ నాలుగు, ఐదు టెస్టుల సమయంలో కీలక ఆటగాళ్ల గాయంతో రెండు జట్లు సమస్యలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. నాలుగో టెస్టులో భారత్ కీపర్ పంత్ పాదానికి, ఐదో టెస్టులో ఇంగ్లండ్ పేసర్ క్రిస్ వోక్స్ భుజానికి ఫ్రాక్చర్ అయ్యింది. వీరిద్దరి గాయం రెండు జట్లపై పెద్ద ప్రభావం చూపింది. కాగా..కంకషన్ సమయంలో సబ్‌స్టిట్యూట్ ఆటగాడిని అనుమతించే విధానం క్రికెట్‌లో ఎప్పటినుంచో ఉంది. కానీ ఇలా తీవ్రంగా గాయపడిన సందర్భంలో సబ్‌స్టిట్యూట్‌ను అనుమతించే నిబంధన మాత్రం అంతర్జాతీయ క్రికెట్‌లో లేదు.

అలా చర్చ మొదలై..

ఇటీవల ఇంగ్లండ్, భారత్ టెస్ట్ సిరీస్‌లో పంత్, వోక్స్ ఉదంతాల దరిమిలా.. తీవ్రంగా గాయపడిన ఆటగాడికి బదులు మరో క్రికెటర్‌ను అనుమతించాలనే చర్చ కూడా జరిగింది. ఆ చర్చను టీమిండియా కోచ్ గంభీర్ స్వాగతించాడు. 'ఒక ఆటగాడు తీవ్రంగా గాయపడ్డాడని అంపైర్లు, రెఫరీ భావించినప్పుడు అతడి స్థానంలో మరొకరిని అనుమతించాలి. లేదంటే సదరు జట్టును శిక్షించినట్టే. హోరాహోరీగా సాగే మ్యాచ్‌లో 11 మంది జట్టుతో 10 మంది సభ్యులు గల టీమ్ తలపడడం సబబేనా' అని గంభీర్ ప్రశ్నించాడు. 'ఒక ఆటగాడికి బదులు మరో క్రికెటర్‌ను అనుమతించడంలో తప్పులేదు' అని గౌతమ్ స్పష్టంజేశాడు. కానీ గంభీర్ అభిప్రాయంతో ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ విభేదించాడు. 'గాయపడిన ఆటగాడి స్థానంలో సబ్‌స్టిట్యూట్ అనే విషయంపై చర్చే అసంబద్ధం. గాయాలనేవి క్రికెట్‌లో భాగం. కంకషన్ అంటారా..క్రికెటర్ క్షేమం రీత్యా ఆ నిబంధన ఓకే. కానీ గాయపడిన ఆటగాడికి సబ్‌స్టిట్యూట్ అంశంలో లొసుగులుంటాయి' అని వ్యాఖ్యానించాడు.



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

దేశం కోసం పుట్టిన సంస్థ ఆరెస్సెస్

» పాక్, చైనా కోసం మాట్లాడే పార్టీ కాదు: రాంచందర్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం పుట్టిన సంస్థ ఆరెస్సెస్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు చెప్పారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి, ప్రధాని నరేంద్రమోదీ వంటి గొప్ప నేతలను తీర్చిదిద్దిన ఘనత ఆరెస్సెస్‌దేనన్నారు. 'మీ మాదిరిగా చైనా, పాకిస్థాన్ ప్రయోజనాల కోసం మాట్లాడే రాజకీయ పార్టీ కాదు' అని కాంగ్రెస్ పార్టీపై ఆయన పరోక్ష విమర్శలు గుప్పించారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ దేశంలో కొన్ని పార్టీలు ఆరెస్సెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అబద్ధపు ప్రచారంతో ప్రజలను సీఎం రేవంత్ రెడ్డి మభ్య పెడుతున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పేదలకు 3500 ఇళ్లు కడతామని ప్రకటించిన కాంగ్రెస్ సర్కారు.. 19 నెలలు గడిచినా ఒక్క ఇల్లు కూడా కట్టించి ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు.

మేడిగడ్డ బ్యారేజీని బాంబులతో పేల్చారు

» కేసీఆర్‌ను గద్దె దించడానికి కాంగ్రెస్, బీజేపీ కలిసి చేసిన కుట్ర

» బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కేసీఆర్‌ను గద్దె దించడానికి మేడిగడ్డ బ్యారేజీని బాంబులతో పేల్చారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి చేసిన ఈ కుట్రపై సిట్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మట్టి, ఇసుక కుంగడం వల్ల ప్రమాదం జరిగితే స్తంభాలకు పగుళ్ల రావని, కానీ మేడిగడ్డ వద్ద వచ్చాయని ప్రవీణ్ కుమార్ అన్నారు. జెలిటిన్ స్టిక్స్, డిటోనేటర్లు వంటి పేలుడు పదార్థాలు వాడితేనే ఇలాంటివి జరుగుతాయని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారని తెలిపారు. 2023 అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ వద్ద భారీ పేలుడు శబ్దాలు వచ్చి రెండు కిలోమీటర్ల మేర ధ్వని వినిపించిందని రవికాంత్ అనే ఇంజనీర్ ఫిర్యాదు చేయగా మహదేవ్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారని ప్రవీణ్ చెప్పారు. అసాంఘిక శక్తులు బ్యారేజీని కూల్చడానికి కుట్ర చేసినట్టు సదరు ఇంజనీర్ ఫిర్యాదులో పేర్కొన్నా.. పోలీసులు పట్టించుకోలేదని, కేసు రెండేళ్లుగా పెండింగ్‌లోనే ఉందని వాపోయారు. ఈ కేసును విచారించి, నిజానిజాలు తేల్చాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.

అసాధ్య హామీలను నెరవేర్చలేమని.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చెప్పాలి: కూనంనేని

తాండూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముంచిందని సీపీఐ ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. నిధులు లేక ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోతున్నందున.. సాధ్యం కాని వాగ్దానాలను నెరవేర్చలేమని కాంగ్రెస్ సర్కారు ప్రజలకు వివరించాలని అన్నారు. వాస్తవాన్ని ప్రజలకు తెలియజేయడంలో తప్పులేదని అన్నారు. తాండూరులో కూనంనేని విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో సీపీఐ పొత్తు ఉన్నందున.. ప్రజా సమస్యలపై సున్నితంగా డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

రేవంత్‌ది భూస్వామ్య మనస్తత్వం: దాసోజు

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రేవంత్ ది భూస్వామ్య మనస్తత్వమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ విమర్శించారు. భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచే ఆలోచనలో సీఎం ఉన్నారని, అదే జరిగితే నిర్మాణ రంగాన్ని ఎవరూ కాపాడలేరని అన్నారు. రేవంత్‌కు కామన్ సెన్స్ లేదని, క్రూడ్ సెన్స్ ఉందని దుయ్యబట్టారు. చావుకు, పెళ్లికి మంత్రం ఒక్కటే అన్నట్లుగా రేవంత్ తీరు ఉందని ఎద్దేవా చేశారు. గోల్కొండలో జెండావందనం అనంతరం ఆయన పసలేని ప్రసంగం చేశారని విమర్శించారు. ఎంతసేపూ కేసీఆర్‌ను తిట్టడం, చంద్రబాబును పొగడటం తప్ప రేవంత్‌కు ఏదీ చేతకాదని అన్నారు. రేవంత్, బీజేపీ ఆడిన ఆటలో తాను, సత్యనారాయణే కాకుండా కోదండరామ్ కూడా బలి పశువు అయ్యారని అన్నారు. రాజ్యాంగం గెలవాలనేదే తమ తాపత్రయమని, సెప్టెంబర్ 17న సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు చారిత్రాత్మకం అవుతుందని శ్రవణ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆపరేషన్ కగార్ ఎందుకు ఎత్తేయాలి?: సంజయ్



బగత్‌నగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): "గతంలో నక్సలైట్లతో చర్చలు జరిపిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏం సాధించింది? ఆపరేషన్ కగార్‌ను ఆపి నక్సలైట్లతో చర్చలు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడటం హాస్యాస్పదం. ఆపరేషన్ కగార్‌ను ఎందుకు ఎత్తివేయాలి" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. కరీంనగర్‌లో శనివారం ఏబీవీపీ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నక్సల్స్ నరమేధం-మేధోమథనం' అన్న అంశంపై చర్చలో సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికారంలో ఉన్నంత కాలం నక్సలైట్లపై నిషేధం విధించిన కేసీఆర్ అధికారం పోగానే చర్చలంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. నక్సలైట్ల సమస్య సామాజిక కోణంగా చూడాలని పౌర హక్కులు, మానవ హక్కుల సంఘం నేతలు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. నక్సలైట్ల చేతిలో వేలాది మంది అమాయక ప్రజలు చనిపోయినప్పుడు సామాజిక కోణం గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. నక్సల్స్ దురాగతాలవల్ల దాదాపు 50 వేల మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 9 వేల మంది పోలీసులు నక్సల్స్ తూటాలకు బలయ్యారన్నారు. ఆపరేషన్ కగార్‌ను ఆపే ప్రసక్తే లేదని, నక్సలైట్లను ఏరిపారేసే కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించి 'నక్సల్ ముక్త్‌భారత్'గా చేయడమే తమ ధ్యేయమని ఆయన ప్రకటించారు.

బీజేపీ రాష్ట్ర కమిటీపై తర్జనభర్జన

» అమిత్‌షా పరిశీలన తర్వాతే తుది నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా రాంచర్‌రావు నియామకమై నెల రోజులు గడుస్తున్నా.. రాష్ట్ర కమిటీ ఏర్పాటుపై తర్జన భర్జనలు ఇంకా సాగుతూనే ఉన్నాయి. పార్టీ అగ్ర నేతల ఆదేశాల మేరకు ఒక్కో పోస్టుకు మూడు నుంచి ఆరు పేర్లను సూచిస్తూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్‌కు రాంచందర్‌రావు ఓ జాబితాను సమర్పించినట్లు తెలిసింది. అయితే, తమను సంప్రదించకుండానే ఆ జాబితాను రూపొందించారంటూ ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు, డీకే అరుణ, అర్వింద్ తదితరులు ఫిర్యాదు చేయడంతో.. నియామక ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పాత, కొత్త అన్న తేడా లేకుండా అందరినీ కలుపుకొని పోయే వారికి పదవులు ఇవ్వాలని, అన్నివర్గాలకు ప్రాతినిధ్యం దక్కేలా చూడాలని పార్టీ అగ్రనేతలు భావిస్తున్నట్లు తెలిసింది. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తోపాటు ఇతర నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. జాబితాకు సంబంధించి పార్టీ ఎంపీలతో అమిత్‌షా చర్చించనున్నారని, ఆయా ప్రతిపాదనలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వచ్చే వారం రాంచందర్‌రావు ఢిల్లీ వచ్చిన తర్వాత జాబితా ఖరారయ్యే అవకాశాలున్నట్లు చెబుతున్నాయి. రాష్ట్ర కమిటీలో ముగ్గురు లేదా నలుగురు ప్రధాన కార్యదర్శులు, ఆరుగురు లేదా ఎనిమిది మంది ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారి, మీడియా ఇన్‌చార్జి, ఐటీ ఇన్‌చార్జి ఉండే అవకాశం ఉంది.



ఆదిలాబాద్ జిల్లా భాగ్యనగర్ కాలనీలోకి చేరిన వరద నీరు



మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం సిర్సా వద్ద నీట మునిగిన పత్తి చేన్లు

విడవని వాన!

(మొదటిపేజీ తరువాయి)

జీఎస్ ఎస్టేట్, కృష్ణానగర్‌లలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను చేపట్టాయి. చాలా గ్రామాలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 10 వేల ఎకరాల్లో పంటలు మునిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. నిజామాబాద్, మంచిర్యాల, కామారెడ్డి, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లోనూ భారీ వర్షం పడింది. మంచిర్యాలలోని రాళ్లవాగు ఉప్పొంగి ప్రవహించింది. కామారెడ్డి జిల్లాలో చాలా చోట్ల వరదల తాకిడికి రోడ్లు దెబ్బతిన్నాయి. రామారెడ్డి మండలంలో కన్నాపూర్ వద్ద ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిపేశారు. జుక్కల్ నియోజక వర్గంలో పంట పొలాలు నీట మునిగాయి. ఆసిఫాబాద్‌లో పైకాజీనగర్, చెక్‌పోస్టు కాలనీలను వరద ముంచెత్తింది. చింతలమానేపల్లి, కెరమెరి మండలాల్లో లోలెవల్ వంతెనలు ఉప్పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్‌తో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారు జాము వరకు పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో అత్యధికంగా 21.76 సెంటీమీటర్ల వర్షం పడింది. ములుగు, వరంగల్, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు పడగా.. హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో మోస్తరు వాన పడింది. బయ్యారం మండలంలో జిన్నెల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. భూపాలపల్లి మండల పరిధిలో ఉన్న మోరంచవాగు నీటిమట్టం పెరిగి బ్రిడ్జి అంచుకు నీరు చేరింది. మేడారం వెళ్లేదారిలో పెద్దవాగు పొంగిపొర్లింది. భూపాలపల్లి జిల్లాలోని సింగరేణి ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఉత్పత్తికి ఆటకం ఏర్పడింది. మంజీరా నీటి ప్రవాహ తాకిడికి మెదక్ జిల్లాలో ఏడుపాయల వన దుర్గామాత ఆలయాన్ని మూసివేశారు. ఇక మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం ఏడుబావుల జలపాతంలో ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం జెన్నారం గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్ (23) గల్లంతయ్యాడు. నిర్మల్ జిల్లా కడెం మండలం కన్నాపూర్‌కు చెందిన తిప్పారెడ్డి వరద ఉధృతిలో కొట్టుకుపోయాడు. కడెం ప్రాజెక్టు దిగువన నీటిలో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతయ్యాడు.



ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లిలో కూలిన ఇల్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలకు చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఖమ్మం జిల్లాలో మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అక్కడి జనాన్ని పునరావాస కేంద్రాలకు పంపేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కారేపల్లి మండలంలో బుగ్గవాగు, ఏన్కూరు-కొణిజర్ల మండలంలో పగిడేరు వాగు, నిమ్మవాగు, తల్లాడ మండలంలో గంగదేవిపాడు వాగు పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. కొత్తగూడెం జిల్లాలో చెరువులు పొంగి పలు చోట్ల వరి, పత్తి పంటలు నీటమునిగాయి. జూలూరుపాడు మండలంలో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తగూడెం జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఓ ప్రకటనలో సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం స్వల్పంగా పెరిగి 29.5 అడుగులకు చేరింది.

నేడు అత్యంత భారీ వర్షాలు

రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఆదివారం భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం కూడా కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదివారం రెడ్, సోమ, మంగళవారాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని, వాటికి రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే ఆదిలాబాద్, జనగామ, భూపాలపల్లి, ఖమ్మం, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని, ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మిగిలిన జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

మేడ్చల్ హైవేపై వరద నీటితో ట్రాఫిక్ జామ్

మేడ్చల్ టౌన్ : భారీ వర్షాల కారణంగా మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారిపై శనివారం వరద నీరు చేరి వాహనాల రాక పోకలకు ఆటంకంగా మారింది. కిలోమీటర్ల పొడవున వాహనాలు రహదారిపై నిలిచిపోయి అటు పోలీసులకు, ఇటు జాతీయ రహదారి అధికారులకు తలనొప్పిగా మారింది. దీంతో శనివారం సాయంత్రం స్థానిక మున్సిపల్ అధికారులతో కలిసి వరద నీటి ప్రవాహాన్ని మళ్లించే పని చేపట్టారు. అదే సమయంలో మెదక్ నుంచి హైదరాబాద్ వైపు కారులో వెళ్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ కారు ఈ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. ఆయన కారు దిగి చూడగా పోలీసులు, మున్సిపల్ సిబ్బంది వరద నీటిని తొలగించే పనిలో కనిపించారు. కమిషనర్ వారి దగ్గరకు వెళ్లి విషయం తెలుసుకున్నారు. ఏజీఎస్ వెంచర్ వారు నిర్మించిన ప్రహరీ కారణంగా వరద నీరు రోడ్డుపై నిలుస్తున్నట్లు అధికారులు కమిషనర్‌కు తెలిపారు. అనంతరం అధికారులు జేసీబీతో వెంచర్ గోడ కింద భాగాన్ని తొలగించి వరద నీరు వెంచర్ లోపలికి వెళ్లేలా చేశారు.



నర్సంపేట డివిజన్ ఖానాపురం మండలంలోని మత్తడి పోస్తున్న పాకాల సరస్సు



ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తీగలబంజర వద్ద రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న పగిడేరు వాగు

రాజగోపాల్‌రెడ్డి వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుంది

బీసీ రిజర్వేషన్ల విషయంలో వెనక్కి తగ్గం

మార్వాడీలను వెళ్లగొట్టే హక్కు ఎవరికీ లేదు

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యలు



హైదరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పరిశీలించాల్సిందిగా క్రమశిక్షణ కమిటీకి సిఫారసు చేసినట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై పరిశీలించమని క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి చెప్పామన్నారు. మంత్రి పదవి, ఇతర విషయాలపై ఎందుకు, ఎవరిని ఉద్దేశించి ఆ వాఖ్యలు చేశారో తెలుసుకుంటామని చెప్పారు. ఇక మార్వాడీలు గో బ్యాక్ అంటూ ఇటీవల వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. మార్వాడీలు మనలో ఒకరని, వారిని వెళ్లగొట్టే హక్కు ఎవరికీ లేదని ఆయన స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ వెనక్కి తగ్గే ప్రసక్తేలేదని, దీనిపై త్వరలోనే స్పష్టత వస్తుందని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. మరోవైపు త్వరలో సీఎం రేవంత్‌రెడ్డితో అసంఘటిత కార్మికుల సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల సమావేశంలో మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు కేకేసీ నేషనల్ ఛైర్మన్ ఉదిత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం కాఫర్ డ్యామ్ కొట్టుకుపోయినా కనిపించడం లేదా?: కేటీఆర్

"పోలవరంలో కాఫర్ డ్యామ్ (ప్రాజెక్టు నిర్మాణం కోసం మట్టితో ఏర్పాటు చేసిన తాత్కాలిక కట్టడం) రెండోసారి కొట్టుకుపోయినా జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ)కు కానరావడం లేదా..? కాళేశ్వరంలోని మేడిగడ్డలో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే కూలేశ్వరం అని కారుకూతలు కూసిన కాంగ్రెస్, బీజేపీ నేతలకు పోలవరంను కూలవరం అనే దమ్ము, ధైర్యం ఉందా...?" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణకు వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా..? అంటూ శనివారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల వేళ అత్యంత అనుమానాస్పదంగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లపై కేవలం 24 గంటల్లోపే ఎన్‌డీఎస్‌ఏను దించి.. బీఆర్ఎస్‌పై బురదజల్లిన బీజేపీ నేతలు.. కళ్లముందు రెండోసారి కొట్టుకుపోయిన పోలవరం కాఫర్ డ్యామ్‌పై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. 2020లో పోలవరం డయాఫ్రమ్ వాల్ రెండేళ్లకు కొట్టుకుపోయినా ఇప్పటికీ ఉలుకు పలుకు లేదని, రెండుసార్లు కాఫర్ డ్యామ్ గోదావరి పాలైనా.. తెలంగాణలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి 8 మంది చనిపోయినా ఎన్‌డీఎస్ఏలో స్పందన లేదన్నారు.

భారీ వర్షాలున్నాయ్.. జాగ్రత్త!


» అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలి

» లోతట్టు ప్రాంతాల ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాలి

» సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టం చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ సూచనల మేరకు సీఎం శనివారం ఉదయం ఉన్నతాధికారులతో మాట్లాడారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించామని, వారు కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడతారని తెలిపారు. జిల్లా అధికారులు లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలని పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని సూచించారు. వరద నీరు నిలిచి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. రెవెన్యూ, విద్యుత్తు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పురపాలక, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో సాగాలని సూచించారు. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ శాఖలోని సిబ్బందికి సెలవులు రద్దు చేయాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు.



ప్రాజెక్టులకు జోరుగా వరద!

» గోదావరిలో కడెం ప్రాజెక్టుకు 2 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

» కృష్ణాలో సాగర్‌కు 1.99 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పరీవాహక ప్రాంతాల్లో వర్షాలతో గోదావరి, కృష్ణా ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. ఎగువ గోదావరి ప్రాజెక్టులు జలకళతో ఉట్టిపడుతున్నాయి. శనివారం సింగూరు ప్రాజెక్టుకు 31,421 క్యూసెక్కుల వరద రాగా.. 43 వేల క్యూసెక్కులకు దిగువకు వదిలిపెట్టారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు 37 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రికార్డయింది. మరో కీలక ప్రాజెక్టు శ్రీరాంసాగర్‌కు 1.04 లక్షల క్యూసెక్కుల వరద రాగా, 4,952 క్యూసెక్కులను విడిచిపెట్టారు. కడెం ప్రాజెక్టుకు 2 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. అంతేస్థాయిలో కిందకు విడిచిపెడుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 48,046 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 12,986 క్యూసెక్కులను దిగువకు వదిలారు. అప్పర్ మానేరుకు 925 క్యూసెక్కులు, మిడ్ మానేరుకు 12 వేల క్యూసెక్కులు, లోయర్ మానేరుకు 682 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రికార్డయింది. ఇక లోయర్ గోదావరిలో ప్రాణహితపై ఉన్న మేడిగడ్డ బ్యారేజీకి 3.73 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. వచ్చింది వచ్చినట్లే దిగువకు వదిలిపెట్టారు. సమ్మక్కసాగర్(తుపాకులగూడెం) బ్యారేజీకి 3.45 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 3.84 లక్షల క్యూసెక్కులను వదిలిపెట్టారు. సీతమ్మసాగర్ (దుమ్ముగూడెం)కు 1.69 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఔట్‌ఫ్లో 1.69 లక్షల క్యూసెక్కులుగా ఉంది. ఇక కృష్ణాబేసిన్‌లో ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 80 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. అంతేస్థాయిలో కిందికి వదిలారు. నారాయణపూర్‌కు 50 వేల క్యూసెక్కుల వరద రాగా.. 49,500 క్యూసెక్కులను వదిలారు. జూరాల ప్రాజెక్టుకు 1.10 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 97 వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. తుంగభద్ర జలాశయానికి 40 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 55 వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 1.91 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఔట్‌ఫ్లో 2.01 లక్షల క్యూసెక్కులుగా ఉంది. ఇక నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 1.99 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 2.12 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టు 22 గేట్ల నుంచి నీటిని దిగువకు వదులుతుండటంతో చూసేందుకు పర్యాటకులు బారులు తీరుతున్నారు. ఇటు పులిచింతల ప్రాజెక్టుకు 1.90 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 1.96 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది.

భారీ వర్షాలతో దెబ్బతిన్న గ్రామీణ రహదారులు

» రూ.147.70 కోట్ల మేర నష్టం

» మంత్రి సీతక్కకు అధికారుల నివేదిక

హైదరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని గ్రామీణ రహదారులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మొత్తం 84.97 కి.మీ మేర రోడ్లు దెబ్బతిన్నాయని, నష్టం విలువ రూ.147.70 కోట్లుగా ఉందని అధికారులు మంత్రి సీతక్కకు నివేదిక సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 48 ప్రాంతాల్లో ఉపరితల రోడ్లు దెబ్బతిన్నాయని, వీటి తాత్కాలిక మరమ్మతులకు రూ.3.32 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.42.63 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఇక 77 ప్రాంతాల్లో కల్వర్టులు, లోకాజ్‌వేలు, క్రాస్ డ్రెయిన్ల నిర్మాణాలకు నష్టం వాటిల్లిందని, వీటి పునరుద్ధరణకు తాత్కాలికంగా రూ.1.55కోట్లు, శాశ్వత పనుల కోసం రూ.67.60 కోట్లు ఖర్చవుతుందని ఇంజనీర్లు అంచనా వేశారు. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా 30 ప్రాంతాల్లో రోడ్లకు గండ్లు పడ్డాయని, వాటి తాత్కాలిక పునరుద్ధరణకు రూ.1.06 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.5.45 కోట్లు ఖర్చవుతాయని నివేదికలో పేర్కొన్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 124 ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.6.02 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.141.68 కోట్లు అవసరం అవుతాయని లెక్కించారు. కాగా, భారీ వర్షాల దృష్ట్యా ప్రజల అవసరాలను గమనించి ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎమర్జెన్సీ పరిస్థితులపై తక్షణ స్పందన అవసరమని, ఏ సమస్య ఎదురైనా వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని సూచించారు. ఇందుకోసం కలెక్టర్ల వద్ద ప్రత్యేక నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు మంత్రి సీతక్క తెలిపారు.

ఆర్టీసీలో 3 వేల పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

» మొదటగా 1,500 కండక్టర్ పోస్టుల భర్తీ

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఆర్టీసీలో మూడు వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఇందులో మొదటి విడతలో భాగంగా 1,500 కండక్టర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈమేరకు పోస్టుల భర్తీకి అనుమతి కోరుతూ ఆర్టీసీ ప్రభుత్వానికి తాజాగా ప్రతిపాదనలు పంపింది. వాస్తవానికి ఆర్టీసీలో 2013నుంచి కండక్టర్ల నియామకాలు జరగలేదు. తాత్కాలికంగానే తీసుకుంటూ వచ్చారు. సంస్థలో రిటైర్మెంట్లు పెరుగుతుండడం, ఉన్నవారిపై పనిభారం పడుతున్న నేపథ్యంలో కండక్టర్ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే సంస్థలో డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర కొన్ని పోస్టులు కలిపి మొత్తం 3,035 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం గతంలోనే అనుమతి ఇచ్చింది. ఇందులో కండక్టర్ పోస్టులను తొలుత భర్తీ చేసేందుకు అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే నోటిఫికేషన్ వెలువడుతుందని అధికార వర్గాల సమాచారం.



ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉంటేనే విద్యుత్ కనెక్షన్

» విద్యుత్తు పంపిణీ సంస్థకు హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం నిర్మాణాలు పూర్తిచేసుకొని ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉంటేనే నూతన విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్పీడీసీఎల్‌కు హైకోర్టు స్పష్టంచేసింది. వినియోగదారులు తొలుత జీహెచ్‌ఎంసీ లేదా ఇతర మున్సిపాలిటీల అధికారుల నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందాలని, ఆ సర్టిఫికెట్ సమర్పించిన తర్వాతే నిబంధనల ప్రకారం నివాస గృహాలకు నూతన కనెక్షన్ ఇవ్వాలని పేర్కొంది. జీహెచ్‌ఎంసీ ఆమోదించిన ప్రణాళిక ప్రకారం నిర్మించిన స్టిల్ట్ + ఐదు అంతస్థుల భవనానికి అన్ని రకాల ఫీజులు చెల్లించినప్పటికీ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేదనే కారణంతో విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదని పేర్కొంటూ రెడ్‌హిల్స్‌కు చెందిన మొహమ్మద్ ఆరిఫ్ రిజ్వాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం.. అధికారుల నుంచి ఒకరకమైన బిల్డింగ్ ప్లాన్‌కు అనుమతి పొంది ఆ తర్వాత ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారని వ్యాఖ్యానించింది. ఆ తర్వాత బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీంలో దరఖాస్తు చేసుకుని తమ అక్రమ నిర్మాణాలను చట్టబద్ధం చేసుకోవాలని చూస్తున్నారని తెలిపింది. ఇలాంటి అక్రమ విధానాలు కొనసాగుతుంటే ఈ కోర్టు చూస్తూ నిశ్శబ్దంగా ఊరుకోదని పేర్కొంది. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉంటేనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని స్పష్టంచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

హైదరాబాద్/సిద్దిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సమాచారశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఐదుగురు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లు అవార్డులు గెలుచుకున్నారు. హైదరాబాద్ చీఫ్ ఫొటోగ్రాఫర్ రాచర్ల హరిప్రేమ్, వరంగల్ ఫొటోగ్రాఫర్ వీరగోని హరీశ్, హైదరాబాద్ ఫొటోగ్రాఫర్ అశోకుడు, నల్లొండ ఫొటోగ్రాఫర్ విజయ్ కుమార్, సిద్దిపేట ఫొటోగ్రాఫర్ బీ. బాబురావు ఈ అవార్డులు గెలుచుకున్నారు. ఈ నెల 19న హైదరాబాద్ గ్రీన్ పార్క్ హోటల్‌లో జరిగే కార్యక్రమంలో మంత్రి పొంగులేటి చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకోనున్నారు.

దేవాదాయ శాఖలో సీనియారిటీ రివ్యూకు జీఏడీ విశ్రాంత అధికారులు

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న పదోన్నతుల సమస్య పరిష్కారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. సిబ్బంది పదోన్నతులు, నియామకాలు, సీనియారిటీపై తుది నిర్ణయానికి దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్రావు అధికారులతో ఇటీవల సమీక్ష నిర్వహించారు. సొంత శాఖలో ఉన్న వారితో సీనియారిటీ ప్యానెల్ రివ్యూ చేయించడం వల్ల అభ్యంతరాలు వ్యక్తమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో... అందుకోసం సాధారణ పరిపాలనా విభాగం (జీఏడీ)లో జాయింట్ సెక్రటరీ, అసిస్టెంట్ సెక్రటరీ స్థాయిలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఇద్దరు నిపుణులను నియమించారు. వీరు 2006 నుంచి ఇప్పటి వరకు సీనియారిటీ ప్యానెల్ రివ్యూ జరిపి దేవాదాయ శాఖ కమిషనర్‌కు రెండు నెలల్లో నివేదిక అందజేయనున్నారు. ఇద్దరు నిపుణులకు దేవాదాయ శాఖ నుంచి గౌరవ భృతి చెల్లిస్తారు. కాగా దేవాదాయ శాఖలో పదోన్నతులు, నియామకాలను ఉన్నతాధికారులు ఇష్టానుసారంగా చేపడుతున్నారని ఆరోపిస్తూ కొందరు సిబ్బంది ఇదివరకు హైకోర్టును ఆశ్రయించారు. శాఖలో సీనియారిటీ రివ్యూ జరిపి పదోన్నతులు ఇవ్వాలని విచారణ అనంతరం అధికారులను కోర్టు ఆదేశించి ఏడాది దాటినా... ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదు. సిబ్బంది ఆందోళనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో దేవాదాయశాఖ మంత్రి, ముఖ్యకార్యదర్శి ఆదేశాల మేరకు డైరెక్టర్ వెంకట్రావు సమస్య పరిష్కారంపై దృష్టి సారించారు.

ఇంతకూ యూరియా వచ్చిందా? లేదా?

» రాష్ట్రం, కేంద్రానివి పొంతన లేని మాటలు: నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): 'కేంద్రం.. రాష్ట్రానికి సరిపడా యూరియా ఇచ్చామంటోంది.. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రాలేదంటోంది.. మరి మధ్యలో యూరియా ఎక్కడ పోయింది' అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. దేశంలో జై జవాన్.. జై కిసాన్ అనే నినాదాన్ని ఇచ్చిన పార్టీనే ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉండి 'నై కిసాన్- నై యూరియా' అంటోందని విమర్శించారు. యూరియా కోసం రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అష్టకష్టాల పాలు చేస్తోందని మండిపడ్డారు.

అటానమస్ కాలేజీలకు రిలీఫ్

» కోర్సు సిలబస్‌లో 20% సవరణకు జేఎన్టీయూ ఓకే

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇటీవల విడుదల చేసిన కోర్సుల అమరిక, సిలబస్‌లో స్వయంప్రతిపత్తి (అటానమస్ హోదా) కల ఇంజనీరింగ్ కాలేజీలు గరిష్ఠంగా 20 శాతం మార్పులకు అనుమతించింది. ఆయా కాలేజీల అభ్యర్థన మేరకు యూనివర్సిటీ ఈ నిర్ణయం తీసుకుంది. ఒక కళాశాల కొన్ని కోర్సుల ఉప-డొమైన్‌లో ప్రత్యేక నైపుణ్యం కలిగి ఉన్నా.. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసినా.. సంబంధిత కోర్సు ఫలితాలకనుగుణంగా సిలబస్ సవరించుకోవచ్చు. విద్యార్థులకు సమగ్ర శిక్షణకు సంస్థ బలాలు, విలువైన వనరుల వినియోగానికి వీలుగా ఆయా కాలేజీలు ఇటువంటి మార్పులు చేసుకోవచ్చునని జెఎన్‌టీయు అధికారులు తెలిపారు. సంబంధిత అటానమస్ కళాశాలల అధ్యయన మండళ్లలో యూనివర్సిటీ నామినీలుగా ఉన్న రెగ్యులర్ ఆచార్యులకు జేఎన్టీయూ మార్గదర్శకాలు విడుదల చేసింది.

ఇవి మార్గదర్శకాలు

స్వయంప్రతిపత్తి గల కళాశాలలు తమ సంస్థ కోర్సుల శీర్షికలనూ మార్చుకోవచ్చు. విశ్వవిద్యాలయం సూచించిన శీర్షికలను.. సంబంధిత సంస్థ-స్థాయి (స్టాండింగ్) కమిటీలు సిఫారసు చేసిన వాటితో భర్తీ చేయొచ్చు. కళాశాలల అధ్యాపకులకు ఒకే విధమైన పని భారం ఉండేలా కోర్సులను మార్చుకోవచ్చు. ప్రోగ్రామ్ స్పెసిఫిక్ ఔట్‌కమ్ (నిర్దిష్ట ఫలితాల)ను మరింత సమర్థవంతంగా తీర్చి దిద్దడానికి ఈ వెసులుబాటు వీలు కల్పిస్తుంది. నిబంధనల ప్రకారం చేసే ప్రతి మార్పునకు స్పష్టమైన సమర్థన, హేతుబద్ధత కనబర్చాలి. ఆయా కోర్సుల్లో ప్రతిపాదిత మార్పులను బోర్డు ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) ముందుంచి చర్చించాలి. కోర్సుల అమరిక, సిలబస్‌లో మార్పులు 20 శాతం పరిమితికి లోబడే ఉన్నాయని నిరూపణకు అంశాల వారీగా సారాంశ పట్టికను సిద్ధం చేసుకోవాలని అటానమస్ కళాశాలల ప్రిన్సిపాళ్లను జేఎన్టీయూ ఉన్నతాధికారులు ఆదేశించారు.

బీసీ రిజర్వేషన్లపై కార్యాచరణ

20 లేదా 21న.. పీఏసీ భేటీలో చర్చించాక తుది నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, దాంతో ముడిపడి ఉన్న 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం'పై ఎలా ముందుకెళ్లాలనే దానిపై త్వరలోనే అధికార కాంగ్రెస్ ఒక నిర్ణయం తీసుకోనుంది. ఇందుకోసం రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం నిర్వహించి, అందులో చర్చించి, తుది నిర్ణయం తీసుకోనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. రిజర్వేషన్లపై ఒక నిర్ణయానికి వస్తే స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశంపైనా సమావేశంలోనే చర్చించనున్నట్టు సమాచారం. ఈ మేరకు పీఏసీ సమావేశాన్ని ఈ నెల 20 లేదా 21న నిర్వహించే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. వాస్తవానికి 18వ తేదీనే క్యాబినెట్ భేటీ నిర్వహించి, ఆ తరువాత పీఏసీ సమావేశం పెట్టి ఒక నిర్ణయం తీసుకోవాలని భావించారు. కానీ రాష్ట్రంలో వారం నుంచి వానలు కురుస్తుండడం, మరో 2-3 రోజులపాటు భారీ వర్షాలు ఉండొచ్చన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో వాయిదా వేశారు. ఇక.. 22న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్తున్నారు. ఆయన తిరిగొచ్చిన తరువాత.. 23 లేదా 24న క్యాబినెట్ భేటీ ఉంటుందని అధికారికవర్గాలు అంటున్నాయి. బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికల నిర్వహణ పై ఈ సమావేశంలో ఒక నిర్ణయం తీసుకోనున్నారు. ఆ తరువాత అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన సంగతి తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీ వేదికగా ధర్నా కూడా నిర్వహించింది. అయితే, కేంద్రం నుంచి దీనిపై ఇంకా సమాధానం రాలేదు. ఈ నేపథ్యంలో ఆ బిల్లులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయనున్నట్టు సమాచారం. అలాగే రిజర్వేషన్ల అంశంపై అన్ని పార్టీల వైఖరిని కూడా ప్రభుత్వం తెలుసుకోనుంది. కాగా.. వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు ఈ నెల చివరి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలున్నట్టు సమాచారం. ఈసారి సభలో బీసీల రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్ ఇచ్చిన నివేదిక కూడా ప్రధానాంశం కానుంది. ఆ నివేదికను సభలో మొత్తం సభ్యులందరికి అందించి, దానిపై చర్చ పెట్టనున్నారు. అలాగే కాళేశ్వరం నిర్మాణ నుంచి కూలడం వరకు జరిగిన పరిణామక్రమాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ రూపంలో సభలోని సభ్యులకు వివరించే అవకాశం ఉందని కూడా తెలిసింది.

టీవీలు, పేపర్లు, వేల కోట్లు ఉన్నా..

ఉద్యమకారులేనట

(మొదటిపేజీ తరువాయి)

వేదికయ్యారు. ప్రజలకు స్ఫూర్తిని, స్వేచ్ఛను, సామాజిక న్యాయాన్ని, సమాన అవకాశాలను కల్పించేందుకు వారు సర్వం కోల్పోయి.. అండగా నిలబడ్డారు. చేగువేరా నుంచి అందెశ్రీ వరకు ఉద్యమంలో ప్రజలకు స్ఫూర్తినిచ్చారు. లక్షలాదిమందిని ఉద్యమం వైపు నడిపించారు. ఆస్తులు, అంతస్తులు కోల్పోయారు. చివరికి వారి కుటుంబాలు కూడా నిర్లక్ష్యానికి గురయ్యాయి. మరి, వీరి కుటుంబాలు ఇలా ఎందుకు నిర్లక్ష్యానికి గురయ్యాయి!? కొంతమందికి వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయన్నది నాకు అర్థం కావడం లేదు. ఈ విషయంపై అందెశ్రీనే స్పష్టత ఇవ్వాలి" అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమకారులమనే గొప్ప పదాన్ని రాజకీయ నేతలు ఆపాదించుకుంటే అది సరైనది కాదేమోనని రేవంత్ అభిప్రాయపడ్డారు. ఉద్యమమే నేపథ్యంగా రాజకీయ ప్రయోజనాన్ని ఆశించి.. దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని, పేరు బంధం, పేగు బంధం తెంచుకుని దేశానికి నాయకుడిని కావాలనే దురాశతో బయలుదేరితే ఉన్నది పోయింది.. ఉంచుకున్నదీ పోయిందనే పరిస్థితి రాష్ట్రంలో వచ్చిందని పరోక్షంగా కేసీఆర్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. కానీ, అందెశ్రీ, గద్దర్ ఏమీ ఆశించలేదని, ప్రజల స్వేచ్ఛను మాత్రమే ఆశించారని తెలిపారు.

నాకు శత్రువు కావాలన్నా స్థాయి ఉండాలి

'అధికారం వచ్చింది కదా, నిన్ను ఇబ్బంది పెట్టిన వారిని ఏమైనా చేయొచ్చు కదా' అని చాలామంది చెబుతున్నారని, కానీ, తాను ఎవరినీ శత్రువుగా చూడలేదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తాను శత్రువుగా చూడాలన్నా వారికి ఒక స్థాయి ఉండాలని వ్యాఖ్యానించారు. తన కోపాన్ని ప్రదర్శించడానికి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని కాలేదన్నారు. గ్రామీణ ప్రాంతంలో మధ్య తరగతి కుటుంబంలో



పుట్టి, పెరిగిన తనకు ప్రజలు గొప్ప అవకాశాన్ని ఇచ్చారని, దీనిని 4 కోట్ల ప్రజల సంక్షేమం, అభివృద్ధి.. ఈ ప్రాంత అభ్యున్నతి కోసం వినియోగించకుండా.. ఎవరిపైనో కోపంతోనో, ఎవరో నచ్చలేదనో వారిపై వినియోగిస్తే తనకంటే మూర్ఖుడు వేరొకరు ఉండరన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తాను కర్మ సిద్ధాంతాన్ని ఎక్కువగా నమ్ముతానని, అందుకే, ఈ 20 నెలలుగా వారు చేసుకున్న పాపాలకు వారే పోతారని భావిస్తున్నానని చెప్పారు. వారి దుఃఖానికి తన గెలుపు చాలని.. తాను సీఎం కుర్చీలో కూర్చొని

రేవంత్.. అన్నీ తానై రాష్ట్రాన్ని నడుపుతున్నారు: అందెశ్రీ

సీఎం రేవంత్ రాష్ట్ర ప్రజల కలల సాకార దీప్తిగా, అన్నీ తానై రాష్ట్రాన్ని నడుపుతున్నారని, ఆయన తనపై 'అన్న' వాత్సల్యాన్ని అపారంగా కురిపిస్తున్నారని అందెశ్రీ వ్యాఖ్యానించారు. 'హసిత బాష్పాలు' పుస్తకాన్ని సీఎం రేవంత్ చేతుల మీదుగా ఆవిష్కరించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కేసీఆర్‌ను గద్దె దించి ప్రపంచ విజేత అయ్యాడని రేవంత్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

సంతకం పెడుతుంటే.. అదే వారి గుండెలపై గీత గీసినట్టు ఉంటుందని వ్యాఖ్యానించారు. "నేను మీకంటే గొప్పవాడిని కాదు. పెద్దవాడిని కాదు. మీలో ఒకడిని. నాకొచ్చిన ఈ అవకాశం ఎంత కాలం నా దగ్గరుంటే అంతవరకూ పేదవారి కోసమే ఉపయోగిస్తాను. దేశం ఏర్పడి వందేళ్లు అయ్యే 2047 నాటికి దేశాన్ని 30ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా తీసుకెళ్లే దిశగా ప్రధాని మోదీ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అప్పటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్-2047' రూపొందించామని నీతి ఆయోగ్ సదస్సులో ప్రధాని మోదీకి తెలిపాను. అదే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. అప్పటి వరకు ప్రజా జీవితంలో క్రియాశీలంగా ఉండి.. నిరంతరం ప్రజల సమక్షంలో ఉంటూ పనిచేస్తాను" అని స్పష్టం చేశారు.

109 దేశాల సుందరీమణులతో తెలంగాణ గేయం పాడించా

"ఇటీవల రాష్ట్రంలో భారత్ సమ్మిట్, మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించాం. ఆ సమయంలో వారికి బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కమాండ్ కంట్రోల్ సెంటర్, సచివాలయాన్నే చూపించారు కదా అని కొంతమంది అన్నారు. కానీ, వారికి తెలియనిది ఏమిటంటే.. మిస్ వరల్డ్ పోటీలకు వచ్చిన 109 దేశాల సుందరీమణులతోపాటు ఆ దేశాల ప్రజలతో ఒక భవన నిర్మాణ మేస్త్రి అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ' గేయాన్ని పాడించాను. వారికి ఆ భావన, స్ఫూర్తిని ఇవ్వగలిగాను. తెలంగాణ, తెలంగాణ తల్లి ఇలా ఉంటుందని వారికి చెప్పగలిగాను. ఇది నేను సాధించిన విజయం కాదా!?" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. గతంలో సీఎంను కలవాలంటే అదొక గొప్ప సన్నివేశమని.. కానీ తమ ప్రభుత్వంలో ధర్మ గంట మాదిరిగా తాము ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని చెప్పారు. 'అంబేద్కర్ చెప్పినట్టు అద్దాల మేడలు, రంగుల గోడలు అభివృద్ధి కాదు. సంక్షేమం, అభివృద్ధి చిట్టచివరి పేదవాడికి కూడా చేరినప్పుడే నిజమైన విజయం. కానీ, చాలామంది మాత్రం అద్దాల మేడలు, రంగుల గోడలూ చూపించి.. ఇదే తెలంగాణ అభివృద్ధి, నమూనా అంటున్నారు. దానికి నేను, అందెశ్రీ వ్యతిరేకం. అందుకే రాష్ట్రంలోని ప్రతి పేదవాడూ తలెత్తుకుని ఆత్మ గౌరవంతో బతకాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నాం. 3.10 కోట్ల మంది ఆత్మ గౌరవంతో సన్న బియ్యంతో తింటున్నారు. రాష్ట్రంలో పేదలు ఆత్మ గౌరవంతో బతికేలా మా ప్రభుత్వం చేస్తోంది' అని రేవంత్ పేర్కొన్నారు.



ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్‌ను ఓదార్చుతున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి

గిరిజన, అణగారిన వర్గాల గొంతుక శిబూసోరేన్

» ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి

ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూసోరేన్ గిరిజన, అణగారిన వర్గాల పక్షాన బలమైన స్వరం వినిపించారని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. గిరిజన సమాజ ప్రయోజనాల కోసం శిబూసోరెన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఝార్ఖండ్‌లోని శిబూసోరెన్ సొంతగ్రామం రామ్‌గఢ్ జిల్లాలోని నమ్రాలో సంప్రదాయ గిరిజన ఆచారాలతో శనివారం నిర్వహించిన దిషోం గురు శ్రద్ధాంజలి కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శిబూసోరేన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం శిబూసోరెన్ కుమారుడు, ఝార్ఖండ్ ప్రస్తుత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో పాటు, ఆయన కుటుంబ సభ్యులను కలిసి సానుభూతిని తెలియజేశారు.

ధర్మవరం వాసికి 'ఉగ్ర' లింకులు!

ఐబీ, ఎన్ఐఏ సమాచారంతో ఏపీ పోలీసులు అప్రమత్తం.. ఉపా చట్టం కింద నూర్ మహమ్మద్‌పై కేసు.. అరెస్ట్

ధర్మవరం/కదిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న కారణంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన కొత్వాల్ నూర్ మహమ్మద్(45) అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతనిపై ఉపా చట్టం కింద కేసు నమోదు చేశామని ధర్మవరం ఇన్‌చార్జ్ డీఎస్పీ నర్సింగప్ప శనివారం తెలిపారు. పట్టణంలోని లోనికోటలో కొత్వాల్ నూర్ మహమ్మద్ కుటుంబం నివసిస్తోంది. మార్కెట్ వీధిలోని బిరియానీ సెంటర్‌లో వంటమనిషిగా పనిచేస్తున్నాడు. ఇతనికి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు కొన్నాళ్ల కిందటే ఐబీ, ఎన్ఐఏ గుర్తించి, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిఘా పెట్టారు. ఆధారాలు సేకరించి, నాలుగు రోజుల కిందట అదుపులోకి తీసుకున్నారు. ఉగ్రవాద సంస్థల వాట్సాప్ గ్రూప్‌లలో నూర్ మహమ్మద్ యాక్టివ్‌గా ఉన్నట్లు గుర్తించామని డీఎస్పీ తెలిపారు. అతని ఇంట్లో సోదా చేసి మొబైల్ ఫోన్, రెండు సిమ్ కార్డులు, ఉర్దూ సాహిత్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడు పలు నిషేధిత ఉగ్రవాద సంస్థల వాట్సాప్



నూర్ మహమ్మద్(ఫైల్)

గ్రూపుల్లో ఉంటూ, ముస్లిం యువతను ఉగ్రవాదం వైపు ప్రేరేపిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. నూర్ మహమ్మద్ పాతికేళ్లుగా ధర్మవరంలోని వివిధ హోటళ్లలో వంట మనిషిగా పని చేశాడు. ప్రస్తుతం సల్మాన్ బిరియానీ సెంటర్‌లో పని చేస్తున్నాడు. పదో తరగతి వరకూ కర్నూలులోని పాఠశాలలో ఉర్దూ మీడియంలో చదివాడు. చదువు మానేశాక.. ధర్మవరం తిరిగి వచ్చాడు. టీ స్టాల్ ప్రారంభించి, సాగడం లేదని మూసేశాడు. అప్పటి నుంచి హోటళ్లలో పనిచేస్తున్నాడు. అతను వంట పని చేసుకుని వెళ్లేవాడని, ఇతర విషయాలు తమకు తెలియదని సల్మాన్ బిరియానీ సెంటర్ నిర్వాహకులు తెలిపారు. ఎక్కువ సేపు ఫోన్లో మాట్లాడేవాడని, ఎవరితోనో తెలియదని చెప్పారు.

కడప సెంట్రల్ జైలుకు తరలింపు

నూర్ మహమ్మద్‌ను ధర్మవరం పోలీసులు శనివారం రాత్రి కదిరి న్యాయాధికారి పి.లోకనాథ్ ఎదుట హాజరుపరిచారు. అతడిపై బీఎన్ఎస్ సెక్షన్లు 152, 196, క్లాస్1, 196(2), ఉపా చట్టంలోని 13,38,39 సెక్షన్ల కింద కేసులు నమోదు చేయగా.. న్యాయాధికారి నిందితుడికి ఈ నెల 29వరకు రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు అతడిని భారీ బందోబస్తు మధ్య కడప జైలుకు తీసుకెళ్లారు.

మరో యువకుడూ?

ధర్మవరంలోని ఎర్రగుంటకు చెందిన ఆటో డ్రైవర్ రియాజ్ శుక్రవారం రాత్రి 'ఐ లవ్ పాకిస్థాన్' అని వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నాడు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఇతరులు పెట్టిన పోస్టును తాను షేర్ చేశానని విచారణలో రియాజ్ చెప్పాడు. దీంతో పోలీసులు మందలించి విడిచిపెట్టారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

» కార్యకర్తలకు గుర్తింపు ఇచ్చేది కాంగ్రెస్సే

» పని చేయలేని వాళ్లు తప్పుకోండి

» బూత్ కమిటీ ఇన్‌చార్జిలతో మంత్రి తుమ్మల, పొన్నం

హైదరాబాద్/వెంగళరావునగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని, ఎన్నికల కోసం ప్రత్యేకంగా నియమితులైన కార్పొరేషన్ ఛైర్మన్లు, బూత్ ఇన్‌చార్జిలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ సూచించారు. హైదరాబాద్‌లోని వెంగళరావు నగర్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ముఖ్య నేతలతో శనివారం వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ వెంగళరావునగర్ డివిజన్‌లో బూత్ కమిటీలు సక్రమంగా లేవని, స్థానికంగా ఉండి పని చేయలేని వారు.. ఇన్‌చార్జి మంత్రికి చెప్పి ఆ బాధ్యతల నుంచి తప్పుకోవాలని సూచించారు. ఉప ఎన్నికను సీఎం రేవంత్, పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంటున్నారని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధికి సీఎం రేవంత్ చేసే ప్రయత్నాలు సఫలీకృతం కావాలంటే ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధించాలన్నారు. హైదరాబాద్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, అందుకే ఇతర రాష్ట్రాల వారు సైతం ఇక్కడ నివసించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. కార్యకర్తలు, నాయకులకు సరైన గుర్తింపు ఇచ్చేది కాంగ్రెస్సేనని, పార్టీలోకి ఎవరు వచ్చి మద్దతు తెలిపినా ఆహ్వానించాలని సూచించారు. ఎవరికి ఏ అవసరం ఉన్నా సీఎంతో మాట్లాడి, పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ ఉప ఎన్నిక ప్రభావం ఇతర రాష్ట్రాల పై కూడా ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో ప్రతి రాష్ట్రం తెలంగాణను మోడల్ గా తీసుకుంటుందని తెలిపారు. తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మొద్దని చెప్పారు. నేతలంతా ఐక్యంగా పని చేయాలని, ప్రతి బూత్‌లో మంచి మెజారిటీ వచ్చేందుకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. అభ్యర్థి ఎవరైనా విజయం కోసం పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో ఎర్రగడ్డ డివిజన్ బూత్ ఇన్‌చార్జిలతో భేటీలో ఆయన మాట్లాడుతూ ఒక్కో డివిజన్‌లోని సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని, పెండింగ్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. స్వయంగా తానే పాదయాత్ర చేస్తూ డివిజన్లలో సమస్యలు తెలుసుకుంటానన్నారు.

లాంగ్‌టర్మ్ వీసాలతో హైదరాబాద్‌లోనే మకాం

తల్లికి ఇంకా పాకిస్థాన్ పౌరసత్వమే

» కొన్నేళ్లుగా తల్లి, సోదరులు, సోదరితో కలిసి ఉంటున్న వైనం

» పాక్ యువకుడి కేసు దర్యాప్తులో కీలక అంశాల గుర్తింపు

హైదరాబాద్ సిటీ/కార్వాన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రేమపేరుతో వంచించి, మతం మార్పిడి చేయించి పెళ్లి చేసుకొని మోసం చేసిన పాకిస్థాన్ యువకుడిపై కేసులో లంగర్‌హౌజ్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా పలు కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఫహాద్ అఖిల్ అనే యువకుడు తొమ్మిదేళ్ల క్రితం ఓ మహిళను ప్రేమించి, మతం మార్పిడి చేయించి పెళ్లి చేసుకున్నాడు. ఆమెను వదిలేసి మరో యువతితో సహజీవనం చేస్తుండటంతో శుక్రవారం అతన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితురాలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన లంగర్‌హౌజ్ పోలీసులు అఖిల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తులో భాగంగా ఇతను కొన్నేళ్లుగా తల్లి, సోదరులు, సోదరితో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నట్లు గుర్తించారు. లంగర్‌హౌస్‌కు చెందిన నిందితుడి తల్లి 1990లో సౌదీకి వెళ్లి అక్కడ పనిచేస్తున్న క్రమంలో పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుంది. తర్వాత భర్తతో కలిసి పాక్‌లోనే కాపురం పెట్టింది. ఆమెకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కొన్నాళ్లకు భర్త చనిపోవడంతో పిల్లలను తీసుకొని 1998లో ఆమె తిరిగివచ్చి లంగర్‌హౌస్‌లో ఉంటోంది. పెద్ద కొడుకు ఫహాద్ అఖిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా బాధితురాలితో పరిచయం ఏర్పడింది. ఆమెను మతం మార్పించి పెళ్లి చేసుకున్నాడు. కొన్నాళ్లకు ఆమెను వదిలేసి మరో యువతితో సహజీవనం చేస్తుండటంతో అఖిల్ బాగోతం బయటపడింది. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు అతని తల్లి, సోదరులు, సోదరిని విచారించారు. తల్లికి ఇప్పటికీ పాకిస్తాన్ పౌరసత్వం, పాక్ పాస్‌పోర్టు ఉన్నట్లు గుర్తించారు. పిల్లలు మాత్రం లాంగ్ టర్మ్ వీసాలతో ఇక్కడే ఉంటున్నారు. వాటిని ఏడాదికోసారి పొడిగించుకుంటూ కొన్నేళ్లుగా ఇక్కడే ఉంటున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వారిని తిరిగి పాకిస్తాన్ పంపాలా? మరేదైనా నిర్ణయం తీసుకోవాలా? అనే కోణంలో పోలీసులు సమాలోచనలు చేస్తున్నారు.

ఆలయాలపై పోలీస్ నిఘా

» ప్రముఖ ఆలయాల్లోని సీసీ కెమెరాలు పోలీస్.. కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం

» హైదరాబాద్ నుంచి ఆలయాల్లో భద్రత పర్యవేక్షణ

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో భద్రతకు సంబంధించి ఉన్నతాధికారులు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. ఆలయాల్లో నిరంతరం పోలీస్ నిఘా కొనసాగించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా.. ఇప్పటికే దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల్లో పెద్ద సంఖ్యలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అధికారులు వాటిని హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. సీసీ కెమెరాల అనుసంధానం ద్వారా ఆలయ అధికారులతోపాటు హైదరాబాద్‌లో ఉండే పోలీస్ ఉన్నతాధికారులు ఆలయాల్లో భద్రత, అనుమానితుల కదలికలు, ప్రత్యేక సందర్భాల్లో రద్దీ, క్రమబద్ధీకరణకు చేపడుతున్న చర్యలను పర్యవేక్షించనున్నారు. యాదగిరిగుట్ట, వేములవాడ, కొమురవెల్లి, కొండగట్టు, భద్రాచలం సీతారామచంద్రస్వామి, జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంతోపాటు ప్రముఖ ఆలయాల్లో నిత్యం భక్తుల రద్దీ ఉంటుంది. ఇప్పటికే యాదగిరిగుట్టకు తిరుమల తరహాలో ప్రత్యేక భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రతి అంగుళం సీసీ కెమెరా నిఘాలో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. సాయుధ బలగాలతో నిరంతరం బందోబస్తు కొనసాగిస్తున్నారు. ముందుజాగ్రత్త, భద్రతా చర్యల్లో భాగంగా ఇతర ప్రముఖ ఆలయాల్లోనూ సీసీ కెమెరాల నిఘాను పెంచారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ శాఖ పరిధిలోకి వచ్చే అన్ని ఆలయాల్లోనూ ఇప్పటికే విస్తృతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిని ఆలయంలోని ప్రత్యేక మానిటరింగ్ కేంద్రం, ఆలయ ఈవోల అధికారిక ఫోన్లకు అనుసంధానం చేశారు. ఆలయం వైపునకు వెళ్లే ప్రధాన మార్గం, పార్కింగ్, టికెట్ కౌంటర్, దర్శన ప్రదేశం, ప్రసాద వితరణ, అన్నప్రసాదం జరిగే ప్రదేశం, భక్తులు సేదతీరే ప్రాంతాల్లో ప్రత్యేకంగా సీసీ కెమెరాలు అమర్చారు. ఇక నుంచి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పోలీస్ అధికారులు ఆలయాల వద్ద ఉన్న భద్రతా ఏర్పాటును పర్యవేక్షిస్తారు. "ఆలయాల్లో సీసీ కెమెరాలు ఇప్పటికే ఏర్పాటు చేశాం. ఈవోలు సీసీ కెమెరాల ద్వారా ఆలయాల్లో భక్తుల రద్దీ, క్యూలైన్ల నిర్వహణ పరిశీలిస్తుంటారు. అవసరమైనప్పుడు విధుల్లో ఉండే సిబ్బందిని అప్రమత్తం చేస్తుంటారు. కొత్త విధానంలో ఆలయ ఫుటేజీని పోలీస్ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు" అని దేవాదాయ శాఖ అధికారి ఒకరు తెలిపారు.

ఎకరాకు రూ.2 కోట్లు ఇవ్వాలి

» లేకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తాం

» మామునూరు ఎయిర్‌పోర్టు భూనిర్వాసిత రైతుల హెచ్చరిక

మామునూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా మామునూరు ఎయిర్‌పోర్టు కోసం భూములు కోల్పోతున్న తమకు పరిహారంగా ఎకరాకు రూ.2 కోట్లు చెల్లించాలని భూ నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. లేకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. గాడిపల్లి, గుంటూర్ పల్లి గ్రామాలకు చెందిన 40 మంది రైతులు శనివారం ఎయిర్‌పోర్ట్ సమీపంలో రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కమర్షియల్ భూములకు సరైన ధర కల్పిస్తామని హామీలిచ్చిన జిల్లా మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు ఇప్పుడు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు కలెక్టర్ రైతులతో సమావేశం నిర్వహించారని, గజానికి రూ.4 వేలు ఇస్తామని హామీలిచ్చారని తెలిపారు. ఈ విషయమై అనేకసార్లు ఎమ్మెల్యేలను కలిసినా ప్రయోజనం లేదన్నారు.

నిద్రలో ఉన్న తండ్రిపై గొడ్డలితో దాడి

» బైక్ కొనివ్వలేదని ఓ కుమారుడి ఘాతుకం

ఖమ్మం రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బైక్ కొనివ్వలేదని ఓ కుమారుడు నిద్రలో ఉన్న తండ్రిపై గొడ్డలితో దాడి చేశాడు. ఖమ్మం జిల్లా మంగళగూడెంలో ఈ నెల 13న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళగూడెం గ్రామానికి చెందిన బండారు నాగయ్య, నాగలక్ష్మి దంపతుల కుమారుడు సతీశ్(20) 8వ తరగతి తర్వాత చదువు మానేసి జులాయిగా తిరుగుతున్నాడు. రెండు నెలల క్రితం సెల్‌ఫోన్ కోసం గొడవ చేయగా తల్లిదండ్రులు కొనిచ్చారు. మళ్లీ బైక్ కోసం ఇబ్బంది పెట్టగా.. తాము కొనలేమని, ఏదైనా పనిచేసుకొని కొనుక్కోవాలని వారు తేల్చి చెప్పారు. ఈ నెల 13న కూడా బైక్ గురించి గొడవ జరగ్గా.. "ఈ రోజే మిమ్మల్ని ఇద్దరిని చంపుతాను" అని సతీశ్ బెదిరించాడు. ఆ రోజు తల్లిదండ్రులతో పాటే నిద్రపోయిన అతడు అర్ధరాత్రి లేచి ఇంట్లో ఉన్న గొడ్డలితో గాఢ నిద్రలో ఉన్న తండ్రి నాగయ్య తలపై వేటు వేశాడు. ఇంతలోనే నాగలక్ష్మి భర్త వద్దకు వెళ్లే ప్రయత్నం చేయగా.. సతీశ్ ఆమెపై కూడా దాడికి ప్రయత్నించాడు. దీంతో ఆమె ఇంట్లో నుంచి బయటకు వచ్చి పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చారు. అప్పటికే సతీశ్ గొడ్డలి అక్కడే వదిలేసి పరారయ్యాడు. నాగలక్ష్మి స్థానికుల సహాయంతో భర్తను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నాగలక్ష్మి ఫిర్యాదుతో పోలీసులు సతీశ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడిపై అట్రాసిటీ కేసు

» దళితురాలిని కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

» జెండా ఆవిష్కరణ సందర్భంగా ఉద్రిక్తత

» నిరసనకారులపై నర్సారెడ్డి కౌంటర్ ఫిర్యాదు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సారెడ్డిపై సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యకర్త పుట్ల అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నర్సారెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు విజయ్‌కుమార్‌పై చేయి చేసుకోవడంతో కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సిద్దిపేట డీసీసీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణకు వచ్చిన నర్సారెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు నిరసన తెలిపారు. జెండా ఆవిష్కరణ ముగించుకుని తిరిగివెళ్తున్న నర్సారెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకున్నారని, ఆ సమయంలో నర్సారెడ్డి తనను కులం పేరుతో దూషించారని పుట్ల అనసూయ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు నర్సారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అదే సమయంలో, తన కాన్వాయ్‌ను అడ్డుకున్నారని నర్సారెడ్డి కౌంటర్ ఫిర్యాదు చేయగా, నలుగురు కాంగ్రెస్ నాయకులపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

19న ఉద్యోగుల జేఏసీ అత్యవసర భేటీ

హైదరాబాద్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పట్ల ప్రభుత్వ ఉదాసీన వైఖరికి నిరసనగా ఈ నెల 19న అత్యవసర సమావేశానికి ఉద్యోగుల జేఏసీ పిలుపునిచ్చింది. ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ఆగస్టు 15వ తేదీలోగా పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ గడువు విధించిన ప్పటికీ, 63 డిమాండ్లలో ఆర్థిక భారం లేని సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించలేదని పేర్కొంది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘానికి, ఆ తరువాత ఐఏఎస్ అధికారులతో ఏర్పాటైన కమిటీలకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలనే చిత్తశుద్ధి లోపించిందని దుయ్యబట్టారు. 19న జరిగే సమావేశం అనంతరం తమ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఏడేళ్ల ఎడారి జీవితం సుఖాంతం

» సౌదీ నుంచి నేడు హైదరాబాద్‌కు తాళ్లపల్లి ఈశ్వర్ రాక

» పొన్నం చొరవతో సొంతూరికి హనుమకొండ జిల్లా వాసి



తాళ్లపల్లి ఈశ్వర్

భీమదేవరపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం వెళ్లి ఏడేళ్లు సౌదీ అరేబియాలో చిక్కుకున్న హనుమకొండ జిల్లా వాసి కథ సుఖాంతమైంది. 2017లో సౌదీకి వలస వెళ్లిన భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామ గీత కార్మికుడు తాళ్లపల్లి ఈశ్వర్.. నాటి నుంచి అక్కడ ఓ ఖర్జూర తోటలో చిక్కుకున్నాడు. ఈశ్వర్‌ను స్వదేశానికి రప్పించాలని కోరుతూ.. ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి మార్గదర్శకత్వంలో ఈశ్వర్ భార్య లత, ఇద్దరు కూతుళ్లు గత జూన్ 27న హైదరాబాద్‌లోని 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' కౌంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు వినతిపత్రం అందజేశారు. సీఎం ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్యా దేవరాజన్ ప్రత్యేక శ్రద్ధతో కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌కు రియాద్‌లోని భారత ఎంబసీకి రాష్ట్ర ప్రభుత్వ జీఏడీ ఎన్నారై విభాగం లేఖలు రాసింది. గ్లోబల్ తెలంగాణ ఫోరం అధ్యక్షుడు మహ్మద్ జబ్బార్.. భారత ఎంబసీతో సమన్వయం చేసి.. ఈశ్వర్ సొంతింటికి వెళ్లడానికి మార్గం సుగమం చేశారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో సౌదీ నుంచి ఈశ్వర్ ఆదివారం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. సొంతూరికి బయలుదేరుతూ భావోద్వేగానికి గురైన తాళ్లపల్లి ఈశ్వర్.. 'ఏడున్నవే నా పల్లె.. నువ్వు ఏడున్నవే నా తల్లి.. నీ వాడిలోకి వస్తాను తల్లీ.. నన్ను సల్లంగ చూడు' అంటూ పాడిన పాటను ఐఏఎస్ అధికారి దివ్యా దేవరాజన్‌కు అంకితమిచ్చారు.



తిరుమలకు పోటెత్తిన భక్తులు

తిరుమల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండ భక్తులతో కిక్కిరిసిపోయింది. శనివారం రద్దీ మరింత ఎక్కువైంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్కులోని 9 షెడ్లు నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్, బాటగంగమ్మ, శ్రీవారి సేవా సదన్ సర్కిల్ మీదుగా ఆక్టోపస్ భవనం వరకు దాదాపు 3 కిలోమీటర్ల మేర వ్యాపించింది. దీంతో సాయంత్రం 5 గంటల తర్వాత కల్యాణ వేదిక వద్ద క్యూలైన్ మూసివేశారు. సాయంత్రం 6 గంటల తర్వాత రద్దీ తగ్గింది.

సీఎం సహాయ నిధిని దొంగ పేర్లతో దోచేశారు

» కోదాడ మాజీ ఎమ్మెల్యే సిబ్బంది చేతివాటం

» లబ్ధిదారులకు డబ్బులు ఇవ్వకుండా అవే పేర్లు కలిగిన వ్యక్తుల ఖాతాల్లో జమ

» ఆపై మొత్తాన్ని పంచుకున్న ముఠా

» ఆరుగురి అరెస్టు..

సూర్యాపేట క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో ఆస్పత్రిపాలై అప్పులు చేసి బిల్లులు చెల్లించినవారు.. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద సాయం పొందేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని కొందరు పక్కదారి పట్టించారు. ఎమ్మెల్యే వద్ద సహాయకులుగా పనిచేస్తూ ఆయన ఇప్పించిన సీఎంఆర్ఎఫ్ నిధులను లబ్ధిదారులకు దక్కకుండా దోచుకున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ వద్ద పనిచేసే సిబ్బంది ఈ అక్రమానికి పాల్పడ్డారు. లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను రీవ్యాలిడేషన్ చేయించుకుని అదే పేర్లతో ఉన్న వేరే వ్యక్తుల పేర.. వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయించారు. ఆ వ్యక్తులకు కొంత కమీషన్ ఇచ్చి.. ఖాతాల్లోని మొత్తాన్ని తీసుకొని వాటాల కింద పంచుకున్నారు. ఈ అక్రమాలకు పాల్పడ్డ ఆరుగురు వ్యక్తులను కోదాడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.9.30 లక్షల నగదు, వాడని 8 చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట ఎస్పీ కొత్తపల్లి నర్సింహ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. బొల్లం మల్లయ్యయాదవ్ క్యాంపు కార్యాలయంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న చింతలపాలెం మండలం దొండపాడు గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి చెడపంగు నరేష్, పీఏగా పనిచేసే మేళ్లచెర్వు మండలం వేపల మాధారం గ్రామానికి చెందిన మర్ల వీరబాబు, మోతె మండలం సర్వారం గ్రామానికి చెందిన ఉప్పల మధు.. సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసే విషయాలను పర్యవేక్షించేవారు. 2023 నవంబరులో అసెంబ్లీ ఎన్నికల కోడ్ వస్తుందని భావించి.. నరేష్, వీరబాబు, మధు, వారి వెంట తిరిగే మునగాల మండల నారాయణగూడెం గ్రామానికి చెందిన సూరగాని రాంబాబుతో కలిసి వివిధ పేర్లతో అప్పటికే మంజూరైన 44 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఇవ్వకుండా పక్కన పెట్టారు.

పేర్లు మార్చి నగదు డ్రా..

హైదరాబాద్‌లో ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వరంగల్ జిల్లా రంగశాయిపేటకు చెందిన గుంటుక సందీప్‌ను వీరంతా కలిశారు. అతడి ద్వారా చెక్కులను రీవ్యాలిడేషన్ చేయించి అదే పేర్లతో ఉన్న ఇతరులను చూసుకుని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయించారు. బ్యాంకు నుంచి నరేష్ మిత్రుడైన ప్రైవేట్ ఉద్యోగి రంగిశెట్టి వెంకటరావు ద్వారా డబ్బు డ్రా చేయించారు. వచ్చిన నగదును అందరూ కలిసి వాటాలు పంచుకున్నారు. మొత్తం 44 చెక్కులకు సంబంధించి రూ.15,83,500 విలువ కాగా, అందులో ఎనిమిది చెక్కులు వివిధ కారణాలతో విత్‌డ్రా కాలేదు. 36 చెక్కులకు సంబంధించి మొత్తం రూ.13.63 లక్షలు డ్రా చేసి నకిలీ లబ్ధిదారులకు కమీషన్ రూపంలో రూ.1.18 లక్షలు ఇచ్చారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు నిందితులను శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారించగా.. నేరాన్ని అంగీకరించారు. వారిపై కేసు నమోదు చేసి నిందితుల నుంచి రూ.9.30 లక్షల నగదుతోపాటు ఆరు వాడని చెక్కులు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్రంలో గంటకు 2 అబార్షన్లు

(మొదటిపేజీ తరువాయి)



స్థానంలో తెలంగాణ, 371 శాతం పెరుగుదలతో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నాయి. ఆ తర్వాత కేరళ(203 శాతం), కర్ణాటక(156 శాతం) ఉన్నాయి. ఇక ఉత్తరాది రాష్ట్రాల్లో 158 శాతంతో రాజస్థాన్ అగ్రస్థానంలో, 132 శాతంతో బిహార్ రెండో స్థానంలో ఉన్నాయి. కాగా 2024-25లో లక్షకు పైగా ఎంటీపీలు జరిగిన రాష్ట్రాల జాబితాలో మహారాష్ట్ర టాప్‌లో నిలిచింది. ఆ రాష్ట్రంలో 2,07,019 ఎంటీపీలు జరిగాయి. ఐదేళ్ల కిందట ఆ రాష్ట్రంలో లక్ష ఎంటీపీలు జరగ్గా.. ప్రస్తుతం అది రెట్టింపయింది. ఆ తర్వాత తమిళనాడులో 10,414 ఎంటీపీలు జరిగినట్లు కేంద్రం వెల్లడించింది.

నమోదులో మార్పుల వల్లే..

అసాధారణ రీతిలో అబార్షన్ల సంఖ్య పెరగడానికి ప్రధాన కారణం రిపోర్టింగేనని వైద్యాధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ప్రతీ నెలా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదయ్యే ఎంటీపీల వివరాలను డీఎంహెచ్‌వోలకు పంపాలి. వాటిని విధిగా హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(హెచ్ఎమ్ఐఎస్)లో నమోదు చేయాలి. ఈ పోర్టల్‌ను కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్వహిస్తుంది. గత ఐదేళ్లలో హెచ్ఎమ్ఐఎస్‌లో నమోదైన ఎంటీపీల వివరాలనే తాజాగా కేంద్రం పార్లమెంట్‌కు నివేదించింది. గతంలో ఏడు వారాల్లోపు గర్భవిచ్ఛిత్తి అయ్యే వివరాలను నమోదు చేసేవారు కాదు. ఇప్పుడు ఆ వివరాలను నమోదు చేస్తున్నారు. అలాగే శస్త్రచికిత్స ద్వారా చేసే అబార్షన్లనే గర్భవిచ్ఛిత్తి కేసులుగా నమోదు చేసేవారు. ఇప్పుడు మందుల ద్వారా అబార్షన్ అయ్యే వివరాలను కూడా చూపుతున్నారు. ఏదైనా కారణం చేత గుండె కొట్టుకోవడం ఆగిపోయిన పిండాలను కూడా ఎంటీపీలుగా నమోదు చేస్తున్నారు. గతంలో ఇవన్నీ రిపోర్ట్ చేసేవారు కాదు. ప్రస్తుతం ఇవన్నీ పక్కాగా లెక్కల్లో చూపడం వల్లనే మన దగ్గర ఎంటీపీలు అధికంగా నమోదవుతున్నాయని వైద్యవర్గాలు పేర్కొన్నాయి.

పెరిగిన సాంకేతికత, ఫీటల్ స్పెషలిస్టులు..

గతంలో గర్భం దాల్చిన 24 వారాలకు టిఫా స్కానింగ్ చేసేవారు. ఇందులో శిశువుకు ఏ చిన్న లోపం ఉన్నా బయటపడేది. ఇప్పుడు 12-14 వారాలకే చేయించుకుంటున్నారు. ప్రస్తుతం అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. దీంతో మూడు నెలలకే శిశువు పెరుగుదల, అనారోగ్యం, అవయవ లోపాలు ఆ స్కానింగ్‌తో బయట పడుతున్నాయి. గతంలో రేడియాలజిస్టులే స్కానింగ్ చేసేవారు. ప్రస్తుతం ఫీటల్ మెడిసిన్ అందుబాటులోకి వచ్చింది. ఫీటల్ స్పెషలిస్టులు స్కానింగ్ చేసి, మూడు నెలల గర్భంలోని శిశువుల్లో లోపాలను చెప్పేస్తున్నారు. దాంతో తల్లిదండ్రులు ఎంటీపీకి మొగ్గుచూపుతున్నారు. కొవిడ్ తర్వాత అవయవ లోపాలుండే గర్భస్థ పిండాలను ఎక్కువగా చూస్తున్నామని, అటువంటి కేసులన్నీ ఎంటీపీలే అవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. గర్భధారణ సమయంలో వచ్చే షుగర్‌తో శిశువుల్లో అవయవ లోపాలు ఏర్పడతాయని, దాని వల్ల కూడా ఎంటీపీలు అవుతున్నాయని అంటున్నారు.

ఐదేళ్లలో నమోదైన ఎంటీపీలు

	2020-21	2021-22	2022-23	2023-24	2024-25
తెలంగాణ	1578	3114	4071	12365	16059
ఆంధ్రప్రదేశ్	2282	9119	8446	8949	10676
కేరళ	8525	10989	14519	20179	25884

శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనుకుంటున్నారు



ఎంటీపీల రిపోర్టింగ్ ఇప్పుడు పక్కాగా ఉంటోంది. అందుకే వాటి సంఖ్య పెరిగింది. శిశువులో ఏ చిన్న లోపం ఉన్నా తల్లిదండ్రులు గర్భవిచ్ఛిత్తికే మొగ్గు చూపుతున్నారు. సంపూర్ణ ఆరోగ్యవంతమైన బిడ్డను కనాలనుకుంటున్నారు. ఎంటీపీ చట్టాన్ని సవరించిన తర్వాత 24 వారాల వరకు అబార్షన్ చేసే అవకాశం కలిగింది. గతంలో ఇది 14 వారాల వరకే ఉండేది. ప్రస్తుతం ఆలస్యంగా వివాహాలు చేసుకునే వారి సంఖ్య పెరిగింది. బీపీ, షుగర్, ఇతర అనారోగ్య సమస్యలతో గర్భం ధరించడం ఎంటీపీలకు కారణమవుతోంది. పెళ్లయిన వెంటనే గర్భం వస్తే వద్దనుకునే దంపతులు కూడా ఉంటున్నారు.

- డాక్టర్ ఎం. ప్రశాంతి, సీనియర్ గైనకాలజిస్టు, ప్రశాంతి రెయిన్‌బో ఆస్పత్రి, వరంగల్

ఉస్మానియా యూనివర్సిటీపై మండలి జోక్యం తగదు

» మా ప్రమేయం లేకుండా కోర్సుల ప్రకటన

» ఉన్నతాధికారులకు ఓయూ రిజిస్ట్రార్ లేఖ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా వర్సిటీ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేవిధంగా తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) వ్యవహరిస్తోందని ఓయూ రిజిస్ట్రార్ నరేశ్ రెడ్డి పేర్కొన్నారు. వర్సిటీ అభ్యున్నతికి సూచనలు చేయాల్సిన ఉన్నత విద్యామండలి, తమ ఆమోదం లేకుండా నిర్ణయాలు తీసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీపై మండలి జోక్యం తగదని పేర్కొన్నారు. ఈ మేరకు ఇటీవల ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావుకు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డికి, ఉన్నత విద్యామండలితో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఆయన లేఖలు రాశారు. మండలి నిర్ణయాలు అమలు చేయాలంటూ ఓయూపై ఒత్తిడి తీసుకొస్తున్నారని, విద్యా, విషయ, పాలనా వ్యవహారాలన్నింటిలోనూ ఉన్నత విద్యామండలే ఆదేశాలను జారీచేస్తోందని ఆయన పేర్కొన్నారు. వర్సిటీకి కనీసం సమాచారం ఇవ్వకుండా కొత్త కోర్సులను ప్రకటిస్తోందని, వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో కొత్త యూజీ కోర్సులైన బీటెక్- బయోటెక్నాలజీని, ఇంజనీరింగ్ డిసిప్లిన్‌ను ప్రవేశ పెట్టాలంటూ ఇటీవల మండలి ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. అయితే ఆయా కోర్సులను బోధించడానికి అవసరమైన నియత అధ్యాపకులు, తరగతి గదులు, హాస్టల్ సౌకర్యాలు తమ వద్ద లేవని పేర్కొన్నారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలో 2025-26 నుంచి బీ.ఏ. తెలుగు (ఆనర్స్) కోర్సును ప్రవేశపెట్టబోతున్నట్లు ప్రకటించారని, పీజీ, పీహెచ్‌డీ కోర్సులకు నిలయమైన ఆర్ట్స్ కళాశాలలో కొత్తగా అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సును ప్రకటించడంతో విద్యార్థి సంఘాలతో పాటు వర్సిటీ పరిపాలనా గందరగోళానికి గురైందని తెలిపారు. గతేడాది వరకు అన్ని యూజీ మార్గదర్శకాలను వర్సిటీ స్థాయిలో నిర్ణయించేవారని. కానీ ఇప్పుడు ఉన్నత విద్యామండలి జోక్యం చేసుకుంటోందని వివరించారు. విశ్వవిద్యాలయాన్ని సంప్రదించకుండా మండలి స్వయంగా నిర్ణయాలు తీసుకుంటోందని, ఇది వర్సిటీ స్వయం ప్రతిపత్తికి విఘాతం కలిగిస్తోందని రిజిస్ట్రార్ లేఖలో పేర్కొన్నారు.



రాష్ట్ర సాధనలో వైద్యగర్జన పాత్ర మరువలేనిది

» ఉస్మానియా వైద్యగర్జన ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు

హైదరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 2010లో ఉస్మానియా మెడికల్ కాలేజీ విద్యార్థులు వైద్య గర్జన నిర్వహించిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం ఉస్మానియా వైద్య కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెడికల్ జేఏసీ చైర్మన్ డాక్టర్ బొంగు రమేష్, ప్రత్యేక అతిథిగా తెలంగాణ పబ్లిక్ హెల్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కత్తి జనార్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 2010లో వైద్య గర్జన సభ నిర్వహించిన నాయకులను సత్కరించారు. నాటి పరిస్థితులు, ఉద్విగ్న క్షణాలను వక్తలు నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ దుర్గా కిరణ్ మాట్లాడుతూ వైద్య గర్జన గురించి చరిత్రలో లేకుండా చేశారని, నాటి స్ఫూర్తిని ముందుకు కొనసాగించడానికే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ బొంగు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో వైద్యుల పాత్ర మరవలేనిదన్నారు. తమ విధులకు ఆటంకం కలిగించకుండానే రాష్ట్ర సాధన పోరాటాలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఉస్మానియా వైద్య కళాశాల విద్యార్థులు, పూర్వ ఉద్యమ నాయకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

3 సార్లు అండాలు ఇస్తే 30వేలు!

» బిడ్డను కనిస్తే 4లక్షలు ఇస్తామంటూ ఎర

» ఫర్టిలిటీ కేంద్రాలతోనూ ముందస్తు ఒప్పందాలు

» లక్ష్మీరెడ్డి కేసులో విస్తుపోయే అంశాలు

» ఫర్టిలిటీ కేంద్రాలకు నోటీసులు



హైదరాబాద్ సిటీ/పేట్ బషీరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మూడు సార్లు అండాలు ఇస్తే రూ.30వేలు, సరగసీ ద్వారా పిల్లల్ని కనిస్తే రూ.4లక్షలు.. ఇస్తామంటూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మహిళలే లక్ష్యంగా లక్ష్మీరెడ్డి దందా సాగినట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పరిధిలో వెలుగులోకి వచ్చిన అద్దె గర్భం దందా కేసులో ప్రధాన నిందితురాలు లక్ష్మీరెడ్డి అలియాస్ లక్ష్మి, ఆమె కొడుకు నరేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును విచారిస్తున్న క్రమంలో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరిపేటకు చెందిన నరెద్దుల లక్ష్మీరెడ్డి అలియాస్ లక్ష్మి(45)పై 2024లో ముంబై పోలీసులు ఆమెపై మానవ అక్రమ రవాణా కేసు నమోదు చేసి, జైలుకు పంపారు. ఆ తర్వాత హైదరాబాద్ చేరుకున్న ఆమె.. మాదాపూర్, అమీర్‌పేట, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉన్న ఫర్టిలిటీ కేంద్రాలను సంప్రదించి, అండాలు కావాలన్నా, సరోగసీకి మహిళలు కావాలన్నా తాను ఏర్పాటు చేస్తానంటూ ఒప్పందాలు చేసుకుంది. తన కొడుకు, కూతురే ప్రధాన ఏజెంట్లుగా మారి, పేద మహిళలకు డబ్బు ఆశ చూపించి.. దందాలోకి లాగేవారని తేలింది. రహస్యంగా అద్దె గర్భాల దందాను నిర్వహిస్తున్న లక్ష్మీరెడ్డి.. ఆమె ఇంటిలోని మొదటి అంతస్థును బ్యాచిలర్స్‌కే అద్దెకివ్వడంపైనా పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. వారి వీర్యాన్ని ఏమైనా సేకరించారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా, లక్ష్మీరెడ్డి దందాతో సంబంధం ఉన్న పలు ఫర్టిలిటీ కేంద్రాలకు పోలీసులు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. వారి ద్వారా మరిన్ని వివరాలు రాబట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. లక్ష్మీరెడ్డి, ఆమె కొడుకు నరేందర్‌రెడ్డిని మరోసారి పోలీస్ కస్టడీకి తీసుకునేందుకు కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిసింది.

వెలుగులోకి వచ్చిందిలా..

కర్ణాటకకు చెందిన ఓ మహిళ భర్తకు రెండు కిడ్నీలు పాడైన విషయం తెలుసుకున్న లక్ష్మీ రెడ్డి.. సరగసీకి అంగీకరిస్తే చికిత్స చేయిస్తానని హామీ ఇచ్చింది. అందుకు ఆమె ఒప్పుకోవడంతో మాదాపూర్ లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించింది. ఆరోగ్యం కుదుటపడ్డాక విషయం తెలుసుకున్న మహిళ భర్త.. ఈ పంచాయితీ అంతా వద్దని, డబ్బులు ఎలాగోలా తిరిగిచ్చేద్దామని భార్యకు నచ్చజెప్పాడు. దీనిపై వారి మధ్య గొడవ జరగడం, విషయం బయటకు పొక్కడంతో ఈ బాగోతం వెలుగులోకి వచ్చింది. కుటుంబ అవసరాల కోసం అండాన్ని ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ఓ యువతి, గర్భాల అద్దెకు అంగీకరించిన ఏడుగురు మహిళలు పేద కుటుంబాల వారే కావడం గమనార్హం.

అధిక వడ్డీ ఎరగా వేసి.. 20 కోట్లతో పరారైన మోసగాడు

» వృద్ధులు, సాఫ్ట్‌వేర్, విశ్రాంత ఉద్యోగులే టార్గెట్

» మల్కాజిగిరిలో ఘటన



దినేశ్ పాణ్యం

మల్కాజిగిరి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇస్తానని ఆశచూపి ఓ మోసగాడు పలువురి వద్ద నుంచి దాదాపు రూ. 20 కోట్లు వసూలు చేసి పరారైన ఘటన హైదరాబాద్‌లోని మల్కాజిగిరిలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని సైనిక్‌పురి ప్రాంతానికి చెందిన దినేశ్ పాణ్యం, కవిత పాణ్యం భార్యభర్తలు. వీరి పిల్లలిద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. దినేశ్ పాణ్యం సైనిక్‌పురి చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో పరిచయాలు పెంచుకున్నాడు. స్థానికంగా ఓ కార్యాలయాన్ని ఏర్పాటుచేసుకుని, తాను షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెడతానని తమ వద్ద ఉన్న డబ్బును అప్పుగా కానీ, చేబదులుగా కానీ ఇస్తే ప్రతినెలా బ్యాంకులు ఇచ్చే వడ్డీ కంటే ఎక్కువగా ఇస్తానని నమ్మించాడు. అప్పు ఇచ్చిన వారికి ప్రతినెలా వడ్డీ క్రమం తప్పకుండా చెల్లించేవాడు. ప్రతి నెలా వడ్డీ తమ అకౌంట్లలో పడుతుండడంతో బాగానే ఉందని నమ్మి సుమారుగా 170 మంది ఈ ఉచ్చులో పడ్డారు. ఒక్కొక్కరు లక్షల్లో అప్పుగా ఇచ్చారు. మల్కాజిగిరి పరిసర ప్రాంతాల వాసులే కాకుండా ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు చెందిన పలువురు నుంచి అతడు దాదాపు రూ.20 కోట్లు వసూలు చేశాడు. కొన్ని నెలలుగా వడ్డీ అకౌంట్లలో పడకపోవడం, కార్యాలయంలో కూడా ఎవరూ లేకపోవడంతో బాధితులు జూన్ 2న కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన రెండు రోజులకే అతడి భార్య కవిత పాణ్యం అతడి నుంచి విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించడం విశేషం. ఆమెను సంప్రదించగా అతడితో తనకు ఇకపై ఎటువంటి సంబంధం లేదని చెబుతోందని బాధితులు తెలిపారు. ఫిర్యాదు చేసినా పోలీసులు ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వమే ఆదుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.